# భారత శక్తి
VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 299 | గురువారం,మే 21 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## సీఎం రేవంత్‌ను కలిసిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు



**హైదరాబాద్ (భారత శక్తి)**శిక్షణలో వున్న 2025 బ్యాచ్ ఐఏస్ అదికారులు బుధవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ట్రైనీ ఐఏఎస్ లు ఈట్టబోయిన సాయి శివాణీ, సచిన్ బసవరాజ్ గుట్టూరు, పోతరాజు హరి ప్రసాద్,పరాస్ కుమార్, పి సురేష్, నేలతూరు శ్రీకాంత్ రెడ్డిలు సీఎం ను కలిసారు. ఈ కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఛైర్ పర్సన్ శాంతి కుమారి, కోర్సు డైరెక్టర్ కందుకూరి ఉషారాణి తదితరులు వున్నారు.

---

### టెట్రా ప్యాక్‌లలోని వోడ్కాపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



- టెట్రా ప్యాక్‌లు సాచెట్లలో మద్యం అమ్మకాలను నిషేధించాలని పిటిషన్
- పిటిషన్ దాఖలు చేసిన కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ సంస్థ
- పండ్ల రసాలను పోలి ఉండి తప్పుదారి పట్టేంచేలా ఉందన్న పిటిషనర్

2లో..

### ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి: నారా లోకేశ్



- బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కర్నూలు, ఏఎస్ఆర్ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెడతాం
- డీఈవోలు, ఏపీసీలతో సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్

2లో..

### సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు.. 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు

- ఆపరేషన్ ఆక్టోబస్ 3.0లో భాగంగా వారిని అరెస్టు చేసిన పోలీసులు
- 13 రాష్ట్రాల్లో దాడుల నిర్వహించిన సైబర్ క్రైమ్ పోలీసులు
- 1,194 ఘోస్ట్ సిమ్ కార్డుల గుర్తింపు

2లో..

---

## లోక్‌భవన్‌లో గవర్నర్‌తో
# కీలక భేటీలు

**- శాంతిభద్రతలపై డీజీపీ, విద్యా సంస్కరణలపై ఉన్నత విద్యామండలి ఛైర్మన్ చర్చ**



**హైదరాబాద్, మే 20: భారత శక్తి,** రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను బుధవారం లోక్‌భవన్‌లో పలువురు ప్రముఖులు, వివిధ రంగాల ప్రతినిధులు విడివిడిగా కలుసుకున్నారు. రాష్ట్రంలోని శాంతిభద్రతలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, మహిళా సాధికారత వంటి పలు కీలక అంశాలపై ఈ సందర్భంగా చర్చలు జరిగాయి.

#### శాంతిభద్రతలపై సమీక్ష

తొలుత రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సీవీ ఆనంద్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్ గవర్నర్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిని, పోలీసులు తీసుకుంటున్న ముందస్తు చర్యలను వారు గవర్నర్‌కు వివరించారు.

#### విద్యా సంస్కరణలపై చర్చ

అనంతరం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి. బాలకిష్టారెడ్డి గవర్నర్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానం అమలు తీరును, ఉన్నత విద్యా రంగంలో ప్రవేశపెడుతున్న నూతన సంస్కరణలను ఆయన గవర్నర్‌కు వివరించారు.

#### బీమా రంగంపై చర్చలు

కడేల్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సోహన్‌లాల్ కడేల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కూడా గవర్నర్‌ను కలిసింది.

దేశంలో, రాష్ట్రంలో బీమా రంగానికి సంబంధించిన ప్రస్తుత పరిణామాలు, భవిష్యత్తు అవకాశాలపై వారు ఈ సందర్భంగా చర్చించారు.

2లో..

---

### కేంద్రమంత్రి నిర్మలతో ఉప ముఖ్యమంత్రి భట్టి భేటీ



**న్యూఢిల్లీ (భారత శక్తి)** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం సమావేశమయ్యారు. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్సీఐ(రాయాఅఎ) కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం ? విద్యా రంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్ఈఎం మినహాయింపు కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా "స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్ (రాయాఅఎ)" కింద తెలంగాణ రాష్ట్రానికి అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఉప

2లో..

---

## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా
# అప్రమత్తంగా ఉండాలి

**- కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**



**హైదరాబద్ (భారత శక్తి):** తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

---





## ప్రజా విశ్వాసమే అధికారుల అసలైన గుర్తింపు

**- ఆక్రమణల తొలగింపుపై ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దిశానిర్దేశం**

**- ఉద్యోగం హోదా కాదు... బాధ్యత! - క్షేత్రస్థాయి పరిశీలనతోనే సమస్యల పరిష్కారం**

**హైదరాబాద్, మే 20 :భారత శక్తి** ప్రజాసేవలో నిబద్ధత, పరిపాలనలో పారదర్శకత ప్రదర్శిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపినప్పుడే అధికారులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని హైదరాబాద్ విపత్తుల ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ, పర్యవేక్షణ సంస్థ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డీఐ)లో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ల సమావేశంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు.

2లో..

---

## బండి భగీరథ్ పోక్సో కేసు.. మరో సెక్షన్‌ను జత చేసిన పోలీసులు

- కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన భగీరథ్
- ఫోన్ లోని డేటాను డిలీట్ చేసిన వైనం
- సాక్ష్యాలను ధ్వంసం చేసిన సెక్షన్ జత చేసిన పోలీసులు



**హైదరాబాద్, మే 20 :భారత శక్తి** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ కీలక సాక్ష్యాలను మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిన నిందితుడు, పరారీలో ఉన్న సమయంలో పథకం ప్రకారం తన అత్యాధునిక ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను డిలీట్ చేయడమే కాకుండా, సోషల్ మీడియా అకౌంట్లను కూడా మాయం చేశాడు. అరెస్ట్ అనంతరం పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో సిమ్ కార్డ్ లేకపోవడం, ఫోన్ ఖాళీగా ఉండటంతో.. సాక్ష్యాలను ధ్వంసం చేసిన నేరం కింద పోలీసులు ఈ కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్ 238ను (గతంలో ఐపీసీ 201) జోడించారు. చట్టం నుంచి తప్పించుకోవడానికి ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు, నిందితుడి కంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో ఉచ్చు బిగించేందుకు సిద్ధమయ్యారు.ఐఫోన్ సెక్యూరిటీ ఫీచర్లు కఠినంగా ఉన్నప్పటికీ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఫీూూ) నిపుణుల వద్ద ఉన్న 'సెలెబ్రైట్' వంటి అంతర్జాతీయ స్థాయి అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ల ద్వారా డిలీట్ అయిన చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ ఐఫోన్ అంతర్గత మెమొరీని పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా, ఐక్లౌడ్ బ్యాకప్ సర్వర్ల నుండి డేటాను సేకరించేందుకు, అవసరమైతే కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకు సైతం సిద్ధమవుతున్నారు. వీటితో పాటు, నిందితుడు ఫోన్ స్విచ్ఛాఫ్ కావడానికి ముందు ఎక్కడ ఉన్నాడు,

2లో..

---

# అదే నా చివరి కోరిక

## నా శవంపై కాషాయ జెండా కప్పాల్సిందే

**- ఫాల్తుగాళ్లు చేసే ప్రచారాన్ని పట్టించుకోను**

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**హైదరాబాద్ (భారత శక్తి)** బండి సంజయ్ మాట్లాడుతూ ఉరిశిక్ష వేసే ముందు మీ చివరి కోరిక ఏమిటని బీజేపీలో కమిట్ మెంట్ తో పనిచేసే ఏ కార్యకర్తను అడిగితే చెప్పేది ఒక్కటే నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతారు.నాది అదే చివరి కోరిక కూడా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బండి సంజయ్ కొత్త పార్టీ పెడుతున్నారంటూ కొందరు ఫాల్తుగాళ్లు ప్రచారం చేస్తున్నారని, అట్లాంటి వాటికి స్పందించాల్సిన అవసరమే లేదని చెప్పారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేశారు. బండి సంజయ్ వస్తున్నారని సమాచారం అందుకున్న కార్యకర్తలు భారీ ఎత్తున పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. బీజేపీ జిందాబాద్, మోదీ జిందాబాద్, బండి సంజయ్ జిందాబాద్, రామచంద్రరావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సంజయ్ ఆప్ సంఘర్ష్ కరో హమ్ తుమ్హారే సాథ్ హై అంటూ నినదించారు. అనంతరం బండి సంజయ్ ను కలిసి సంఘీభావం ప్రకటిస్తూ పెద్ద ఎత్తున సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. దాదాపు 2 గంటలపాటు పార్టీ కార్యకర్తలతో గడిపిన బండి సంజయ్ అనంతరం బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తదితరులతో కలిసి మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు... ముఖ్యాంశాలు:మీరు కొత్త పార్టీ పెట్టబోతున్నారని కూడా వార్తలొస్తున్నాయి కదా,బండి సంజయ్ అంటే ఏమిటో మీకు తెలుసు.రాష్ట్ర ప్రజలకు తెలుసు.కార్యకర్తలందరికీ తెలుసు.ఫాల్తుగాళ్లు చేసే ప్రచారానికి స్పందించాల్సిన అవసరమే లేదు. బీజేపీ అంతర్గత శిక్షణా శిబిరాల్లో ఎంతో మంది కార్యకర్తలను తయారు చేసిన వ్యక్తులం మేం.ఎవరికైనా ఉరి తీయబోయే ముందు చివరి కోరిక అడుగుతారు.బీజేపీలో కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలను ఇదే విషయాన్ని అడిగితే చెప్పేది ఒక్కటే నేను చచ్చిపోయాక నా శవంపై కాషాయ జెండా కప్పాలని అడుగుతారు నాది అదే చివరి కోరిక కూడా,మిమ్ముల్ని కేబినెట్ నుండి బర్తరఫ్ చేయబోతున్నారని కొన్ని టీవీలు, డిజిటల్ మీడియాలో వార్తలొస్తున్నాయి కదా,తెలంగాణలో బీఆర్ఎస్ కు 17 ఎంపీ సీట్లున్నాయి కదా? ఆయన భాగస్వామ్యంతోనే కేంద్రంలోని ఎన్డీఏ నడుస్తోంది కదా,బహుశా నన్ను బర్త్ రఫ్ చేయాలనే నిర్ణయం కేసీఆర్, ఆయన కొడుకే తీసుకున్నట్లున్నారు.ఇంకా ఏమోం చేయబోతున్నారే వాళ్లనే అడగండి కేసీఆర్, కేటీఆర్ లను ఎద్దేవా చేస్తూ వేసిన సెటైర్..మిమ్ముల్ని త్వరలోనే అరెస్ట్ చేయబోతున్నారనే వార్తలు కూడా వస్తున్నాయి కదా?కేసీఆర్ కొడుకు విసిరే చిల్లర మెతుకులకు ఆశపడి ఒకట్రొండు ఛానళ్లు ఇట్లాంటి కథలను ప్రసారం చేస్తున్నాయి. అది చూసి కేసీఆర్ కొడుకు రాక్షసానందం పొందుతున్నడు.వాళ్ల ద్రుష్టితో చూస్తే నన్ను అరెస్ట్ చేయాల్సిందేమో. ఎందుకంటే,10 ఏళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు కొట్టినం కదా? పదేళ్ల కేసీఆర్ కుటుంబ అవినీతి అరాచక పాలనను బొందపెట్టినం కదా, అధికారం పోయిందనే కోపం వాళ్లకుంటది కదా, అందుకే నన్ను అరెస్ట్ చేయించాలని చూస్తున్నరేమో.బండి భగీరథ్ విషయంలో మీరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరెస్ట్ కాకుండా జాప్యం చేశారనే ఆరోపణలున్నాయి కదా?కోర్టు పరిధిలో ఉంది.కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. కన్న కొడుకును ఒక తండ్రి నేరుగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా, కానీ నేను విచారణ జరపాలని పోలీసులు కోరితే..నేనే

2లో..

## టెట్రా ప్యాక్‌లలోని వోడ్కాపై
# కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

టెట్రా ప్యాక్‌లు, సాచెట్ల వంటి గుర్తించలేని ప్యాకేజీలలో మద్యం అమ్మకాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈరోజు కేంద్రం స్పందనను కోరింది. ఇటువంటి ప్యాకేజింగ్ వినియోగదారులను తప్పుదోవ పట్టించి, మైనర్ల మద్యపానాన్ని ప్రోత్సహించగలదని పిటిషన్‌దారు పేర్కొన్నారు. కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే లాభాపేక్షలేని సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, పలు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది. టెట్రా ప్యాక్, సాచెట్లలో వోడ్కా విక్రయాలు వినియోగదారులను తప్పుదారి పట్టిస్తాయని, మైనర్లను మద్యం వైపు ప్రోత్సహించే అవకాశం ఉందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ సంస్థ తరఫున లాయర్ విపిన్ నాయర్ వాదనలు వినిపిస్తూ, అలాంటి అనేక మద్యం ఉత్పత్తుల ప్యాకింగ్‌పై సరైన హెచ్చరికలు ఉండటం లేదని కోర్టుకు తెలిపారు. అవి పండ్ల రసాలను పోలి ఉండేలా ప్యాక్ చేస్తున్న సందర్భాలు ఉన్నట్లు తెలిపారు. అలాంటి ప్యాకేజీలలో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకే విధమైన విధానాన్ని రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఈ అభ్యర్థనను పరిశీలించింది. ప్యాకింగ్ తప్పుదోవ పట్టించేలా ఉందంటూ కేంద్రం, రాష్ట్రాల్లోని ఎక్సైజ్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది.

# లోక్‌భవన్‌లో గవర్నర్‌తో కీలక భేటీలు

### బీజేపీ నేతల భేటీ

బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎన్. మల్లారెడ్డి నేతృత్వంలోని ఒక ప్రతినిధి బృందం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించింది.

### మహిళా సాధికారతకు అండ

'5వ ఎడిషన్ భారత్ కే అన్మోల్ నారీ శక్తి అవార్డ్స్-2026' నిర్వాహకుడు మహ్మద్ నిజాముద్దీన్ తన బృందంతో కలిసి గవర్నర్‌ను కలుసుకున్నారు. మహిళా సాధికారత కోసం తమ సంస్థ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను, అవార్డుల ప్రధానోత్సవ వివరాలను వారు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

# కేంద్రమంత్రి నిర్మలతో ఉప ముఖ్యమంత్రి భట్టి భేటి

ముఖ్యమంత్రి కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని వివరించారు.ఉప ముఖ్యమంత్రి వెంట ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డా. గౌరవ ఉప్పల్ ఉన్నారు

# అదే నా చివరి కోరిక

మా అబ్బాయిని పోలీసు విచారణ కోసం అప్పగించా. నేను ప్రజల మధ్య ఉన్నాను కాబట్టే, ప్రజలు బీజేపీతో ఉన్నారు కాబట్టే నన్ను,నా పార్టీని బదనాం చేసేందుకు కేసీఆర్ కొడుకు సోషల్ మీడియాలో ఫేక్ మీడియా ఫ్యాక్టరీ ద్వారా నాపైన ఇట్లాంటి విష ప్రచారం చేయిస్తున్నాడు. ఎన్ని వండి వార్చినా జనం బీజేపీతోనే ఉన్నారు. ఫేక్ వార్తలను,ఫేక్ స్టోరీలను చూసి జనం నవ్వుకుంటున్నారు.

# ప్రజా విశ్వాసమే అధికారుల అసలైన గుర్తింపు

### క్షేత్రస్థాయిలోనే వాస్తవాలు తెలుస్తాయి..

సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించినప్పుడే వాస్తవ పరిస్థితులు అవగతమవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్ష అనుబంధాన్ని ఏర్పరచుకోవడం ద్వారా వారి సమస్యలను సులభంగా అర్థం చేసుకోవచ్చని, వాటికి సత్వర పరిష్కారాలు చూపడం ద్వారా ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొనవచ్చని వివరించారు. ప్రతి నిర్ణయంలోనూ నిష్పక్షపాత వైఖరిని అవలంబిస్తూ, ప్రజా ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని కేవలం ఒక హోదాగా కాకుండా, అప్పగించిన బాధ్యతగా భావించి సేవాదృక్పథంతో ముందుకు సాగాలని హితవు పలికారు.

### భూముల పరిరక్షణపై ప్రత్యేక అవగాహన

ఈ సందర్భంగా "భూముల పరిరక్షణ - ఆక్రమణల తొలగింపు" అనే అంశంపై ప్రొబేషనరీ అధికారులకు కమిషనర్ సమగ్ర అవగాహన కల్పించారు. ప్రభుత్వ భూముల సంరక్షణలో రెవెన్యూ అధికారుల పాత్ర ఎంతటి కీలకమైనదో గుర్తుచేశారు. భూ ఆక్రమణల నివారణకు అనుసరించాల్సిన చట్టపరమైన విధానాలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిళ్లను ఎలా అధిగమించాలో వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని (టెక్నాలజీ) విస్తృతంగా వాడుకుంటూ భూ రికార్డుల నిర్వహణను, వివరాల నమోదును పక్కాగా చేపట్టాలని సూచించారు.

### మీకంటూ ఒక ప్రత్యేక ముద్ర (బ్రాండ్) ఉండాలి!

"అధికారిక విధుల నిర్వహణలో మీకంటూ ఒక ప్రత్యేకతను చాటుకోవాలి. సమాజంలో మీకంటూ ఒక మంచి ముద్రను (బ్రాండ్) సృష్టించుకోవాలి" అని రంగనాథ్ ఆకాంక్షించారు. నిజాయితీ, నిబద్ధత, పారదర్శకతతో వ్యవహరిస్తూ, తమ విధులకు సంపూర్ణ న్యాయం చేస్తున్నామనే తృప్తి అధికారుల్లో ఉంటే ఎలాంటి మానసిక ఒత్తిడికైనా దూరం కావచ్చునని ఉద్ఘాటించారు.

### హైడ్రా వ్యూహాలపై ఆసక్తి చూపిన శిక్షణ నిపుణులు:

ఈ సమావేశంలో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఎంతో ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా 'హైడ్రా' సంస్థ పనితీరు, ఆపరేషన్ల విధానాలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఆక్రమణలు తొలగించేటప్పుడు ఎదురయ్యే రాజకీయ, సామాజిక ఇబ్బందులు, పరిపాలనాపరమైన సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని చెరువుల పునరుద్ధరణతో పాటు, రాబోయే వర్షాకాలంలో వరదల కట్టడికి, విపత్తుల నిర్వహణకు హైడ్రా ముందస్తుగా తీసుకుంటున్న చర్యల వ్యూహాలను కమిషనర్ అడిగి తెలుసుకుని అభినందించారు.

## బండి భగీరథ్ పోక్సో కేసు..
# మరో సెక్షన్‌ను జత చేసిన పోలీసులు

ఎవరితో మాట్లాడాడు, ఆశ్రయం కల్పించిన తెరవెనుక సూత్రధారులు ఎవరు అనే వివరాల కోసం సెల్ టవర్ మ్యాపింగ్, కాల్ డేటా రికార్డులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సాంకేతిక ప్రక్రియల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, కేసును పటిష్టంగా కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు 'ప్లాన్ బి'ని కూడా సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా బాధితురాలి ఫోన్‌ను మరో కీలక సాక్ష్యంగా మార్చనున్నారు. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపు సందేశాలు, ఫొటోలు, వీడియోలను 'రిసీవ్డ్ డేటా' రూపంలో సేకరించి, వాటిని ధ్రువీకరించి కోర్టు ముందు ఉంచనున్నారు. పోక్సో కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం నేర తీవ్రతను మరింత పెంచుతుందని చట్టపరమైన నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు..
## 66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు

ఆపరేషన్ ఆక్టోబస్ 3.0లో భాగంగా సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు అందిస్తున్న 66 మందిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 13 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించారు.

ఘోస్ట్ సిమ్ కార్డులతో దేశవ్యాప్తంగా ఎన్నో సైబర్ నేరాలు చేసినట్లు గుర్తించారు. పద్దెనిమిది బృందాలతో ఏడురోజుల పాటు ఈ ఆపరేషన్‌ను కొనసాగించగా, 1,194 ఘోస్ట్ సిమ్ కార్డులను గుర్తించి, వాటిలో 544 కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. సైబర్ నేరగాళ్ళకు 20 మంది పీవోఎస్ ఏజెంట్లు సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది వోడాఫోన్ ఐడియా, ఏడుగురు ఎయిర్‌టెల్, ముగ్గురు జియో పీవోఎస్ ఏజెంట్లను అరెస్టు చేశారు. సిమ్ కోసం వచ్చిన వారికి తెలియకుండా మరో సిమ్ యాక్టివేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో
# నమ్మకం కలిగించండి: నారా లోకేశ్

**- బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి - కర్నూలు, ఏఎస్ఆర్ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెడతాం**
**- డీఈవోలు, ఏపీసీలతో సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్**

ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా అధికారులు కృషిచేయాలి, ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో డీఈవోలు, ఏపీసీలతో మంత్రి సమీక్షించారు. కాకినాడ జిల్లాలో అప్పర్ ప్రైమరీ స్కూల్స్ లో స్టూడెంట్, టీచర్ యావరేజ్ అటెండెన్స్ తక్కువగా ఉంది. దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, మధ్యాహ్న భోజనం వినియోగంలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. అపార్ ఐడీ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచారని మంత్రి ప్రశంసించారు. కాకినాడ డీఈవో పి.రమేష్ స్పందిస్తూ, జిల్లాలో 3,665 మంది డ్రాపౌట్స్ ఉన్నారని, ఎన్ రోల్ కానివారు 14,840 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు అసలు ఎన్‌రోల్ కానివారిపై దృష్టిసారించామని చెప్పారు. పలు మండలాల్లో సూడెంట్స్ అటెండెన్స్ తక్కువగా ఉండటంపై తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది 80.47శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 500కు పైగా మార్కులు సాధించిన వారు 2789 మంది ఉన్నారని తెలిపారు.

### ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాలి

ప్రకాశం జిల్లాలో విద్యార్థుల డ్రాపౌట్స్ పై మంత్రి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వలస వెళ్లే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాఠశాలకు సెలవుల అనంతరం విద్యార్థులు ఏ ప్రాంతానికి వెళ్లినా వారి చదువు కొనసాగేలా ట్రాక్ చేయాలని ఆదేశించారు. సీజనల్ హాస్టల్స్ ను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో స్టూడెంట్, టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, లీప్ యాప్ లో టీచర్ అటెండెన్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. స్టూడెంట్, టీచర్ రేషియోపైనా దృష్టిసారించాలన్నారు. ప్రకాశం జిల్లా డీఈవో సీవీ రేణుక స్పందిస్తూ.. ఈ ఏడాది జిల్లాలో పది శాతం ఎన్ రోల్ మెంట్ పెరిగిందని చెప్పారు. పాఠశాలలకు సెలవుల అనంతరం వ్యవసాయ పనుల్లో పడి విద్యార్థుల హాజరు నమోదు తక్కువగా ఉంటోందని వివరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారని, పదో తరగతి టాపర్లను సన్మానించారని తెలిపారు. వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని చెప్పారు.

### బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు జిల్లాలో బాల్య వివాహాల పట్ల మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో జీఎఫ్ఎల్ఎన్ పై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టూడెంట్స్ ఫెర్ఫార్మెన్స్ కూడా తక్కువగా ఉందని, ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్ లో కూడా చిత్తూరు వెనుకబడి ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. చిత్తూరు డీఈవో కే.రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. చిత్తూరుకు తమిళనాడు, బెంగళూరు దగ్గరగా ఉండటంతో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పలుచోట్ల బాల్యవివాహాలు కూడా జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృష్టికేంద్రీకరిస్తామని చెప్పారు.

### ఏఎస్ఆర్ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటాం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఆ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. హైస్కూల్స్ లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థుల చేరిక తక్కువగా ఉందని, దీనిపైనా దృష్టిపెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలపై స్పందిస్తూ, అక్కడి విద్యార్థుల్లో కసి ఉందని, వారికి దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. డీఈవో కే.రామకృష్ణారావు స్పందిస్తూ.. జిల్లాలో 3,242 మంది డ్రాపౌట్స్ ఉన్నారు. స్టూడెంట్స్ యావరేజ్ అటెండెన్స్ 79.30 శాతం ఉందని, టీచర్ల సరాసరి హాజరు 78.40 శాతంగా ఉందని వివరించారు.

### స్లిప్ టెస్ట్ అటెండెన్స్ పై దృష్టిపెట్టాలి

ఏలూరు జిల్లాలో స్లిప్ టెస్ట్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. టీచర్ అటెండెన్స్ పైనా దృష్టిసారించాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని మంత్రి ఆరా తీశారు. కొన్ని మండలాల్లో ఉత్తీర్ణతా శాతంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ స్పందిస్తూ.. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. టీ టైమ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు.

### విద్యార్థుల హాజరుపై దృష్టి కేంద్రీకరించాలి

పల్నాడు జిల్లాలో విద్యార్థుల హాజరుపై దృష్టికేంద్రీకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. టీచర్ అటెండెన్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్ పైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో స్కూల్ అకడమిక్ స్టార్ రేటింగ్ లో హైస్కూల్స్ ఎక్కువగా 3స్టార్ రేటింగ్ లో ఉండటం పట్ల మంత్రి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా కృషిచేయాలన్నారు. పల్నాడు డీఈవో పీవీజె రామారావు స్పందిస్తూ.. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యార్థుల డ్రాపౌట్స్ పై దృష్టిసారించినట్లు చెప్పారు.

### కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టిసారిస్తాం

కర్నూలు జిల్లా ఫలితాల పట్ల మంత్రి లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో భయానక పరిస్థితులు చూశానని, కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్స్ పై ఎక్కువ దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, టీచర్, స్టూడెంట్స్ అటెండెన్స్ లో జిల్లా వెనుకబడి ఉందని చెప్పారు.

### మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుంది

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుందని, ఇందుకు గల కారణాలను మంత్రి లోకేష్ ఆరా తీశారు. జిల్లాలో జీఎఫ్ఎల్ఎన్ ఇంప్రూవ్ మెంట్ కు ఇంకా అవకాశం ఉందని, దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. ముస్తాబు కార్యక్రమాన్ని ప్రశంసించారు. డీఈవో పి.బ్రహ్మాజీ రావు స్పందిస్తూ.. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. త్వరలో 6వేల మంది విద్యార్థులతో కోలాటం కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

### అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టిపెట్టండి

పశ్చిమ గోదావరి జిల్లాలో అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టికేంద్రీకరించాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టూడెంట్-టీచర్ రేషియో బాగుందని ప్రశంసించారు. డీఈవో నారాయణ స్పందిస్తూ.. ప్రైమరీ స్కూల్స్ లో టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారిస్తామని చెప్పారు.

డోర్ టూ డోర్ ప్రచారంలో లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృషిపెడతామని తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన ఎస్జీటీ వాణి, అనంతపురం జిల్లా డీఈవో మోహన్ కృషిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## మృతుని కుటుంబానికి
# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ


**-కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**



జనగామ(భారతశక్తి )మే20: చేర్యాల మండలం పెద్ద రాజుపేట గ్రామానికి చెందిన ప్రముఖ అడ్వకేట్ ఆంకని సురేందర్ బావ మరాఠీ కిషన్ గుండెపోటుతో అకాల మర ణం చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం పెద్ద రాజుపేట గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబా న్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మరాఠీ కిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆకస్మిక మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ దుఃఖ సమయం లో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. అలాగే అడ్వకేట్ ఆంకని సురేందర్ ను ప్రత్యేకంగా పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## వేడి ఎక్కువుంది.. డోర్ ఓపెన్ ఉంది..
# ఇంట్లోకి వచ్చిన పాము కాటేసింది..

**గృహిణి మృతి.. అనాధలయిన ముగ్గురు ఆడపిల్లలు..**



జవహర్ నగర్, భారతశక్తి: నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి వచ్చిన పాము కాటేయడంతో ఓ గృహిణి చనిపోయింది. దానితొ ముగ్గురు పిల్లలు అనాధలయిన ఘటన మల్కాజిగిరి కమీషనరేట్ జవహర్ నగర్ పోలిస్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్.ఐ. బి. రాము తెలిపిన వివరాల ప్రకారం.. పద్మశాలి కాలనీ, బాలాజీ నగర్ కి చెందిన సద్దాం హుస్సేన్ అతని భార్య మారియా ఖాతూన్ (29) తన ముగ్గురు కుమార్తెలతో నివాసం ఉంటున్నారు. ఈ నెల 18 రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులంతా సుమారు రాత్రి 11:30 గంటలకు ఇంట్లో నిద్రించారు. వేడి ఎక్కువగా ఉండటంతో ప్రధాన ద్వారం తెరిచి ఉంచి కూలర్ ఆన్ చేసి నిద్రించారు.మరుసటి రోజు ఉదయం సుమారు 05:00 గంటలకు ఫిర్యాదుదారుని భార్య ఖాతూన్ అకస్మాత్తుగా తన ఎడమ చేతి వేళ్లను పాము కాటేసిందని అరిచింది. దానితొ ఆమె భర్త లేచి పిల్లలను దూరంగా పంపించి, గదిలో ఉన్న పామును కర్రతో కొట్టి చంపాడు. వెంటనే కాటేసిన వేళ్ల పైభాగంలో తాడు కట్టి, ఆమెను ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి, అక్కడి నుండి బాలాజీ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితురాలు బుధవారం ఉదయం సుమారు 08:31 గంటలకు చనిపోయిందని డాక్టర్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ రాము చెప్పారు..

## మున్సిపల్ చెత్త సేకరణ ప్రైవేటీకరణకు
# సీఐటీయూ తీవ్ర వ్యతిరేకం

**- ప్రైవేట్ ఆటోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**
**- జీవో 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలి డిమాండ్**



వికారాబాద్ మే 20 భారత శక్తి తాండూర్ పట్టణంలో మున్సిపల్ చెత్త సేకరణను ప్రైవేటీకరించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల హక్కులను కాపాడాలని, ప్రైవేట్ ఆటోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.బుధవారం తాండూర్ పట్టణంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌ను తాండూర్ మున్సిపల్ వర్కర్స్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరేష్, కార్యదర్శిగా డి. వెంకట్ నియమితులయ్యారు.సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ చెత్త సేకరణ కోసం ప్రైవేటీకరణ చేయడం వల్ల కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ పరిశుభ్రత కోసం ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికులను పక్కనబెట్టి ప్రైవేట్ వ్యవస్థను ప్రవేశపెట్టడం సరైంది కాదన్నారు.జీవో 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీన కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ రికార్డుల్లో కార్మికుల పేర్లలో ఉన్న సమస్యలను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రెగ్యులర్ జవాన్లను నియమించి కార్మికులపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.ఏళ్ల తరబడి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కార్మికులు మున్సిపాలిటీలో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని నాయకులు తెలిపారు. అయినప్పటికీ సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, వచ్చిన జీతాలు కూడా క్రమం తప్పకుండా అందకపోవడం వల్ల కార్మికుల జీవనం దెబ్బతింటోందన్నారు.కొంతమంది కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు చట్టపరమైన హక్కులు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస భద్రతా సౌకర్యాలు, పని పరిస్థితులు మెరుగుపర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం. బలరాం, నర్సిములు, అయిబ్ ప్రకాష్, ఆశప్ప, డి. లక్ష్మణ్, జి. నర్సిములు, బి. వీరేశం, కె. శంకర్, జయశివకుమార్, ఎన్. వెంకటప్ప, ఎం. పవన్, మహేష్, ఎం. చిన్న, డి. శ్రీనివాస్, ఎన్. రాములు, డి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## మారుతోన్న బెంగాల్

భారత సరిహద్దులో అత్యంత కీలకమైన చికెన్ నెక్ కేంద్రం చేతుల్లోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌ను ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేసే కీలకమైన 'చికెన్ నెక్' (సిలిగురి కారిడార్) ప్రాంతంపై కేంద్ర ఏజెన్సీల నియంత్రణ పెరిగే ముఖ్యమైన అభివృద్ధి చోటు చేసుకుంది. ఈ ప్రాంతంలోని సుమారు 120 ఎకరాల భూమి, జాతీయ రహదారి మార్గాలను బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీ ఎస్ ఎఫ్)కు అప్పగించాలని సువేందు అధికారి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 22 కి.మీ. పొడవైన ఈ సంవేదనాత్మక ప్రాంతంపై కేంద్రం పట్టు మరింత బలపడనుంది.చికెన్ నెక్ అనేది భౌగోళికంగా చాలా సన్నటి, వ్యూహాత్మకంగా అత్యంత ముఖ్యమైన కారిడార్. ఇది పశ్చిమ బెంగాల్‌ను అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాంతం ఈశాన్య భారత అభివృద్ధికి 'జీవనాడి'లాంటిది. బంగ్లాదేశ్ సరిహద్దుతో పొరుగున ఉన్నందున, ఇక్కడ భద్రతా సవాళు ఎక్కువ. సరిహద్దు అతిక్రమణలు, చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఇతర అనుచిత కార్యకలాపాలకు ఈ ప్రాంతం లక్ష్యంగా మారే అవకాశం ఉంది. తాజా నిర్ణయం ద్వారా భద్రతా దృక్పథం మార్చాలని అధికారులు భావిస్తున్నారు.స్థానిక అంతరాయాలు తగ్గి, భద్రతా బలగాలకు స్వేచ్ఛగా కదలికలు సాధ్యమవుతాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చే సంభావ్య బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు. ఈ చర్య దేశ భద్రతా దృక్పథంలో భాగంగా చూడాలి. ఇటీవలి కాలంలో సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారఅరాచకం నుంచి మొదలు పెడితే అన్యాయం వరకు.. అక్రమం నుంచి మొదలుపెడితే దుర్మార్గం వరకు.. దౌర్జన్యం నుంచి మొదలుపెడితే హింస వరకు.. ఇలా ఎన్ని పదాలుంటే అన్ని పదాలు.. వెస్ట్ బెంగాల్లో మమతా పరిపాలనకు సరిపోవు. గుండా రాజ్ దర్జాగా సాగింది. రక్తపాతం అడ్డు లేకుండా నడిచింది. 15 సంవత్సరాలు పాటు వెస్ట్ బెంగాల్ రావణకాష్టం లాగా రగిలిపోయింది.15 సంవత్సరాలుగా అడ్డుకుంటూనే ఉంది.. జాతి ప్రయోజనాలు ఆమెకు అవసరం లేదు. దేశ ప్రయోజనాలు అవసరం లేదు. ఆమెకు కావాల్సింది ఓటు బ్యాంకు రాజకీయాలు. తన అధికారం కోసం.. ఆ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం ఏకంగా దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. చివరికి 15 సంవత్సరాల పాటు దేశ భద్రతతో ఆడుకుంది. చివరికి పాపం పండి ఓడిపోయింది.15 సంవత్సరాల పరిపాలన కాలంలో వెస్ట్ బెంగాల్లో మమత బెనర్జీ సృష్టించిన అరాచకాలు మామూలువి కావు. చివరికి తన అధికారాన్ని పదిలం చేసుకోవడానికి బంగ్లాదేశ్ మంచి వచ్చిన వారికి ఓటు హక్కు.. ఆధార్ కార్డు వంటి సదుపాయాలు కల్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక మతం వారికి విపరీతమైన ప్రయారిటీ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో బెంగాల్ రాష్ట్రం పూర్తిగా అదుపు తప్పిపోయింది. కేంద్రం పాటు లేకుండా పోయింది. దేశ భద్రతపరంగా అత్యంత సున్నితమైన ఈ రాష్ట్రంలో అక్రమ చొర బాట్లు నిత్యం జరగడం మొదలుపెట్టాయి. చివరికి మమత ఆగడాలు తట్టుకోలేక అక్కడి ప్రజలు ఇటీవల ఎన్నికల్లో బిజెపికి అధికారాన్ని కట్టబెట్టారు. ఫలితంగా అక్కడ విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి.బెంగాల్ రాష్ట్రంలో చికెన్ నెక్ రహదారి అత్యంత ముఖ్యమైనది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాలకు ఇది సరిహద్దుగా ఉంది. ఈ రహదారి పొడవు 122 కిలోమీటర్లు ఉంటుంది. 22 కిలోమీటర్ల వెడల్పు ఉంటుంది. దీని భద్రతను ఇకపై బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చూసుకుంటుంది.. ఈ కారిడార్ చుట్టూ బిఎస్ఎఫ్ కంచె నిర్మిస్తుంది. దీనివల్ల సరిహద్దు దేశాల నుంచి చొరబాట్లు రాకుండా ఉంటాయి.. కేవలం చైనా, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ మాత్రమే కాకుండా.. మనదేశంలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచడంలో చికెన్ నెక్ రహదారి అత్యంత కీలకం.. ఈ రహదారికి సంబంధించిన 120 ఎకరాలను వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రి సుబేందు అధికారి బిఎస్ఎఫ్ కు అప్పగించారు. 15 సంవత్సరాల పాటు ఇలా ఇవ్వకుండా మమతా బెనర్జీ కేంద్రాన్ని ఇబ్బంది పెట్టింది. సుబేందు మాత్రం కేవలం 15 నిమిషాల్లోనే దీనిని బిఎస్ఎఫ్ కు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కారిడార్ పరిధిలో ఉన్న ఏడు ప్రాంతాలలో రోడ్లను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అత్యంత ఆధునిక పద్ధతిలో నిర్మిస్తుంది.ఈ ప్రాంతంలో వర్షాలు పడటం వల్ల కొండ చరియలు విరిగిపడేవి. దీంతో ఈశాన్య రాష్ట్రాలకు రాకపోకలు అంతగా ఉండేవి కాదు. ఈ రహదారిని అప్పగించాలని కేంద్రం అనేక సందర్భాలలో విజ్ఞప్తి చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. మమత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. చివరికి ప్రజలకు ఆగ్రహం కలిగి. మమత పరిపాలనకు ఎండ్ కార్డు పడింది. అయితే ఇక్కడే ఆమె అక్రమ పరిపాలనకు సంబంధించిన ఒక్కొక్క అంశాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బెంగాల్ రాష్ట్రంలో టిఎంసి కార్యాలయాలు మూతపడ్డాయి. మొన్నటిదాకా ఒక వెలుగు వెలిగిన ఆ కార్యాలయాలు ఇప్పుడు అమావాస్య చీకటిని తలపిస్తున్నాయి. ఇటీవల కోల్కతా నగరంలోని బిధాన్ నగర్ పరిధిలోని డివిజన్ కార్యాలయాన్ని తెరిచారు. అందులో కుప్పలుగా ఆధార్ కార్డులు బయటపడ్డాయి.అవన్నీ కూడా పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అందాల్సి ఉంది. వాటిని అందకుండా టీఎంసీ కార్యకర్తలు తమ వద్ద ఉంచుకున్నారు. ఆ ఆధార్ కార్డులు మొత్తం బిజెపి కార్యకర్తలవి. పశ్చిమ బెంగాల్లో ఎలక్షన్ కమిషన్ సర్ అనే విధానాన్ని అవలంబించింది.

అందులో ఆధార్ కార్డును కూడా స్వీకరించింది. ఆధార్ కార్డును అందకుండా చేసి బిజెపి కార్యకర్తల ఓట్లను దూరం చేయాలని మమతా బెనర్జీ పార్టీ కార్యకర్తలు భావించారు. ఎన్నికల్లో బిజెపి అధికారం సాధించిన తర్వాత.. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్పడిన అన్యాయం వెలుగులోకి వచ్చింది. అయితే ఇది కేవలం ఒక వార్డు పరిధిలోనే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి ఉందని అక్కడి బిజెపి నాయకులు చెబుతున్నారు.ఆధార్ కార్డులను దగ్గర పెట్టుకొని బిజెపి కి ఓట్లు పడకుండా చేసేందుకు టీఎంసీ కార్యకర్తలు అనేక రకాలుగా అక్రమాలకు పాల్పడ్డారు. చివరికి పోస్టల్ శాఖను కూడా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆధార్ కార్డులను అందకుండా చేశారు.. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ మమతా బెనర్జీ పార్టీ కార్యకర్తల దుర్మార్గాలు సాగలేదు. చివరికి ప్రజాస్వామ్యంలో అణిచివేతకు అవకాశం లేదని బెంగాల్ ప్రజలు తీర్పు చెప్పాచివరికి బెంగాల్ రాష్ట్రంలో ఇప్పుడు ప్రభుత్వం మారడంతో చికెన్ నెక్ రహదారి బిఎస్ఎఫ్ ఆధీనంలోకి వచ్చేసింది. తద్వారా ఇక్కడ కంచె నిర్మాణం వేగవంతం కానుంది. అంతేకాదు ఈశాన్య రాష్ట్రాలకు కనెక్టివిటీ మరింత పెరుగుతుంది.

## ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.



జనగామ(భారత శక్తి)మే20:ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు అయి ఉన్న దాన్యాన్ని స్పెషల్ డ్రైవ్ ద్వారా మిల్లులకు తరలించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.జనగామ జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా అంశాలపై జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సివిల్ సప్లై అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యాసంగి లో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా పంట దిగుబడి గణనీయంగా పెరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళు, కాంటాలు, మిల్లులకు లోడింగ్, అన్ లోడింగ్ లలో కొంత ఆలస్యం అవుతుందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఇందులో ఇప్పటి వరకు 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని ఇంకా మరో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలలో కాంటాలు అయి 30వేల క్వింటాళ్ల బస్తాలు లోడింగ్ కు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కావున వెంటనే ఒక స్పెషల్ డ్రైవ్ పెట్టి ధాన్యం మిల్లులకు తరలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అవసరమైతే ఇసుక లారీలను కూడా ఉపయోగించాలని కలెక్టర్ గారికి సూచించారు. అలాగే ఏ రోజు కాంటా అయిన ధాన్యం అదే రోజు లోడింగ్, అన్ లోడింగ్ అయ్యే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన కొన్ని మిల్లులలో ఖాళీ లేక ధాన్యం బస్తాలు అన్ చేయడం లేదని కావున వెంటనే వాటి స్థానంలో ఖాళీ ఉన్న మిల్లులను రిట్యాగ్ చేయాలని ఆదేశించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో ఎక్కడా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు, రవాణా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆదిశగా అధికారులకు, మిల్లర్లకు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ కు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

- పర్యాటక ప్రాంతాలతో జిల్లాకు విశిష్ట స్థానం
- చరిత్ర, సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు



ములుగు జిల్లా ప్రతినిధి, మే 20(భారత శక్తి): ములుగు జిల్లాను పూర్తిస్థాయిలో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని, వారసత్వ కట్టడాలను పరిరక్షించడం అందరి బాధ్యత అని, పర్యాటక ప్రాంతాలతో ములుగు జిల్లాకు విశిష్ట స్థానం ఉందని, జిల్లా చరిత్ర, సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "పర్యాటక వారోత్సవాల" వేడుకలలో భాగంగా బుధవారం ములుగు మండలం జాకారం గ్రామంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్, నేషనల్ హైవే యు-టర్న్ వద్ద నుంచి గ్రామంలోని చారిత్రక ప్రాధాన్యత కలిగిన కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు జెండా ఊపి ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ పురాతన శివాలయాన్ని సందర్శించి, ఆలయ చరిత్రను పర్యాటక శాఖ గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లాను పర్యాటక రంగంలో మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు, స్థానిక చారిత్రక సంపదను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జిల్లాలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంతో పాటు ఇతర అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు.

జిల్లాలో ప్రసిద్ధి చెందిన బొగత జలపాతం, లక్నవరం సరస్సు, మేడారం సమ్మక్క-సారలమ్మల ఆలయం, తాడ్వాయి హట్స్, ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ శాంక్చురీ, బ్లాక్‌బెర్రీ ఐలాండ్ వంటి వైవిధ్యభరితమైన పర్యాటక ప్రాంతాలతో జిల్లా విరాజిల్లుతోందని కొనియాడారు.సుమారుగా ఎనిమిది నెలల పాటు పర్యాటక సీజన్ కొనసాగుతుందని,ములుగు జిల్లాకు హైదరాబాద్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారని తెలిపారు.కేరళ, రాజస్థాన్ రాష్ట్రాల తరహాలో జిల్లా పర్యాటక రంగాన్ని మరింత పటిష్టంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక యువతకు, ప్రజలకు స్టాల్స్, పార్కింగ్, గైడ్‌ల రూపంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, జిల్లా ఆర్థిక వ్యవస్థ స్వయంసమృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా పర్యాటక రంగాన్ని మరింత విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావడానికి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల తో ప్రత్యేక పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పర్యాటక అభివృద్ధిలో భాగస్వామ్యమవడానికి, జిల్లాను మరింత మెరుగుపరచడానికి ప్రజలు, పర్యాటక ప్రేమికులు తమ విలువైన సలహాలు, సూచనలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు సంపత్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, ఇరిగేషన్ అధికారి అప్పలనాయుడు, విద్యా శాఖ అధికారి సిద్ధార్థ్ రెడ్డి, బిసిడబ్ల్యుఓ ప్రేమలత, డిపిఓ వెంకయ్య, డిపిఆర్ఓ రఫీక్, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎంపిడిఓ రహీమ్, జాకారం సర్పంచ్ దాసరి సమత, టూరిజం శాఖ సిబ్బంది, గైడ్స్, టూరిస్ట్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్.

**-ఆస్థి కోసమే అక్కను హతమార్చిన తమ్ముడు. - సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్.**




సూర్యపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,మే 20: సూర్యాపేట డివిజన్ డిఎస్పీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ఆత్మకూరు ఎస్సై ఐలయ్య తో కలిసి డి .ఎస్.పి ప్రసన్నకుమార్ అరెస్ట్ వివరాలు కేసు వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు మండలం తుమ్మలపెనపహాడ్ గ్రామానికి చెందిన సరబి సైదులు, అతని అక్క అంజమ్మ ఇరువురి మధ్య భూ తగాదా ఉన్నది, ఈ విషయంలో అక్కను తప్పిస్తే ఆస్తి తన సొంతం అవుతుంది అని భావించిన సైదులు సోమవారం రోజు ఉదయం తుమ్మలపెనపహాడ్ గ్రామంలో పనికి వెళుతున్న అక్కపై విచక్షణా రహితంగా కత్తితో దాడిచేసి హత్యచేశాడు అని డి.ఎస్.పి ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు సురబి సైదులు, ప్రధాన నిందితుడి భార్య ధనలక్ష్మి, కుమారుడు శివతేజ, బావమర్ధి కొండ భీమయ్య ల నలుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. అంజమ్మను తప్పిస్తే ఆస్తి దక్కుతుందని పథకం ప్రకారం హత్య చేశారు. పోలీసు ప్రతిష్టమైన దర్యాప్తు నిర్వహించి నిందితులను ఈరోజు బృందావనపురం గ్రామంలో ఏ4 నిందితుడు కొండ భీమయ్య ఇంట్లో ముగ్గురు నిందితులు సైదులు ధనలక్ష్మి శివతేజ లను అదుపులోకి తీసుకోవడం జరిగింది. నాలుగవ నిందితుడు కొండ భీమయ్య పరారీలో ఉన్నాడు. ఇతని త్వరలో పట్టుకుంటాము. సంఘటనపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు హత్య కేసు నమోదు చేసి ఎస్పీ నర్సింహా ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేయడం జరిగింది.

### కేసు వివరాలు.

ఆత్మకూర్-నా మండలము లోని తుమ్మల పెన్పహాడ్ గ్రామానికి చెందిన సురభి బుచ్చయ్య, లక్ష్మమ్మలకు ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు సంతానము. వారి చిన్న కూతురు ఉమ వివాహ సమయములో పసుపు కుంకుమల క్రింద ఎ 2.20 గుంటల వ్యవసాయ భూమి ఇవ్వగా ఉమ పేరున ఎ 2.03 గుంటల భూమి రిజిస్ట్రేషన్ కాగా మిగిలిన 17 గుంటల భూమి రిజిస్ట్రేషన్ కాలేదు. అట్టి 17 గుంటల భూమి రిజిస్ట్రేషన్ విషయములో గత కొంత కాలము నుండి ఉమ కుటుంబానికి, ఆమె అన్న సురభి సైదులు కుటుంబానికి మధ్యన గొడవలు జరుగుచున్నవి.17 గుంటల భూమి ఉమకు రిజిస్ట్రేషన్ చేయాలని ఉమ పెద్ద అక్క సురభి అంజమ్మ ఉమకు సపోర్ట్ చేస్తూ తన తమ్ముడు అయిన సురభి సైదులుతో గొడవపడుచున్నది. ఇట్టి భూమి తగాదా విషయములో 2025 జులై నెలలో సురభి సైదులు, అతని బార్య, వారి కొడుకు, వారి బందువులు కలిసి సురభి అంజమ్మను, ఉమను కొట్టి గాయపరచగా వారి పై ఆత్మకూర్ యస్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయినది, అట్టి కేసు ప్రస్తుతము సూర్యాపేట కోర్ట్ లో పెండింగ్ లో ఉన్నది. సురభి సైదులు, అతని బార్య సురభి ధనలక్ష్మి, అతని కొడుకు సురభి శివ తేజ, అతని బావమరిది కొండ భీమయ్య కలిసి సురభి అంజమ్మను, ఉమను హత్య చేసినచో ఉమ పేరున ఉన్న భూమి మొత్తము సైదులుకు దక్కుతుంది అని కుట్ర పన్నినారు. వారి ప్లాన్ లో బాగంగా తేదీ 18.05.2026 రోజు ఉదయము సుమారు 06:00 గంటల సమయములో సురభి అంజమ్మ ఉపాధి హామీ కూలి పనులకు వెళ్ళుచుండగా సురభి సైదులు కత్తి తో తన స్వంత అక్క అయిన సురభి అంజమ్మ పై దాడి చేసి కత్తితో నరికి హత్య చేసినాడు.

### అరెస్ట్ చేసిన నేరస్తులు:

ఏ -1. సురభి సైదులు వయస్సు: 45 సంవత్సరాలు, తుమ్మల పెన్‌పహాడ్ గ్రామం.
ఏ -2: సురభి ధనలక్ష్మి భర్త సైదులు, వయస్సు: 40 సంవత్సరాలు, తుమ్మల పెన్‌పహాడ్ గ్రామం.
ఏ 3 : సురభి శివ తేజ తండ్రి సైదులు, వయస్సు: 20 సంవత్సరాలు, తుమ్మల పెన్‌పహాడ్.

### పరారీలో ఉన్న నేరస్థుడు:

ఏ 4 : కొండ భీమయ్య వయస్సు: 47 సంవత్సరాలు, వృత్తి: న్యాయవాది, గ్రామము బృందావనపురం గ్రామం, నడిగూడెం మండలం, సూర్యాపేట జిల్లా.
కేసులో బాగా పనిచేసిన పోలీసు సిబ్బందిని డిఎస్పీ ప్రసన్నకుమార్ అభినందించారు. భూమి సంబంధిత తగాదాలు ఆస్తి సంబంధిత తగాదాలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలని పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కారం చూసుకోవాలని డిఎస్పీ తెలిపారు. చట్టవులంగన చర్యలకు పాల్పడుతూ భౌతిక దాడులు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని. పోలీసు దర్యాప్తులో నాణ్యత వేగం పెరిగిందని త్వరితగతిన శిక్షలు అమలు అయ్యేలాగా కృషి చేస్తున్నామని అన్నారు.

# వై.ఎస్.ఆర్. కడపజిల్లా గ్రామీణ విలేఖరులకు ఈ నెల 30,31 తేదీల్లో పునశ్చరణ తరగతులు.

**-సి.ఆర్.మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్.**

వై ఎస్ ఆర్ కడప,మే 20(భారత శక్తి ): సి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వై.ఎస్.ఆర్. కడపజిల్లా గ్రామీణ విలేఖరులకు రెండు రోజుల పాటు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వై.ఎస్.ఆర్. కడప జిల్లా లో జడ్పీ సమావేశ మందిరం లో ఈ తరగతులు ఈ నెల 30,31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా పత్రికా కథనాల కు సంబంధించి వివిధ అంశాలపై గ్రామీణ విలేఖరులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వార్తా కథనాలు రాయడం లో "కృత్రిమ మేధ" (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) వంటి ఆధునిక పద్దతుల వినియోగాన్ని గురించి ఈ తరగతుల్లో వివరించడం జరుగుతుందని తెలిపారు.ఈ అంశం పై సీనియర్ జర్నలిస్టు విజయకుమార్ కుర్రా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరంగా తెలియచేస్తారని ఆయన తెలిపారు. గ్రామీణ రిపోర్టింగ్ లో మెళుకువలు, విలేఖరుల నుంచి డెస్క్ ఏమి కోరుకుంటుంది అనే అంశాల పై, "క్రైమ్ రిపోర్టింగ్" పై మెళకువలు, "పత్రికా భాష" వంటి అంశాల పై రెండురోజుల పునశ్చరణ తరగతుల్లో గ్రామీణ విలేఖరులకు పూర్తి స్థాయి శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ లో పాల్గొన్న గ్రామీణ జర్నలిస్టులకు సి.ఆర్.మీడియా అకాడమీ తరపున "సర్టిఫికెట్లు" ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణలో పాల్గొన దలచిన గ్రామీణ విలేఖరులు తమవివరాలు ఈ నెల 27 వ తేదీ లోపు దిగువ పేర్కొన్న "ఆన్ లైన్ లింక్ (గూగుల్ షీట్)" లో నమోదు చేసుకోవాలని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ సూచించారు.

## "యూ ట్యూబ్" న్యూస్ చానెళ్ల జర్నలిస్టులకోసం కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం

విజయవాడ,మే 20(భారత శక్తి ): రాష్ట్రంలో "యూ ట్యూబ్" న్యూస్ చానెళ్లు నిర్వహిస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గానే, "యూ ట్యూబ్" న్యూస్ చానెళ్ల జర్నలిస్టులకోసం కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అందు కోసం జిల్లాల వారీగా "యూ ట్యూబ్" న్యూస్ చానెళ్ల యజమానులు తమ వివరాలు దిగువ పేర్కొన్న మెయిల్ ఐ.డి.కు, లేదా చిరునామాకు పంపాలనికోరారు.

# రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప, మే 20 (భారత శక్తి ): ప్రతి భూమికి స్పష్టమైన హక్కులు కల్పించేలా భూ రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, వివాదరహితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లాలోని తహశీల్దార్లు, సర్వేయర్లు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్వోలు, సంబంధిత రెవెన్యూ అధికారులతో "రీసర్వే రివైజ్డ్ జూరా మరియు రీసర్వే ఆన్‌లైన్ మాడ్యూల్స్" పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్, కడప మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎస్. భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమంలో భూ రికార్డుల శుద్ధి, గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల రక్షణ, గ్రౌండ్ ట్రూతింగ్, ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్, వివాదాల పరిష్కారం వంటి ప్రతి దశలో అధికారులు ఎస్‌ఓపి ప్రకారం కచ్చితంగా పనిచేయాలని సూచించారు.
రీసర్వే ప్రారంభానికి ముందు గ్రామ సభలు నిర్వహించి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని, షెడ్యూల్, విధానాలు, ప్రయోజనాలు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమాచారం నిరంతరం అందించాలని సూచించారు.వెబ్‌ల్యాండ్, ఆర్‌ఎస్‌ఆర్, ఎఫ్‌ఎంబీ, రెవెన్యూ రికార్డులను సమన్వయం చేసి వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని తెలిపారు. వారసత్వ మార్పులు, జీరో ఎక్స్‌టెంట్ ఖాతాలు, యాజమాన్యం లేని భూములు, ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూముల వివరాలను ప్రత్యేకంగా పరిశీలించాలని చెప్పారు.గ్రౌండ్ ట్రూతింగ్ సమయంలో రైతుల సమక్షంలోనే భూముల హద్దులు గుర్తించి ఓ ఆర్ ఐ , జి ఎన్ ఎస్ ఎస్ రోవర్ టెక్నాలజీ ద్వారా జియోకోడ్ డేటా సేకరించాలని ఆదేశించారు. భూమి యజమానుల హాజరు, ఈ -కె వై సి ప్రక్రియలు తప్పనిసరిగా నిర్వహించాలని పేర్కొన్నారు.ప్రభుత్వ భూముల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ఆక్రమణలకు అవకాశం లేకుండా స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ, నివాస, ప్రభుత్వ, గ్రామకంఠం భూములను వేర్వేరుగా గుర్తించి సరైన ల్యాండ్ పార్సెల్స్‌గా నమోదు చేయాలని సూచించారు.ల్యాండ్ పార్సెల్ కేటాయింపులో పొరపాట్లు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక ల్యాండ్ పార్సెల్‌కు ఒకే ల్యాండ్ నేచర్, ఒకే ల్యాండ్ క్లాసిఫికేషన్ ఉండేలా నమోదు చేయాలని స్పష్టం చేశారు. డమ్మీ ల్యాండ్ పార్సెల్స్ సృష్టించరాదని హెచ్చరించారు.రీసర్వే ఆన్‌లైన్ మాడ్యూల్స్ వినియోగంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వెబ్‌ల్యాండ్ డేటా పోర్టింగ్ నుంచి డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ ఆమోదం వరకు ప్రతి దశను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. భూవివాదాలు తలెత్తిన సందర్భాల్లో చట్టపరమైన విధానాల ప్రకారం విచారణలు నిర్వహించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అప్పీలు వచ్చినట్లయితే నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు. ప్రతి భూమికి స్పష్టమైన హక్కులు కల్పించేలా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. జేసీ డా. నిధీ మీనా మాట్లాడుతూ ప్రతి దశలో నాణ్యత తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఫీల్డ్ స్థాయిలో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని తెలిపారు. రీసర్వే పూర్తయ్యాక శాశ్వత డిజిటల్ భూ రికార్డులు రూపొందించబడతాయని, ప్రతి భూమికి ప్రత్యేక యూనిక్ ల్యాండ్ పార్సెల్ ఐడి కేటాయించబడుతుందని చెప్పారు. రీసర్వే ద్వారా భూ వివాదాలు తగ్గడంతో పాటు రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులు, పారదర్శక రికార్డులు, భవిష్యత్ లావాదేవీల్లో సౌలభ్యం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మురళి, శిరీష, చంద్ర మోహన్, చిన్నయ్య, ఇతర ఎస్డీసీలు, లాండ్స్ సర్వే ఎడి వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి వివోఏ ల ఉద్యోగుల సంఘం ముఖాముఖి సమావేశం.



రేగొండ, మే 20 (భారత శక్తి) ఐకెపి వివోఎ ఉద్యోగుల సంఘం సమావేశం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రూపురెడ్డిపేట గ్రామంలో వివో ఏల జిల్లా అధ్యక్షులు గాజుల రాజ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐకెపి వివో ఏల రాష్ట్ర అధ్యక్షురాలు మారేపల్లి మాధవి హాజరై ప్రతి వివో ఏ సమస్యలు వారు ఎదుర్కొన్నటువంటి ఆర్థిక మరియు పని ఒత్తిడి చాలీచాలి వేతనాలతో ఆఫ్లైన్లో ఆన్లైన్లో పనులు చేస్తున్నామని చెప్పారు. ఈ విషయం ప్రభుత్వం మరియు సీఈఓ మేడం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షురాలు మారెపల్లి మాధవి అన్నారు. సీఈవో మేడం కొన్ని హామీలు ఇచ్చారు, ఆ హామీలు జూన్ రెండో తేదీన అమలు చేస్తానని చెప్పడం జరిగిందన్నారు. వేతనం గురించి మాత్రం ప్రభుత్వంతో మాట్లాడి చెప్తానని హామీ ఇచ్చారు. మేడం ఇచ్చిన హామీలు జూన్ రెండున అమలు కాకపోతే జిల్లా, రాష్ట్ర కమిటీలు తీసుకునే నిర్ణయంతో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వివో ఏలు ఐకమత్యంతో ముందుకు సాగాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా మన హక్కులు సాధించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పట్టూరి తిరుపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహినుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలు దాసరి రమేష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి తిరుపతి, జిల్లా కార్యదర్శి కోంద్ర రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, టేకుమట్ల మండల అధ్యక్షురాలు సుమతి, చిట్యాల మండల అధ్యక్షురాలు రజిత, జిల్లా కార్యదర్శి భద్రయ్య, కుమార్ వివిధ గ్రామాల వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక తరగతులు -విద్యారంగంలో విద్యా దీపం

**- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి**

పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, మే 20: ఒకవైపు ఎండలు మండుతున్నాయి. బయటికి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. మరోవైపు బాలలు పగటి ఉష్ణోగ్రతలు తట్టుకోలేక చెరువులు జలాశయాలు వద్దకు వెళ్లి ప్రాణాలు మీదికి తెచ్చుకొనే పరిస్థితులు ఉన్నవి.ఇలాంటి పరిస్థితులలో ఎండైనా, అలసటైనా మా ప్రయాణం విద్యార్థుల భవిష్యత్తు కోసమే అంటూ కాశి నాయన మండలంలోని రెడ్డి కొట్టాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవులు వృధా కాకుండా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనే సంకల్పంతో వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రెడ్డి కొట్టాల పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక తరగతులకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభిస్తున్నది. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు సుమారు 50 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఉదయం 8 గంటల నుండి 11:30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతుల్లో డ్రాయింగ్ పేపర్ క్రాఫ్ట్ ఐటమ్స్ స్పోకెన్ ఇంగ్లీష్ బోధిస్తున్నారు. విద్యార్థులు చాలా క్రియాత్మకంగా పాల్గొంటున్నారు.ఈరోజు హరిత ఫౌండేషన్ ఫౌండర్ మరియు చైర్మన్ అయినటువంటి డాక్టర్ కాటూరు ఫణి రాజ కుమార్ సహకారంతో బండి పరిమళ జ్యోతి విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేందుకు తోడ్పడే5000 రూపాయల విలువ చేసే డ్రాయింగ్ పుస్తకాలు ,కలర్ పెన్సిల్స్ 50 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా హరిత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణి రాజ కుమార్ పేద విద్యార్థులకు సహాయ సహకారాలు



అందిస్తున్నారని, హరిత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు డాక్టర్ ఫణి రాజ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జంగంపల్లి గ్రామంలోని శాకంబరి రైస్ మిల్లును సందర్శించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 20: బుధవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, జంగంపల్లి గ్రామంలోని శాకంబరి రైస్ మిల్లును సందర్శించి, ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ కార్యకలాపాలను సమీక్షించారు.పరిశీలన సందర్భంగా పీపీసీల వద్ద పెండెన్సీ తగ్గించడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత పీక్ ప్రొక్యూర్‌మెంట్ సీజన్, వర్షాల అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వాహనాల క్లియరెన్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా హెడ్ ఆఫీస్ నుండి సుమారు 85 శాతం బాయిల్డ్ రైస్ అలొకేషన్ ముందుగానే అందినందుకు మిల్లర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పెంచడం, వాహనాల క్లియరెన్స్‌ను వేగవంతం చేయడంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి (డిసిఎస్ఓ), డీఎం సివిల్ సప్లైస్, తహసీల్దార్ డీటీసీఎస్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యూత్ లీడర్షిప్ సదస్సు.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 20(భారత శక్తి) "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక శిక్షణ కేంద్రం (ఐటిఐ) లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. "యూత్ లీడర్ షిప్ సమ్మిట్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు అధికారులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, దేశ రాజకీయాల్లో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. యువజన, క్రీడల శాఖ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, ఐటీఐ కన్వీనర్ కోటిరెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్ఎస్ స్టేడియంలో ఉచిత రాగి జావా పంపిణీ



హనుమకొండ(భారత శక్తి)మే 20: హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ అవుట్డోర్ స్టేడియం లో క్రీడాకారులకి వేసవి దృశ్య ఉచిత రాగిజావ పంపిణీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్స్,వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా( డివైఎస్ఓ )డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ యువజన క్రీడలు,సంక్షేమ అధికారి ప్రశాంత్ కుమార్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉదయం 7:00 గంటలకు ప్రారంభించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొనే పిల్లలకు ,పిల్లలతో ,సహాయకులకు కోచ్ లకు తల్లిదండ్రులకు బుధవారం ఉదయం ఉచిత రాగి జావా,మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అనంతరం డివైస్ ప్రశాంత్ కి అసోసియేషన్కు గాను ఒక రూము కేటాయించాలని డివైస్ ఓ కి అభ్యర్థించినట్టు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది .ఈ యొక్క కార్యక్రమం వరంగల్ ఉమ్మడి జిల్లా విశ్రాంత ఉపాధ్యాయులు ,వ్యాయామ క్రీడా ఉపాధ్యాయులు,విశ్రాంత ఉపాధ్యాయుల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు అసోసియేషన్ అధ్యక్షులు అనుప్ ,మాజీ డి వై ఎస్ ఓ శివకుమార్ హ్యాండ్ బాల్ కోచ్, బ్యాట్మెంటన్ కోచ్ లు విష్ణు, రమేష్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారయ్య ఎర్రగట్టు స్వామి, గణపతి రెడ్డి ,రాజయ్య, సుధీర్ బాబు, శ్యామ్, విజయ్ కుమార్, సుధాకర్ ,సాంబమూర్తి , వాకర్స్ పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలి




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే20: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న యువజన ఒ క్రీడా వారోత్సవాలలో మూడవ రోజు కార్యక్రమంగా "యూత్ లీడర్ షిప్ సుమిత్ - లీడ్ విత్ వీజియన్ ఒ ఇన్స్పైర్ ది ఫ్యూచర్" కార్యక్రమం బుధవారం కామారెడ్డి సెట్విన్ సెంటర్‌లో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా జిల్లా పరిశ్రమల అధికారి, శ్రీ లాలు నాయక్ ముఖ్యఅతిథిగా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా. జైపాల్ రెడ్డి, ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ నవీన్, సెట్విన్ కోఆర్డినేటర్, ఇండస్ట్రీ డిపార్ట్మెంట్ వినోద్, యువజనులు సర్వీసుల శాఖ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు యువతలో నాయకత్వ లక్షణాలు, విజన్, వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, యువ సాధికారత, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఇందులో భాగంగా 1.దేశ భవిష్యత్తులో యువకుల పాత్ర 2. సెల్ ఫోన్లపై యువత ప్రభావం పైన వ్యాసరచన ఒ ఉపన్యాస పోటీలు నిర్వహించి మొదటి బహుమతిగా నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ముసాలిన్ సుధామ్స్ విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినట్లు జిల్లా యువజన & క్రీడల అధికారి (ఎఫ్ ఏ సి) జిల్లా పర్యాటక అధికారి (ఐ/సి) తెలిపారు.

# యువతకు భారీ అవకాశాలు.. జాబ్ మేళాలో 12 వేల ఉద్యోగాలు : కలెక్టర్ రాజర్షి షా.








ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 20(భారత శక్తి) యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ జాబ్ మేళా విశేష స్పందనను అందుకుంది. ఈ జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా పేరొందిన 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, దాదాపు 12 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.
అధికారులతో కలిసి జాబ్ మేళాను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, యువతకు ప్రైవేట్ రంగంలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా జిల్లాకు చెందిన 30కి పైగా స్థానిక కంపెనీలు ఈ మేళాలో పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. స్థానిక యువత తమ స్వగ్రామ ప్రాంతాల్లోనే ఉద్యోగాలు పొందేలా ప్రత్యేకంగా అవకాశాలు కల్పించినట్లు ఆయన వివరించారు.జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ జాబ్ మేళా ద్వారా వేలాది మంది యువతకు మంచి భవిష్యత్తు దక్కనుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ రంగాలకు చెందిన కంపెనీలు పాల్గొనడంతో అభ్యర్థులకు తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకునే అవకాశం లభించిందన్నారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత హాజరై ఉద్యోగ అవకాశాలపై ఆసక్తి కనబరిచారు. కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులతో ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. జాబ్ మేళా విజయవంతం కావడంతో జిల్లా యువతలో కొత్త ఉత్సాహం నెలకొంది.

# ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**-ప్రతీ ఫిర్యాదు పై తక్షణ స్పందన**

**-బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 20(భారత శక్తి) జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఈరోజు భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వృద్ధ దంపతులు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. వారి సమస్యను ఓర్పుతో విన్న జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కుటుంబ కలహాల నేపథ్యంలో వచ్చిన తల్లి-కొడుకులతో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి, పరస్పరం అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇద్దరికీ నచ్చజెప్పి వారి సమస్యకు పరిష్కార మార్గం సూచించారు.వీటితో పాటు భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8 మంది అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.

ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**"కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర"**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**"పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష"**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# సత్య కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 20 : మే 22న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం పరిశీలించారు.కార్యక్రమం సజావుగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వేదిక ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయం, తాగునీటి వసతి, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో ఏసీ ఎల్బీ గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీపీఓ మురళి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నెంటూర్ లో ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

## వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎఫ్డీసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి







గజ్వేల్ నియోజకవర్గం, 20 మే 2026 : సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూరు గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మతల్లి అనుగ్రహంతో అందరూ బాగుండాలని, వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించి అమ్మ దయతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నెంటూర్ పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు నీరుడి నాగరాజు, ఉపాధ్యక్షులు లింగ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి లింగ ప్రశాంత్, సలహాదారులు కనకరాజు, మరియు ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

**స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 66 ఏళ్ల మహిళ కడుపులో నుంచి 7 కిలోల అండాశయ గడ్డ తొలగింపు.**



నిర్మల్, జిల్లా ప్రతినిధి, మే 20 (భారత శక్తి): నిర్మల్ పట్టణంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు అరుదైన మరియు క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇంద్రవెల్లి మండలానికి చెందిన 66 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పి, పొత్తికడుపు ఉబ్బరం సమస్యలతో ఆసుపత్రిని ఆశ్రయించగా, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆమె కడుపులో భారీ అండాశయ గడ్డ ఉన్నట్లు గుర్తించారు.డా. నాలం శశికాంత్ (ఎంఎస్ సర్జన్) సూచన మేరకు నిర్వహించిన సిటీ స్కాన్ పరీక్షల్లో సుమారు 7 కిలోల బరువున్న అండాశయ క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు నిర్ధారణ అయింది. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వెంటనే శస్త్రచికిత్స చేపట్టారు.డా. శశికాంత్‌తో పాటు ఆంకాలజిస్ట్ డా. గిరీశ్ మరియు వైద్య బృందం అత్యంత జాగ్రత్తగా క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించి భారీ గడ్డను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా కోలుకుంటోందని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా డా. శశికాంత్ మాట్లాడుతూ, మహిళల్లో కడుపునొప్పి, పొత్తికడుపు ఉబ్బరం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్ వంటి ప్రాణాపాయ సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించవచ్చున్నారు.అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా స్వప్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్యాన్సర్ గడ్డలకు సంబంధించిన క్లిష్టమైన శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహిస్తున్నామని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. విజయవంతమైన ఈ శస్త్రచికిత్సపై రోగి కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మానసిక ఆందోళనతో యువతి ఆత్మహత్య



జగిత్యాల, మే 20( భారత శక్తి ప్రతినిధి ):ధర్మపురి మండలం బోదరి నక్కల చెరువు గూడెంకు చెందిన మారినేని రమ్య (21) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, రమ్య కొంతకాలంగా మానసిక ఆందోళనతో ఇంటి వద్దే ఉంటూ ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా ఉండేది.బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వద్ద ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కిందికి దింపగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.మృతురాలి తండ్రి మారినేని లచ్చన్న ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. మహేష్ తెలిపారు.

# దుర్గమ్మ పండుగకు హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.



జనగామ, భారత శక్తి ప్రతినిధి, మే 20: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండలగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గమ్మ పండుగకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీర్వాదలు మండలగూడెం గ్రామ ప్రజలందరిపై నిండుగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మంచి మనసుతో దుర్గమ్మ తల్లిని కొలిస్తే ఆ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. దుర్గమ్మ దీవెనలతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్థానిక సర్పంచ్ రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 7వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



జగిత్యాల, మే 20 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.బుధవారం 7వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు విజయ్ బాబు, చిపిరిశెట్టి రాజేష్, వొజ్జెల లక్ష్మణ్, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 27 నుండి పాలీసెట్ కౌన్సిలింగ్




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మే 20:పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం పాలిసెట్ - 2026 వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభమవుతుందని సంగారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ పి.జానకి దేవి తెలిపారు. పాలీసెట్ లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 27వ తేదీ నుంచి 31 వరకు ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని ఈనెల 29 నుంచి జూన్ 3 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ వెబ్ ఆప్షన్లు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జూన్ 6న సీట్లు కేటాయింపు ఉంటుందని, విద్యార్థులు ముఖ్యమైన తేదీలను అనుసరించి కౌన్సిలింగ్ ద్వారానే కళాశాలలో ప్రవేశం పొందాలని సంగారెడ్డి ప్రిన్సిపల్ పి.జానకి దేవి సూచించారు. పాలిటెక్నిక్ లో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ, భారత శక్తి ప్రతినిధి, మే 20: రఘునాథపల్లి మండలం గిద్దెబండ తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లకావత్ సీతారాం మరణించగా ఆయన పార్థివ దేహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దారావత్ భీమా మరణించగా వారి పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కాంతమ్మ కిషన్, మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత ఉపాధి శిక్షణ

విశాఖపట్నం, భారత శక్తి ప్రతినిధి, మే 20:విశాఖపట్నం కంచరపాలెం బాలికల ఐటిఐ ప్రాంగణంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌ఆధ్వర్యంలో జూలై ఒకటో తేదీ నుండి ప్రారంభంకానున్న 2026-27 ఉచిత కోర్సులకు ఎస్సీ, ఎస్టీ చెందిన అభ్యర్థుల నుండి మరియు శిక్షణ సంస్థల (స్పెషల్ కోచింగ్ స్కీమ్ మాత్రమే)నుండి ధరఖాస్తులను స్వీకరించబడును. కేంద్ర ప్రభుత్వ ఉపాధి, లేబర్ డిపార్టుమెంట్‌ఆధ్వర్యంలో స్పెషల్ కోచింగి స్కీమ్ (కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు), ఓ లెవెల్ కంప్యూటర్ సాఫ్ట్వేయర్, ఓ లెవెల్ కంప్యూటర్ హార్డ్ వేయర్ కోర్స్ లలో ఈ శిక్షణను ఏడాది పాటు ఉచితంగా శిక్షణ కాలంలో, ఎంపికైన వారికి నెలకి రూ. వెయ్యి స్టైఫండ్‌అందించబడును. మరో కోర్సు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ూ×) ఫౌండేషన్ టెక్నాలజీ (2 నెలలు)కూడా శిక్షణ ఇవ్వబడును. ఆశక్తి, అర్హత గల వారు దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారాహ్ట్రజూం://సవ్ంఎర్.అఎం.స్త్రశీజ.ఱఅ/బంవతీం/ంఱస్త్రఅబజూ లేదా చీజూజ ఆఫీస్ కు వచ్చి రుజువు పత్రాలతో అప్లై చేయవలను. అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్ / 10ం2అందించబడును. చదివియుండవలను. కుటుంబ ఆదాయం మూడు లక్షలు మించరాదు. వయసు జూలై ఒకటో తేదీకి 18 నుండి 27 (స్పెషల్ కోచింగి స్కీమ్), 18 నుండి 30 (ఓ లెవెల్,ూ×) ఉండవలను. జూన్ 10న ధరఖాస్తు ఆఖరు తేదీ. పూర్తి వివరముల కొరకు వెంటనే 0891-2788700, https://dge.gov.inncsc.vizag/facebook సందర్శించవలను.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన
# సీనియర్ ఆర్చర్ జ్యోతి సురేఖ

**– ఆసియా క్రీడలకు ఎంపిక కావడం పట్ల మంత్రి అభినందన**

**ఉండవల్లి:(భారత శక్తి)** అంతర్జాతీయ విలువిద్య పోటీల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోన్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన స్టార్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ ఈ ఉదయం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ప్రతిష్టాత్మక 2026 ఆసియా క్రీడలకు భారత జట్టులో ఆమె చోటు దక్కించుకున్నారు. వరుసగా నాలుగోసారి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి వెన్నం జ్యోతి సురేఖ మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఆసియా క్రీడల్లో పోటీపడే అవకాశం దక్కించుకున్న జ్యోతి సురేఖను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. తన ప్రతిభతో విలువిద్య పోటీల్లో రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. ఆసియా క్రీడల్లో సత్తా చాటి దేశ కీర్తిప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## సీఎం సొంత ఊరిలో అభివృద్ధి పనులను
# పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నాగర్ కర్నూల్ (భారత శక్తి)**నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. గ్రామీణాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన కలెక్టర్ఏటీసీ సెంటర్, మోడల్ స్కూల్ నిర్మాణ స్థలాలను పరిశీలించి 5 ఎకరాల ప్రభుత్వ స్థలంపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ఆధునిక సదుపాయాలతో ప్రారంభమైన మిల్క్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. పాల సేకరణ, టెస్టింగ్ విధానాలపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్ పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి సేవలు మెరుగుపరచాలని సూచన నిర్మాణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలన్న కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులపై సమీక్ష గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సంప్ పనులను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరిక డ్రైనేజ్ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన అధికారులుగ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదల ప్రజారోగ్యానికి కీలకమన్న కలెక్టర్, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచన గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ వ్యాఖ్య గ్రామస్థులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని అధికారులకు సూచన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్పర్యటనలో అదనపు కలెక్టర్ దేవ సహాయం సహా పలువురు అధికారులు పాల్గొన్నారు

## టీడీపీ మహానాడు ఏపీ, తెలంగాణతో పాటు..
## అండమాన్ కు సంబంధించిన తీర్మానం: సోమిరెడ్డి

**నెల్లూరు(భారత శక్తి)** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత నిర్వహిస్తున్న తొలి మహానాడు కావడంతో... ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ క్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఈ వార్షిక పండుగలో మొత్తం 19 రాజకీయ, ఆర్థిక, సామాజిక తీర్మానాలను ప్రవేశపెట్టాలని కమిటీ నిర్ణయించినట్లు కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలతో పాటు తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు, అలాగే మహానాడు చరిత్రలోనే తొలిసారిగా అండమాన్ తెలుగు ప్రజల సమస్యలపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టబోతుండటం విశేషం.ఈ సందర్భంగా వైసీపీ పాలనపై సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విధ్వంసానికి మారుపేరుగా మారిందని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో పౌరులందరూ పూర్తి స్వేచ్ఛతో జీవిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి లోకేశ్ కృషి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోడ్పాటు, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏపీకి భారీగా పెట్టుబడులు సాధించామని కొనియాడారు. వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో ఘనంగా నిర్వహించాలనుకున్నప్పటికీ, ప్రభుత్వం అనుసరిస్తున్న పొదుపు చర్యల్లో భాగంగానే ఎన్టీఆర్ భవన్ వేదికగా హైబ్రిడ్ (ఆన్‌లైన్ – ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించనున్నామని సోమిరెడ్డి వివరించారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్..

**కడప, (భారత శక్తి)**ఎర్రచందనం అక్రమ రవాణాతో పాటు వరుస నేరాలకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్ రామకృష్ణన్ ముత్తు అలియాస్ రామకృష్ణపై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు స్పెషల్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఎక్కువ కేసుల్లో నిందితుడిగా ఉంటూ, ముఠాలను ఏర్పాటు చేసి అడవులను కొల్లగొడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ జె. కులశేఖర్ నేతృత్వంలో నిందితుడు రామకృష్ణపై పీడీ యాక్ట్ నమోదు చేయాల్సిందిగా సుబ్బారాయుడు సిఫారసు చేశారు.ఈ సిఫారసులను పరిశీలించిన తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్.. నిందితుడిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. రామకృష్ణ నిరంతరం ఎర్రచందనం చెట్లను నరుకుతూ, వన్యమృగాల సంరక్షణ చట్టాలను ఉల్లంఘిస్తున్నాడు. ప్రజా జీవనానికి, అటవీ సంపదకు తీవ్ర నష్టం కలిగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతనిపై ప్రస్తుతం ఏడు ఎర్రచందనం కేసులు ఉన్నాయి. వీటిలో టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో 4 కేసులు ఉండగా.. సుండుపల్లి, కలికిరి పోలీస్ స్టేషన్లతో పాటు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఒక్కొక్క కేసు నమోదయ్యాయి. ఉత్తర్వులు జారీ అయిన వెంటనే టాస్క్ ఫోర్స్ పోలీసులు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

**స్మగ్లర్లకు టాస్క్‌ఫోర్స్ వార్నింగ్** ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ జె. కులశేఖర్ స్మగ్లర్లను ఉద్దేశించి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఎంతటి కఠిన చర్యలకైనా వెనుకాడేది లేదని, అవసరమైతే మరికొంతమందిపై కూడా పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎర్రచందనం కేసుల్లో పట్టుబడిన చాలా మందికి కోర్టుల ద్వారా శిక్షలు పడ్డాయని ఆయన గుర్తుచేశారు. ఈజీ మనీకి అలవాటు పడి యువత ఇటువంటి అక్రమ రవాణా మార్గాలను ఎంచుకుని తమ జీవితాలను, భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. రాబోయే రోజుల్లో స్మగ్లర్లకు కఠిన శిక్షలు పడటమే కాకుండా, వారి అక్రమ ఆస్తులను కూడా పూర్తిగా జప్తు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

# ఆసియా క్రీడలకు సురేఖ

**విజయవాడ, (భారత శక్తి)**అంతర్జాతీయ విలువిద్యలో అద్భుత ప్రతిభతో రాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ.. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతిష్ఠాత్మక 2026 ఆసియా క్రీడలకు ఆమె వరుసగా నాలుగోసారి ఎంపికైన నేపథ్యంలో, ఈ రోజు ఉదయం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భేటీ అయ్యారు.ఈ సందర్భంగా జ్యోతి సురేఖను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. తన ప్రతిభతో విలువిద్యలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రానున్న ఆసియా క్రీడల్లోనూ సత్తా చాటి, దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణిగా ఆమెకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోకేశ్‌తో పాటు మరో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. జ్యోతి సురేఖ సాధించిన విజయాలను వారు కొనియాడారు.

## ఓటర్ల జాబితా ప్రక్షాళనలో
# రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలి

**– జూన్ 15 నుండి బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) ఇంటింటి సర్వే**

**– నకిలీలు, మృతుల పేర్ల తొలగింపునకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశం**



రంగారెడ్డి జిల్లా, మే 20: భారత శక్తి ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం మరియు రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం కావాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, కచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని, ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను (బీఎల్ఏ) నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని సూచించారు. జూన్ 15 నుండి బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి, వారిచే ఇంటింటి సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### – కీలకమైన బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) పాత్ర

కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని స్పష్టం చేశారు. స్థానికంగా మరణించిన వారి పేర్లను తొలగించడం, వలస వెళ్లిన వారిని గుర్తించడంతో పాటు అర్హులైన కొత్త ఓటరు ఎవరినీ వదలకుండా జాబితాలో చేర్చే బాధ్యత వీరిపై ఉందన్నారు.

### – యువతకు పిలుపు.. ఫామ్-6, ఫామ్-8 వినియోగం:

ౚ అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, మార్పులు, చేర్పుల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### రాజకీయ పార్టీల ప్రతినిధుల విజ్ఞప్తులు - సూచనలు:

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ) నియామకంపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, విజ్ఞప్తులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

– కొత్త పోలింగ్ కేంద్రాలు: బహుళ అంతస్తుల, ఎత్తైన భవనాల్లో నివసించే ఓటర్ల పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉన్నందున, ఆయా భవనాల్లోనే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

### -నకిలీల తొలగింపు:

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల దృష్ట్యా ఓటర్ల జాబితా నుండి నకిలీ నమోదులను, మరణించిన వారి పేర్లను తొలగించాలి.

**- ఖాళీల భర్తీ:** ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్ఓ) ఆదేశాలు జారీ చేసి, ఖాళీగా ఉన్న బీఎల్ఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

**- ఒకే ఇంట్లో 50 ఓట్లు:** ఒకే ఇంటి నంబరు కింద 50 మందికి పైగా ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి.

**- శిక్షణ, పత్రాల పంపిణీ:** ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందే బీఎల్ఓలు, పర్యవేక్షకులు, బీఎల్ఏలకు సరైన శిక్షణ ఇవ్వాలి. ఓటర్ల గణన పత్రాలను (ఎన్యూమరేషన్ ఫామ్స్) అనధికార వ్యక్తులకు కాకుండా, కుటుంబ సభ్యులకే వ్యక్తిగతంగా పంపిణీ చేయాలి. దత్తాంశ నమోదు (డేటా ఎంట్రీ) సమయంలో ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకత పాటించాలి.

### - ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు: కలెక్టర్ హామీ

రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

– ఓటర్ల జాబితా శుద్ధీకరణ నిమిత్తం నకిలీ, మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడానికి ఈఆర్ఓ లందరికీ ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

– అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలలో సాధ్యమైన చోటల్లా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకే ఇంటి నంబరుపై 50 కి పైగా ఓట్లు ఉన్న చోట విచారణ జరిపిస్తామన్నారు.

– రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ఆదేశాల మేరకు వచ్చే వారంలో బీఎల్ఓలకు, పర్యవేక్షకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

– జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల నియోజకవర్గాల వారీ వివరాలు, బీఎల్ఓల వివరాలను సేకరించి రాజకీయ పార్టీలకు అందజేస్తామని స్పష్టం చేశారు.

### - సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ సమీక్షా సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మర్రి శశిధర్ రెడ్డి (బీజేపీ), అంబోజీ శ్రీనివాస్ (బీజేపీ), కొప్పుల నర్సింహా రెడ్డి (బీజేపీ), వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి (బీజేపీ), తులసి ముఖేష్ ముదిరాజ్ (బీజేపీ), సరికొండ దుర్గేష్ (బీఆర్ఎస్), ఈ.ఆర్ యాదయ్య (బీఆర్ఎస్), వి.నవీన్ కుమార్ (బీఆర్ఎస్), పి.ధర్మ రెడ్డి (బీఆర్ఎస్) లతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి శారద, రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీఓ) అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత, మరియు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## లీటరుకు రూపాయి బాదుడు..
# ఐదు రోజుల్లో రెండోసారి!

**– ముడి చమురు నెపంతో జనం జేబులకు చిల్లు.. నిత్యావసరాలు ప్రియం కాక తప్పదా?**

**– రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం**



హైదరాబాద్ మే 20, భారతశక్తి: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదలను నెపముగా చూపుతూ, చమురు సంస్థలు సామాన్య ప్రజలపై మరోసారి ధరల భారాన్ని మోపాయి. ఒక పక్క పెరిగిన ధరలతో జనం అల్లాడుతుంటే.. ఐదు రోజుల వ్యవధిలోనే రెండోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల వేటుతో సామాన్యుడి బతుకు భారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### గాయం మానకముందే మరో వాత!

"గత శుక్రవారం (మే 15) లీటరుకు ఏకంగా రూ. 3 పెంచిన చమురు సంస్థలు, ఆ గాయం మానకముందే నేడు మరోసారి లీటరుకు సుమారు రూపాయి వరకు పెంచడం దారుణం. తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర ?111.88కి చేరింది. ఇక జిల్లాల్లో రవాణా ఖర్చుల వల్ల ఈ ధరలు మరింత భారంగా మారాయి," అని పాండురంగా రెడ్డి పేర్కొన్నారు. తగ్గినప్పుడు తగ్గించని కంపెనీలు, అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు మాత్రం క్షణాల్లో ఆ భారాన్ని వినియోగదారులపై నెట్టేయడం శోచనీయమని విమర్శించారు.

### - మధ్యతరగతిపై 'రవాణా' భారం.. నిత్యావసరాలు ఆకాశానికి!

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు కేవలం వాహనదారులకే పరిమితం కాదని, దీని ప్రభావం రవాణా రంగంపై పడి, చివరికి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్న మధ్యతరగతి, పేద ప్రజల కుటుంబ బడ్జెట్‌ను ఈ తాజా పెంపు పూర్తిగా అతలాకుతలం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు మూగప్రేక్షకుడిలా వ్యవహరించకుండా తక్షణమే స్పందించాలి. చమురు సంస్థలు తమ లాభాల కోసం ప్రజల నడ్డి విరుస్తున్నాయని, ఇప్పటికైనా ధరల పెంపును నిలిపివేయాలని పాండురంగా రెడ్డి డిమాండ్ చేశారు.

కేంద్రం:పెట్రో ఉత్పత్తులపై అదనపు పన్ను (ఎక్సైజ్ సుంకం) తగ్గించాలి.

రాష్ట్రం:విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గించి సామాన్యులకు తక్షణ ఉపశమనం కల్పించాలి.

## పిడుగురాళ్ల మెడికల్ కాలేజీలో
# ఓపీ సేవలు ప్రారంభం

**పిడుగురాళ్ల (భారత శక్తి)**పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మెడికల్ కాలేజీలో బుధవారం నుంచి (ఓ పి డి) సేవలు ప్రారంభమయ్యాయి. పిడుగురాళ్ల మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన (బ్రాహ్మణపల్లి) ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం నుంచి అవుట్ పేషెంట్ ఓ పి డి సేవలు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ పి డి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీకి ఎంపికైన స్టాఫ్ కు నియామక పత్రాలు ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అదేవిధంగా డివిజన్ స్థాయి పలు శాఖల అధికారులు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ఈఎన్టీ వంటి పలు విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను ప్రారంభించడానికి 65 మంది ప్రొఫెసర్లు, డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తో పాటు పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, పిడుగురాళ్ల మరియు మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## వింజంపల్లి,వరికోలు, రామచంద్రాపూర్ గ్రామ పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్య



**కోహెడ(భారత శక్తి)** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గ్రామాలలో ఎంపీడీవో కృష్ణయ్య పనులు జరుగుతున్న ప్రదేశానికి సందర్శించి,ఎండలు ఉన్నందున కూలీలందరు ఉదయము 6 గంటలకు లోపు పనికి రావాలని అన్నారు. అదేవిధంగా పనిచేసిన అందరికీ కూలి డబ్బులు వారం కాకముందే అకౌంట్స్ నందు జమ చేయడం జరుగుతుంది. కాబట్టి అందరు పెద్ద మొత్తంలో కూలీల రావాలని ఆయన అన్నారు. పెద్ద మొత్తంలో కూలీలు వచ్చే విధంగా చూసుకోవాలని చూసుకోవాలని సీనియర్ మేట్స్ కు,పంచాయతీ కార్యదర్శి సుధీర్, వరికోలు బాబు,రామచంద్రాపూర్ శోభ కు ఆదేశించారు.పని జరుగుతున్న ప్రదేశంలో నీడ ఉండేటట్టుగా షెడ్డు, నెట్ వేయడం జరిగినది అని మరియు మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. మూడు గ్రామపంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్యకోహెడ మండలంలో 2557కూలీలు హాజరైనట్టు తెలిపారు.

# నేరాల నియంత్రణే లక్ష్యం

**- ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు!**



**(భారత శక్తి)**చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, నేరస్థులను గుర్తించి పట్టుకోవడం, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు కీలక కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.నేరాల నివారణలో భాగంగా పోలీసులు అనుమానాస్పద కదలికలపై నిరంతర నిఘా ఉంచుతూ, అవసరమైతే వ్యక్తులను విచారించి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ముందుగానే అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు గస్తీ చర్యలను మరింత బలోపేతం చేశారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి జరిమానాలు విధిస్తూ, వారి ప్రాణ భద్రత కోసం హెల్మెట్ వినియోగం ఎంత ముఖ్యమో వివరిస్తున్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచిస్తున్నారు.ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ, శాంతియుత సమాజ నిర్మాణం సాధ్యమని ప్రకాశం జిల్లా పోలీసులు పేర్కొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నిందితుడు అరెస్ట్

**- రిమాండ్ కి తరలింపునిందితుని వద్ద నుండి ఒక కిలో గంజాయి స్వాధీనం**

**- నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్**

**(భారత శక్తి)**విశ్వసనీయ సమాచారంతో ఖానాపూర్ మండలం రామరెడ్డిపల్లి బస్ స్టాప్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి,బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్ పాస్వాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది.నిందితుడి వద్ద నుండి ఒక కిలో (లక్ష రూపాయల విలువ) గల గంజాయి,ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగింది.విచారణలో నిందితుడు బీహార్ రాష్ట్రం నుండి గంజాయి తీసుకువచ్చి ఖానాపూర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు.ఈ దాడిని, స్వాధీనం,విచారణ ప్రక్రియ మొత్తం కూడా ఈ-సాక్ష్య యాప్ ద్వారా వీడియో చిత్రీకరణ చేయడం జరిగింది.నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.మాదకద్రవ్యాల వ్యాపారం, సరఫరా,గంజాయి సాగుపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్ఐ రాహుల్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు

## బీర్ కొంటే కండోమ్ ప్యాకెట్ ఉచితం

**సిద్దిపేట(భారత శక్తి)** బీర్ బాటిల్లో కండోమ్ ప్యాకెట్ కనిపించడం కలకలం రేపింది. సిద్దిపేట జిల్లా అక్బర్పేట్ భూంపల్లిలోని ఓ వైన్స్ షాపులో కొనుగోలు చేసిన బీరులో కండోమ్ ప్యాకెట్ దర్శనం ఇచ్చింది. దాంతో బీర్ కొన్న వినియోగదారుడు షాక్ కు గురయ్యాడు. దుకాణం దారుడికి చూపించాడు. విక్రేత కూడా చేతులెత్తేసాడు. ఇదేంటని నిలదీయగా వైన్స్ షాప్ నిర్వాహకులు స్పందించలేదని షాప్ ముందు ఆందోళనకు వినియోగదారులు దిగారు. ఎక్సైజ్ అధికారులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని మాటిచ్చారు. గుడ్డిలో మెల్ల? వాడని, సరికొత్ కండోమ్ కనిపించింది.

## వీధి కుక్కల దాడులకు జంతు ప్రేమికులు బాధ్యత వహిస్తారా ?

**న్యూఢిల్లీ(భారత శక్తి)** వీధి కుక్కల దాడులకు జంత ప్రేమికులు బాధ్యత వహిస్తారా అని సుప్రీం కోర్టు నిలదీసింది. వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ విచారిస్తూ, జంతు ప్రేమికులను నిలదీసింది. ప్రజలు వీధి కుక్కల భయం లేకుండా స్వేచ్ఛగా రోడ్డు మీద తిరగాలని గత ఏడాది నవంబర్ 7వ తేదీన వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.అయితే, సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్ విచారిస్తూ, వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోమని న్యాయమూర్తి తేల్చి చెప్పారు. వీధి కుక్కల వల్ల ఎవరికైనా నష్టం కలిగినా, ఎవరిపైనైనా దాడులు చేసినా న్యాయ పరమైన బాధ్యత జంతు ప్రేమికులు తీసుకుంటారా అంటూ నిలదీసింది. జంతు హింస నిరోధక చట్టం ప్రకారం రేబీస్ సోకిన, ప్రమాదకరంగా ఉన్న కుక్కల కారుణ్య మరణాలకు కూడా సుప్రీం కోర్టు అనుమతులు ఇచ్చింది.

## నెల్లూరు జిల్లా వ్యాప్తంగా “ఫేస్ వాష్ అండ్ గో” కార్యక్రమం



**నెల్లూరు (భారత శక్తి)** బుధవారం తెల్లవారుజామున నెల్లూరు జిల్లా వ్యాప్తంగా “ఫేస్ వాష్ అండ్ గో” కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్పై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టారు.నగరం మరియు శివారు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో విస్తృత పెట్రోలింగ్ నిర్వహించి అనుమానితులపై తనిఖీలు చేపట్టారు. ప్రజలు అనుమానాస్పద విషయాలు గమనిస్తే వెంటనే 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## సత్యకుమార్.. నీకు దమ్ముంటే రాజీనామా చేసిరా

**- మంత్రి సత్యకుమార్పై ధర్మవరంలో సొంత పార్టీ నేతల ఆగ్రహం**

**ధర్మవరం (భారత శక్తి)**మంత్రి సత్యకుమార్ ఓ బ్రోకర్, హానీ ట్రాప్ వెనుక ఉన్నాడంటూ బీజేపి, కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ధర్మావరం లో సత్యకుమార్కు వ్యతిరేకంగా టీడీపీ - బీజేపీ - కాంగ్రెస్ నేతలు ఆందోళన కు దిగారు. మంగళవారం నాడు హైకోర్టు న్యాయవాది అంజన్ రెడ్డిపై మంత్రి సత్యకుమార్ అనుచరులు దాడి చేసారని ఆరోపించారు. అందుకు నిరసనగా ధర్మవరం అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ - టీడీపీ - కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. తప్పులను ప్రశ్నించే వారిపై దాడులు చేయడం దుర్మార్గం, మంత్రి సత్యకుమార్కు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని బీజేపీ నేత సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నేత పరమేష్ తదితరులు హెచ్చరించారు

## రాఘవపురం జోరుగా మట్టి తొలకలు

**- చెరువును తవ్వి నల్లమట్టి తరలింపు**

**- కన్నెత్తి చూడని రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు**



**కోరుకొండ (భారత శక్తి)**మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా రాఘవపురం చెరువు నల్ల మట్టి తరలిస్తున్నారు . జెసిపిలతో చెరువుని తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. గత రెండు నెలలుగా అక్రమ మట్టి తరలింపులు జరుగుతున్నాయి. ఇంత అక్రమ మట్టి తరలించిపోతున్న ఇరిగేషన్ శాఖ రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కోస మెరుపు. తూతూ మంత్రంగా పరిమిషన్ లు తీసుకొని అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి అమ్ముకుంటున్నారు. అక్రమంగా లక్షలు మట్టి అమ్ముకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధులు గాని ప్రభుత్వ అధికారులు కానీ స్పందించకపోవడం గమనహారం. అక్రమ మట్టి తరలింపులు ఎనకాల బడా బాబులు హస్తం ఉన్నట్లు కూడా ప్రసారం జోరుగా సాగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా రెచ్చిపోతుందని గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి. చెరువును చూస్తే అక్రమార్కులు కన్నేసి రైతుల పేరు మీద తూత్ మంత్రంగా పర్మిషన్ తెచ్చుకొని అక్రమంగా మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికార పార్టీ యంత్రాంగం మాట పక్కన పెడితే ప్రతిపక్షం కూడా నోరు ఎత్తకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారుల స్పందించి రాఘవపురం. చెరువు తవ్వి అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్న వారు పైన చర్యలు తీసుకుని అక్రమ మట్టి అడ్డుకట్టు వేయాలని పరువురు కోరుతున్నారు

## బద్వేలులో కెమిస్టుల సమ్మె విజయవంతం

**- తాహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన అసోసియేషన్ నాయకులు**



**బద్వేలు (భారత శక్తి)** అఖిల భారత కెమిస్టుల సమాఖ్య పిలుపులో భాగంగా బద్వేలు పట్టణంలో గురువారం నిర్వహించిన కెమిస్టుల సమ్మె పూర్తిగా విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని మెడికల్ షాపులన్నింటినీ మూసివేసి నిరసన వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా బద్వేలు మెడికల్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల రాధాకృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు కె.వి. సుబ్బారావు, వేలూరి మురళీధర్ రెడ్డి, సెక్రటరీ దర్శి సుబ్బరాజా, ట్రెజరర్ మాలేపాటి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి మరియు పలువురు మెడికల్ షాపుల యజమానుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.?పోటీ శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు:ముందుగా సిద్ధవటం రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్రధాన రహదారుల గుండా నినాదాలు చేస్తూ బద్వేలు తాహసిల్దార్ కార్యాలయం వరకు శాంతియు తంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ప్రధాన డిమాండ్లు ఇవే:?ఆన్‌లైన్ ద్వారా మందుల అమ్మకా లను (ఇ-ఫార్మసీ) తక్షణమే నిలిపివేయాలి.నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్న అధిక డిస్కౌంట్లను అరికట్టాలి.ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతూ, నాసిరకం మందులు తయారు చేసే కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు కిషోర్ కుమార్, నిమ్మకాయల భీమారెడ్డి, పత్తి నరసింహ, వెంకటరత్నం, సముద్రాల మల్లికార్జున, రవి, పామూరి వెంకటేశ్వర్లు, రమణ యాదవ్, వాసవి మెడికల్స్ నవీన్, దాసో సతీష్, కానుగల రఘురామయ్య, సురేష్, కందుకూరి రమేష్, మరియు పలువురు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పట్టణంలోని మెడికల్ షాపుల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు

## నకిలీ విసాతో వెళుతున్న వ్యక్తి అరెస్టు

**శంషాబాద్(భారత శక్తి)** శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి రసూల్ కైమా దేశం వెళుతున్న వ్యక్తిని ఇమ్మిగ్రేషన్ ఆధికారులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ విస్సాతో వెళ్ళేందుకు వచ్చినట్టు గుర్తించారు. నిందితుని ఎయిర్ పోర్ట్ ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు. ఎయిర్ పోర్ట్ ఔట్ పోస్ట్ పోలీసులు నిందితుని విచారణ చేస్తున్నారు.

## గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర స్థాయి సర్పంచుల సమావేశం**

**హైదరాబాద్ (భారత శక్తి)** వనస్థలిపురంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సౌదాని భూమన్న యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సర్పంచులు హాజరయ్యారు.సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ నిధుల విడుదల, స్థానిక సంస్థలకు మరింత అధికారాల కల్పన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, సర్పంచుల హక్కులను పరిరక్షించే దిశగా సంఘం రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యాచరణ చేపడుతుందని తెలిపారు.

వివిధ జిల్లాల నుంచి వచ్చిన సర్పంచులు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించి పరిష్కార మార్గాలపై సూచనలు చేశారు.ఉపసర్పంచ్ కు జాయింట్ చెక్ పవర్ వెంటనే రద్దు చేయాలి. 3,74 రాజ్యాంగ సవరణలు ప్రకారం 29 అంశాలు వాతంత్ర పంచాయితీలకు బదలాయించాలి. పంచాయితీలను స్థానికప్రభుత్వాలుగా గుర్తించాలి. ఏకగ్రీవంగా ఎన్నికైన 2134 గ్రామపంచాయితీలకు ప్రభుత్వం ప్రకటించిన నజరానాను తక్షణమే విడుదల చేయలి. గ్రామ పంచాయితిలలో వీధి దీపములు, మంచినీటి పథకములకు విద్యుత్ ఛార్జీలు ప్రభుత్వమే భరించాలి.

పంచాయితీలకు కార్యాలయములు లేని గ్రామాలకు ప్రత్యేక నిధులతో వెంటనే కార్యాలయ భవనాలు నిర్మించాలి. సర్పంచ్లకు గౌరవ వేతనం రూ: 5 వేల నుండి రూ. 20 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలి. ఖాళీ వున్న గ్రామ పంచాయితీలలో కార్యదర్శులను నియమిచాలి పనిచేసే కారోబార్, పారిశుధ్య కార్మికులు మరియు యితర సిబ్బందికి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని తీర్మానించారు.

## జంట నగరాల్లో మెడికల్ షాపులు బంద్

**హైదరాబాద్ (భారత శక్తి)** దేశ వ్యాప్తంగా బంద్ లో భాగంగా జంట నగరాల్లో ను మెడికల్ షాప్ లు మూసివేశారు.24 గంటల బంద్ కు దుకాణదారులు పిలుపునిచ్చారు.దీంతో ఉదయం నుంచే జంటనగరాల్లో మెడికల్ షాప్ లు మూతపడ్డాయి.కాగా ఆన్ లైన్ లో మందుల విక్రయం వల్ల తాము నష్టపోతున్నామని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ లోని పంజాగుట్టలో ఆల్ ఇండియా కెమిస్ట్ డ్రగ్జిస్ట్ సంఘం హైదరాబాద్ నేతలు సమావేశమయ్యారు.నగరంలో మెడికల్ షాపుల బంద్ జరుగుతుందని ఎక్కడ కూడా షాపులు తెరిచి లేవన్నారు.కాగా అసోసియేషన్ రాష్ట్ర ఉప అధ్యక్షుడు శ్రీధర్ గుప్తా మాట్లాడుతూ మెడికల్ షాపులు మూసివేశామన్నారు.మరో మెడికల్ యజమాని మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమేనన్నారు.అయితే ప్రభుత్వం ఆన్లైన్ మందుల విక్రయాలను ప్రోత్సహించడం వల్ల తాము నష్టపోతున్నామని చెప్పారు.కాగా మెడికల్ షాపుల బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో ఈ అంశంపై చర్చించారు.ఎక్కడ అత్యవసర సేవలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు

## ఎపిక్ ఇంటర్నేషనల్ హాస్పిటల్

**- మెడ్ట్రానిక్ భాగస్వామ్యం**

**హైదరాబాద్ (భారత శక్తి)**హైదరాబాద్ బంజారాహిల్స్ లోనీ మినిమల్లీ ఇన్వాసివ్ వీన్ కేర్ను విస్తరించేందుకు ఎపిక్ ఇంటర్నేషనల్ హాస్పిటల్, మెడ్ట్రానిక్తో ఒప్పందం కుదుర్చుకుంది. వెరికోస్ వీన్స్కు పెద్ద శస్త్రచికిత్సలు, కుట్లు లేకుండా గ్లూ థెరపీ, ఖీఈం, లేజర్ వంటి డే-కేర్ విధానాలతో చికిత్స. నొప్పి, మచ్చలు తక్కువ. వేగంగా కోలుకొని రోజువారీ పనులకు త్వరగా వెళ్లవచ్చు. నిపుణుల సంప్రదింపులు, అధునాతన నిర్ధారణ పరీక్షలు, ఫాలో-అప్ కేర్ అన్నీ ఒకే చోట. ఎపిక్ చైర్మన్ డా. బాలాజీ పటేల్ కోలా మాట్లాడుతూ, రోగులకు ఇంటికి దగ్గరలోనే ప్రపంచ స్థాయి వాస్కులర్ కేర్ అందించడమే ధ్యేయమన్నారు. మెడ్ట్రానిక్ సీనియర్ డైరెక్టర్ ప్రతీక్ తివారీ ప్రకారం, ఈ భాగస్వామ్యంతో సిరల ఆరోగ్యంపై అవగాహన పెంచి, ముందస్తు చికిత్సను ప్రోత్సహిస్తారు అని అన్నారు.

## రసాయన శాస్త్రంలో కేత స్వరూపకు పీహెచ్.డీ.



**పటాన్ చెరు, (భారత శక్తి)** హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కేత స్వరూప డాక్టరేట్ కు అర్హత సాధించారు. ‘చాల్కోన్ కలిపిన పిరిడిన్-పిరిమిడిన్, 1,2,4-ఆక్సాడయాజోల్ కలిపిన ఇండోలిజైన్-థయాడయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనం’పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ స్వరూప చేసిన డాక్టరల్ పరిశోధన, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో, ఆశాజనకమైన వైద్యపరమైన అనువర్తనాలు కలిగిన నూతన రసాయన సమ్మేళనాల అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు. ఈ పరిశోధనలో భాగంగా, డాక్టర్ స్వరూప ఔషధ పరంగా ముఖ్యమైన రసాయన నిర్మాణాలను ఏకీకృతం చేయడం ద్వారా జీవశాస్త్ర పరంగా ప్రాముఖ్యత కలిగిన రెండు శ్రేణుల సమ్మేళనాలను రూపొందించి, సంశ్లేషించినట్టు తెలిపారు. సంశ్లేషించిన ఈ సమ్మేళనాలను ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీతో సహా ప్రామాణిక విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగించి నిర్మాణాత్మకంగా వర్గీకరించి, తదనంతరం వాటి జీవ క్రియాశీలతను మూల్యాంకనం చేశారన్నారు. అనేక సమ్మేళనాలు ప్రోత్సాహకరమైన ఫలితాలను కనబరిచాయని, భవిష్యత్తు ఔషధ అభివృద్ధికి వాటి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయని వివరించారు. ఈ అధ్యయనం ఔషధ రసాయన శాస్త్ర రంగానికి విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని, క్యాన్సర్ చికిత్స కోసం సమర్థవంతమైన చికిత్సా ఏజెంట్ల అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు. డాక్టర్ స్వరూప సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రతి సమస్యను పరిష్కరిస్తాం..

**- అభివృద్ధిలో ప్రతీకగా తీర్చిదిద్దుతాం**

**- బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల లో సుడిగాలి పర్యటన**

**- త్వరలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్ చెరు, మే 20, (భారత శక్తి)** అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని తులసి వనం కాలనీ, భ్రమరాంబిక నగర్ కాలనీ, ఏ ఆర్ బృందావన్ కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, టైలర్ కాలనీ, ఎన్ ఎస్ ఎల్ కాలనీ, ఎన్ బి ఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటించారు. నేరుగా ప్రజలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, యూజిడీలు, విద్యుత్, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువుగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అమీన్పూర్ పరిధిలో దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడంతో పాటు, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలకు సైతం అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు పార్కులు కబ్జాలు గురికాకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య విషయంలో ప్రజలకు ఇబ్బందులకు తలెత్తకుండా నూతన సిబ్బందిని సైతం నియమిస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీలు ఏర్పడడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. ఇందుకు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడటం తన నైజం అని, మిగతా సమయం ప్రజల అభివృద్ధి సంక్షేమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని.. అవసరమైన నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అతి త్వరలో బీరం గూడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనన్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేనే స్వయంగాతమ కాలనీలకు రావడం పట్ల ఆయా కాలనీల ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్ డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివకుమార్, విద్యుత్ శాఖ ఏడి సంజీవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సాక్ ఐతో సోషల్ మీడియా అస్త్రం

**హైదరాబాద్,(భారత శక్తి)** సోషల్ మీడియాపై నిఘా పెట్టేందుకు హైదరాబాద్ పోలీసుల చేతికి సరికొత్త అస్త్రం దొరికింది. ఏఐ సాయంతో నెట్టింట ఫేక్ ప్రచారాలు చేసేవారు, సంఘ విద్రోహ శక్తులపై ఎప్పటికప్పుడు డేగ కన్ను పెట్టనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 'సాక్ ఐ' పేరుతో ఏఐ యాప్‌ను ప్రారంభించారు. తాజాగా ఈ సాక్ ఐ యాప్.. దానికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీసులు.. వెల్లడించారు. ఈ సాక్ ఐతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని సీపీ సజ్జనార్ వెల్లడించారు.ప్రస్తుతం సమాజం అంతా సోషల్ మీడియాలోనే మునిగిపోయింది. ఏ విషయమైనా, మన ఆలోచనలు అయినా సోషల్ మీడియాలో పంచుకోవడం అందరికీ అలవాటుగా మారిపోయింది. అయితే ఇప్పుడు ఈ సోషల్ మీడియాలోనే ప్రమాదకరమైన సమాచారం, విద్వేషాలను రెచ్చగొట్టడం, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన విషయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం నేరాలను అరికట్టడం, నిందితులను పట్టుకోవడం కోసం.. పోలీసులు సోషల్ మీడియాను జల్లెడ పడుతున్నారు. కానీ రకరకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు, వాటిలో కోట్ల కొద్ది అకౌంట్లను తనిఖీ చేయడం పోలీసులకు వీలు కావడం లేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పోలీసులు సరికొత్త టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నారు.ప్రస్తుతం టెక్నాలజీలో శరవేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై ఉక్కుపాదం మోపేందుకు రెడీ అయ్యారు. సోషల్ మీడియా అబ్జర్వేషన్ అండ్ సైబర్ ఇంటెలిజెన్స్ ( సాక్ ఐ ) పేరుతో సరికొత్త ఏఐ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగించేలా.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిని గుర్తించడం, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేలా ఈ అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థను హైదరాబాద్ పోలీస్ ఐటీ విభాగం తయారు చేసింది.సోషల్ మీడియాపై నిఘా పెట్టేందుకు గతంలో భారీగా సిబ్బంది అవసరం అయ్యేదని.. గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేదని పేర్కొన్న పోలీసులు.. ఈ సాక్ ఐ ఏఐ యాప్ ద్వారా ఇక నుంచి అన్నీ ఆటోమేటిక్‌గా జరగనున్నాయి. ఈ సాక్ ఐలోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ డ్యాష్‌బోర్డ్ ద్వారా డయల్ 100 కాల్స్.. ఇంటర్నెల్ ఇంటెలిజెన్స్ డేటా, హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రధాన సంఘటనలకు సంబంధించిన వివరాలను ఒకే చోటుకు తీసుకువచ్చి.. అధికారులకు పూర్తి అవగాహన కల్పిస్తుంది.ఇక సాక్ ఐని.. ప్రయోగాత్మక పరీక్షించగా.. అద్భుతమైన పనితీరును కనబరిచినట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది మొదట్లో పురానాపూల్ ఎక్స్ రోడ్ ఘటనకు సంబంధించి 85 విద్వేషపూరిత, మతపరంగా రెచ్చగొట్టేలా చేసిన అంశాలను.. గుడిమల్కాపూర్ వివాదానికి సంబంధించి పలు సోషల్ మీడియా అకౌంట్లలో ఉన్న 126 పోస్ట్‌లను ఈ సాక్ ఐ గుర్తించింది. ఇలాంటి కంటెంట్‌ను సోషల్ మీడియా నుంచి తక్షణమే తొలగించడం ద్వారా నగరంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడటమే కాకుండా.. విద్వేషాలను రెచ్చగొట్టే వారిని గుర్తించడం సాధ్యమైందని పోలీసులు తెలిపారు.మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరా, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ సాక్ ఐ సిస్టమ్ దృష్టి పెడుతుందని పోలీసులు వెల్లడించారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్.. సైబర్ బుల్లీయింగ్, స్టాకింగ్ వంటి వాటిని కూడా గుర్తించి అలర్ట్ చేస్తాయని తెలిపారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుల తీవ్రత ఆధారంగా వాటిని హై, మీడియం, లో రిస్క్ కేటగిరీలుగా విభజించి.. అభ్యంతరకర పోస్టులను తొలగించేలా ఆయా సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు అలర్ట్ ఇస్తుందని పేర్కొన్నారు.వివాదాస్పద సోషల్ మీడియా పోస్ట్‌లను మళ్లీ మళ్లీ షేర్ చేసే వారిని.. గుర్తిస్తుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రతీ ఫిర్యాదుకు ఒక యునిక్ ట్రాకింగ్ నంబర్ ఉంటుంది. ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎండ్ టు ఎండ్ మానిటరింగ్ చేస్తారు. హైదరాబాద్‌లో రోజూ జరిగే ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, మతపరమైన ఊరేగింపులపై ముందస్తు నిఘా ఉంచేందుకు ఈవెంట్ బేస్డ్ మానిటరింగ్ ఏర్పాటు చేశారు. ఆయా కీవర్డ్స్ ఆధారంగా సోషల్ మీడియా కార్యకలాపాలను ట్రాక్ చేస్తూ.. ఏదైనా ముప్పు ఉంటే పోలీసులను అలర్ట్ చేస్తుంది.ఈ అత్యాధునిక సాక్ ఐ ఏఐ టెక్నాలజీతో పోలీసులపై పనిభారాన్ని తగ్గించడమే కాకుండా.. నేరాలకు అడ్డుకట్ట వేయడంలో సమూల మార్పులు వస్తాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించేందుకు.. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చేందుకు దీన్ని రూపొందించామని తెలిపారు. ప్రస్తుత టెక్నాలజీ కాలానికి అనుగుణంగా నేరగాళ్లు.. సోషల్ మీడియాలో అస్త్రంగా చేసుకుంటున్న తరుణంలో.. ఈ టెక్నాలజీతో వారిని సమర్థంగా ఎదుర్కొంటామన్నారు.

# మళ్లీ "గ్రేటర్" డ్రామా షురూ

**హైదరాబాద్ (భారత శక్తి)**హైదరాబాద్ రాజకీయాల్లో మళ్లీ "గ్రేటర్" డ్రామా షురూ అయింది. ఎప్పట్నుంచో ఊరిస్తున్న జీహెచ్ఎంసీ ఎన్నికల నగారా మోగకముందే భాగ్యనగర వీధుల్లో పొలిటికల్ హీట్ మామూలుగా లేదు. పార్టీలన్నీ ఇప్పటికే క్యాలిక్యులేటర్లు.. కులాల మ్యాపులు, వాట్సాప్ వార్‌రూమ్‌లు దుమ్ముదులిపి బయటకు తీశాయి. అయితే ఈసారి అసలు ట్విస్ట్ ఏంటంటే... "మిత్రపక్షం" అనే పదానికి బీజేపీ సరికొత్త డెఫినిషన్ చెప్పబోతోందట.. నిన్నటిదాకా పక్కనే ఉండి మురిసిపోయిన జనసేనకు గట్టిగానే 'హ్యాండ్' ఇచ్చేలా ఉందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది.ఇక అంతా మనదే! 2020 గ్రేటర్ ఎన్నికల్లో ఊహించని రీతిలో దూసుకొచ్చిన బీజేపీ, అప్పటినుంచి హైదరాబాద్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. "పాతబస్తీ నుంచి పటాన్‌చెరు వరకు కాషాయ జెండా" ఎగరేయాలనే కలతో ముందుకెళ్తోంది. ఇదే ఊపులో మొన్నటి అసెంబ్లీ.. నిన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా భాగ్యనగరంలో తన ఓటు బ్యాంక్‌ను గట్టిగానే పెంచుకుంది. దీంతో ఈసారి జీహెచ్ఎంసీలో ఏపీలో కలిసిన కూటమి బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి రచ్చ లేపుతాయని.. సీట్ల పంపకాలు కూడా జరిగిపోతాయని పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తెగ ఆశపడ్డారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించగానే సోషల్ మీడియాలో "హైదరాబాద్‌లో కూటమి ప్రభంజనం" అంటూ పోస్టర్లు కూడా రెడీ అయిపోయాయి. కానీ బీజేపీ మైండ్ గేమ్ వేరేలా ఉంది. "ఆంధ్రాలో ఫ్రెండ్షిప్ ఓకే బ్రదర్... కానీ హైదరాబాద్ కార్పొరేషన్ మాత్రం మాదే!" అన్నట్టుగా లోపల స్క్రిప్ట్ మార్చేసిందట. తాజా పొలిటికల్ గుసగుసల ప్రకారం బీజేపీ ఈసారి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 'సింగిల్ ప్లేయర్' గేమ్ ఆడాలని డిసైడ్ అయిందట. త్యాగాల 'తమ్ముడు'.. లెక్కల 'అన్నయ్య'. ఎందుకంటే 2020 గ్రేటర్ ఎన్నికల్లో అప్పటికే అభ్యర్థులను ప్రకటించి.. ప్రచారానికి సిద్ధమైన జనసేన... బీజేపీ పెద్దల మాట కోసం లాస్ట్ మినిట్‌లో వెనక్కి తగ్గింది. "పెద్దన్న కోసం త్యాగం" మోడ్‌లో అప్పట్లో సైలెంట్ అయింది. కట్ చేస్తే, ఇప్పుడు ఆంధ్రాలో కూటమి సూపర్ హిట్ అయి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం రేంజ్‌కు వెళ్లడంతో హైదరాబాద్‌లోనూ తమకు కనీసం ఓ పాతిక, ముప్పై సీట్లయినా ఇస్తారని జనసైనికులు లెక్కలు వేసుకున్నారు. కానీ ఇక్కడే కమలనాథులు తమ పక్కా కమర్షియల్ లెక్కలు బయటకు తీశారు.తెలంగాణలో మా ఓటు... మా సీటు... మా కార్పొరేటర్.. ఇక్కడ వేరే పార్టీలకు స్పేస్ ఇస్తే మా సొంత క్యాడర్ గుస్సా అవుతుంది. పైగా ఓట్లు చీలిపోతే లాభపడేది కాంగ్రెస్, బీఆర్ఎస్సే" అని బీజేపీ ఇంటర్నల్ మీటింగ్స్‌లో తేల్చేసిందట. అంటే జనసేన పరిస్థితి ఇప్పుడు "వచ్చిన వాడిని పంపించలేక.. పోయిన వాడిని ఆపలేక" అన్నట్టుగా తయారైంది. పవన్ కళ్యాణ్ రూట్ మ్యాప్ ఏంటి..? ఇప్పుడు అసలు సిసలైన ప్రశ్న ఏమిటంటే... పవన్ కళ్యాణ్ ఈసారి కూడా "సర్దుకుపోదాం రా.. పెద్ద ల్యాండ్ స్కేప్‌లో ఆలోచించాలి" అంటూ సైలెంట్ అయిపోతారా? లేక "తెలంగాణలో జనసేన ఉనికి చాటాలంటే ఫైట్ తప్పదు బాస్!" అంటూ ఒంటరిగానే బరిలోకి దిగుతారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ జనసేన నిజంగానే ఒంటరిగా పోటీ చేస్తే ఫలితం ఎలా ఉంటుందో ఊహించడం కష్టమే.

ఎందుకంటే ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు నడుస్తోంది. ఈ ముగ్గురు ఉద్దండుల మధ్య జనసేనకు మైక్ దొరుకుతుందా? లేక కేవలం సోషల్ మీడియా పోస్టర్లకే పరిమితం అవుతుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏదేమైనా గ్రేటర్ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ హైదరాబాద్ రాజకీయాలు థ్రిల్లర్ సినిమాను మించిపోయేలా ఉన్నాయి. ఇక మిగిలింది ఒక్కటే... "కూటమి ఉందా? లేదా? జనసేనకు బీజేపీ సారీ చెప్పిందా?" అన్న సస్పెన్స్‌కు అధికారికంగా ఎండ్ కార్డ్ పడటం.. చూద్దాం.

# జిల్లా వ్యాప్తంగా భారీ నాకాబందీ తనిఖీలు

**- నెల్లికుదురు లో 2.5 కిలోల గంజాయి స్వాధీనం, ముగ్గురు అరెస్ట్.**



**మహబూబాబాద్ (భారత శక్తి)**జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్-డివిజన్ల పరిధిలో పోలీసులు భారీ నాకాబందీ, ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడం, రౌడీ షీటర్లు మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడం ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్పోస్టులు, ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు మరియు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మహబూబాబాద్ మరియు తొర్రూరు సబ్-డివిజన్ల పరిధిలో కలిపి మొత్తం 3485 వాహనాలను తనిఖీ చేశారు.మహబూబాబాద్ సబ్-డివిజన్ పరిధిలో 1985 వాహనాలను తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్లు లేని 74 వాహనాలు, సరైన వాహన పత్రాలు లేని 49 వాహనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అలాగే తొర్రూరు సబ్-డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక నాకాబందీలో 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో 12 మంది ఎస్సైలు, 4 మంది సీఐలు, 2 మంది డీఎస్పీలు పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 1500 వాహనాలను తనిఖీ చేశారు. ఈ నాకాబందీ సందర్భంగా నెల్లికుదురు ప్రాంతంలో నిర్వహించిన తనిఖీలలో ఒక కారులో సుమారు 2.5 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, గంజాయి తరలింపుకు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లా ఎస్పీ డా. శబరీష్, స్వయంగా మహబూబాబాద్ పట్టణంలోని మూడు కోట్ల సెంటర్, ధరణి హాస్పిటల్ సమీపంలోని నాకాబందీ పాయింట్లను పరిశీలించి విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.

# తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా

**హైదరాబాద్, (భారత శక్తి)**తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి ప్రముఖ సినీ నిర్మాత, వ్యాపారవేత్త సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన సమర్పించిన రాజీనామా లేఖను ఛాంబర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పరిశీలించి ఆమోదించింది.తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున విడుదల చేసిన అధికారిక లేఖలో, సునీల్ నారంగ్ సమర్పించిన రాజీనామా పత్రాన్ని పరిశీలించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తూ అధ్యక్ష పదవి నుంచి తక్షణమే విముక్తి కల్పించినట్లు వెల్లడించారు.

# రాజీవ్ స్వగృహతో రూ. 83 కోట్లు

**హైదరాబాద్,(భారత శక్తి)** హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉన్న రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలానికి భారీ స్పందన లభించింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని తొర్రూరు, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి లేఅవుట్లలోని మొత్తం 85 ప్లాట్లకు నిర్వహించిన ఈ వేలంలో బిడ్డర్లు పోటీ పడి కొనుగోలు చేశారు. నిర్దేశించిన కనీస ధర కంటే అదనపు ధరలు పలకడంతో ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.83 కోట్ల మేర భారీ ఆదాయం సమకూరింది.హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాలలో ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములకు మార్కెట్‌లో ఎంతటి భారీ డిమాండ్ ఉందో మరోసారి రుజువైంది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ లేఅవుట్లలో ఉన్న ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సోమవారం నిర్వహించిన బహిరంగ వేలానికి బిడ్డర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రాంతాలైన తొర్రూర్‌లో 66 ప్లాట్లు, కుర్మల్‌గూడలో 11 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 8 ప్లాట్లతో కలిపి మొత్తం 85 ఓపెన్ ప్లాట్లకు ఈ వేలం నిర్వహించారు. పెద్ద అంబర్‌పేటలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేలం ప్రక్రియలో కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో స్థిరాస్తి రంగానికి ఉన్న క్రేజ్ కారణంగా.. చదరపు గజానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర కంటే బిడ్డర్లు చాలా ఎక్కువ మొత్తాన్ని పాడుకుని ప్లాట్లను సొంతం చేసుకున్నారు. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.83 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ వెల్లడించారు.ఈ బహిరంగ వేలంలో ఓఆర్ఆర్, ఆదిభట్ల ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉన్న తొర్రూర్ లేఅవుట్‌లో రికార్డు ధర పలికింది. ఇక్కడి ప్లాట్లను దక్కించుకోవడానికి బిడ్డర్లు ఒకరితో ఒకరు తీవ్రంగా పోటీ పడ్డారు.

తొర్రూర్‌లో 200 నుంచి 700 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 66 ప్లాట్లకు గానూ.. ప్రభుత్వం చదరపు గజానికి కనీస ధరగా రూ.25 వేలు నిర్ణయించింది. అయితే ఇక్కడ సగటున చదరపు గజానికి రూ.32,500 ధర లభించగా.. అత్యంత గరిష్ఠంగా ఒక ప్లాట్ ఏకంగా రూ.45,500 పలుకడం విశేషం. ఐటీ రంగానికి దగ్గరగా ఉండటం భవిష్యత్తులో వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉండటమే ఈ స్థాయి పోటీకి కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మరోవైపు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఉన్న కుర్మల్‌గూడ లేఅవుట్‌లో కూడా ల్యాండ్ వాల్యూస్ భారీగా పెరిగాయి. ఇక్కడ 200 నుండి 400 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లకు చదరపు గజం కనీస ధర రూ.20 వేలుగాగా ప్రభుత్వం నిర్దేశించగా.. వేలంలో గరిష్ఠంగా రూ.27,500 వరకు ధర పలికింది. అలాగే ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న మేడ్చల్ పరిధిలోని బహదూర్‌పల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు సైతం కొనుగోలుదారులు భారీగా పోటీ పడ్డారు. ఇక్కడ 200 నుంచి 1000 చదరపు గజాల విస్తీర్ణంలోని పెద్ద ప్లాట్లకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. బహదూర్‌పల్లిలో చదరపు గజానికి కనీస ధర రూ.27 వేలుగా నిర్ణయించగా.. బిడ్డర్లు పోటీ పడటంతో అది గరిష్ఠంగా రూ.40,500 ధర పలికింది. ప్రభుత్వ లేఅవుట్లలో క్లియర్ టైటిల్స్, మౌలిక వసతులు ఉంటాయనే నమ్మకంతోనే ప్రజలు బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ ధరకైనా కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చారని అధికారులు వెల్లడిస్తున్నారు.

# ఢిల్లీలో అధికారం సాధ్యమేనా

**హైదరాబాద్, (భారత శక్తి)** తెలంగాణ రాజకీయాల్లో అధికారం దక్కించుకున్న ఏ నాయకుడికైనా ఢిల్లీ పీఠం ఒక తీపి కల. గతంలో కేసీఆర్ తన రెండో విడత పాలన చివరలో బీఆర్ఎస్ ద్వారా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, చివరికి సొంత ఇలాకాలోనే పట్టు కోల్పోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి తన మొదటి విడత పాలనలోనే.. అది కూడా పదవి చేపట్టిన కొద్ది కాలానికే తన జాతీయ ఆకాంక్షలను బయటపెట్టారు. అయితే కేసీఆర్ ప్రస్థానానికి, రేవంత్ రెడ్డి ఆలోచనలకు మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత కాంగ్రెస్ అనే జాతీయ పార్టీ అండ. కేసీఆర్ శూన్యం నుంచి ఒక జాతీయ వేదికను నిర్మించాల్సి రాగా, రేవంత్ కేవలం ఉన్న పార్టీలోనే తన స్థాయిని పెంచుకుంటే సరిపోతుంది.రేవంత్ తనకు జాతీయ ఆశలు ఉన్నాయని కానీ ఇప్పుడే కాదని చెబుతున్నారు. 2034లో అని చెబుతున్నారు. కేసీఆర్ తన రెండో పదవీకాలం ముగిసే వేళ జాతీయ రాజకీయాల గురించి గట్టిగా మాట్లాడటం మొదలుపెట్టారు. అప్పటికే పదేళ్ల పాలనపై వ్యతిరేకత మొదలైంది. కానీ రేవంత్ రెడ్డి తన మొదటి టర్మ్‌లోనే తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. ఇది ఒక రకంగా సాహసమే. నేను రెండు సార్లు సీఎంగా ఉంటాను, ఆ తర్వాతే జాతీయ రాజకీయాలకు వెళ్తాను అని చెప్పడం ద్వారా ఆయన తన కేడర్‌లో స్థిరత్వాన్ని నింపాలని చూస్తున్నారు. అయితే, పాలన ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజలు ముఖ్యమంత్రి దృష్టి పాలన మీద ఉందా లేక వ్యక్తిగత ఎదుగుదల మీద ఉందా అని ప్రశ్నించే అవకాశం ఉంది.బీఆర్ఎస్ అనేది కేసీఆర్ , ఆయన కుటుంబం చుట్టూ తిరిగే పార్టీ. అక్కడ నిర్ణయాధికారం ఒక్కరిదే. కానీ కాంగ్రెస్ అలా కాదు. ఇక్కడ అంతర్గత ప్రజాస్వామ్యం ఎంత ఉంటుందో, గ్రూపు రాజకీయాలు కూడా అంతే బలంగా ఉంటాయి. రేవంత్ రెడ్డికి సొంత పార్టీలోనే బలమైన ప్రత్యర్థులు, సీనియర్లు ఉన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలంటే ఆయన కేవలం ప్రతిపక్షాలనే కాదు, పార్టీలోని ఇతర పవర్ సెంటర్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది. కేసీఆర్‌కు పార్టీలో ఎదురులేకపోవడం ఒక ప్లస్ అయితే, రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ జాతీయ నాయకత్వంతో ఉన్న సాన్నిహిత్యం అతిపెద్ద బలం. కేసీఆర్ తన హయాంలో తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించారు. రేవంత్ రెడ్డి ఇంకా ఆ స్థాయికి చేరుకోవాల్సి ఉంది. పాలనలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయడం, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఆయన రెండోసారి ముఖ్యమంత్రి కాగలరు. ఒకవేళ సంక్షేమ పథకాల్లో విఫలమైతే, 2034 లక్ష్యం అనేది కేవలం కలగానే మిగిలిపోతుంది. తెలంగాణ ప్రజలు ప్రాంతీయ సెంటిమెంట్ కు ప్రాధాన్యత ఇస్తారు. తమ సీఎం ఢిల్లీ పర్యటనలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ప్రజలు భావిస్తే, అది రాజకీయంగా పెద్ద డ్యామేజ్ కలిగిస్తుంది.తెలంగాణ సమాజం తమ నాయకుడు తమ కోసమే పని చేయాలని కోరుకుంటుంది.

కేసీఆర్ ఎప్పుడైతే అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టారో, అప్పుడే తెలంగాణ ఓటర్లు ఆయనకు దూరం కావడం మొదలైంది. రేవంత్ రెడ్డి ఈ పొరపాటు చేయకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. రేవంత్ రెడ్డి జాతీయ నాయకుడిగా ఎదగాలంటే, ముందుగా తెలంగాణలో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలి. ఒకవేళ తెలంగాణ ప్రజలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని భావిస్తే, రెండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే ఉండదు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డికి బలమైన నెట్‌వర్క్, జాతీయ పార్టీ నేపథ్యం ఉన్న మాట వాస్తవమే అయినా.. రాజకీయాల్లో ప్రజా తీర్పు అత్యంత శక్తివంతమైనది. రేవంత్ రెడ్డి తన పాలనతో ప్రజలను మెప్పిస్తూ, ఢిల్లీ వైపు అడుగులు వేస్తేనే ఆయన కేసీఆర్ కంటే మెరుగైన ఫలితాలు సాధించగలరనేది ఎక్కువ మంది అభిప్రాయం.


# చేరేవారెవరురా?... నిలిచేవారెవరురా?

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణలో బీఆర్ఎస్ లో కొంత అయోమయం నెలకొంది. నేతలు ఆ పార్టీలో చేరేందుకు కూడా ముందుకు రావడంలేదు. బీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత బయటకు వచ్చి వేరే పార్టీ పెట్టడంతో కొంత రాజకీయంగా ఇబ్బందులున్నాయని చెప్పాలి. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలుస్తుందన్న నమ్మకం లేకపోవడం వల్లనే చేరికలు లేవని ప్రత్యర్థి పార్టీలకు చెందిన సోషల్ మీడియాలో వార్తలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీలో చేరికలు లేవు. అలాగని వెళ్లిపోయే వారు లేరు. కొనసాగుతున్న వారు కూడా పెద్దగా అందరూ యాక్టివ్ గా లేకపోవడం కూడా చర్చనీయాంశమైంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు గడుస్తుంది. సహజంగా అధికార పార్టీపై వ్యతిరేకత ఉంటుంది కనుక బలమైన అపోజిషన్ పార్టీలో చేరే వారు ఎక్కువగా ఉంటారు. ఇంత ముందుగా ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ కన్ఫర్మ్ చేసుకోవడం కోసం ముందుగానే వచ్చి చేరతారు. ఇటీవల జీవన్ రెడ్డి చేరికను కొందరు ఉదహరించవచ్చు. కానీ కాంగ్రెస్ లో తనకు సరైన ప్రాధాన్యత లభించకపోవడం వల్లనే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరారు కాని, లేకపోతే ఆయన కూడా చేరే వారు కారన్నది అందరూ ఒప్పుకుని తీరాల్సిన నిజం. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ లో ఏదో ఒక పదవి దక్కి ఉంటే చేరే వారా? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ను వదిలి కాంగ్రెస్ లో చేరారు. ఆ తర్వాత ఎవరూ చేరలేదని ఆ పార్టీ నేతలు కొంత సర్ది చెప్పుకుంటున్నా.. కొత్తగా వచ్చి చేరే నేతలేరన్నదే ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. ఉప ఎన్నికలు అన్నింటిలోనూ ఓటమి చవి చూసిన ఆ పార్టీపై నమ్మకం లేకపోవడంతో పాటు పార్టీ అధినేత కేసీఆర్ బయటకు రాకపోవడం కూడా ఒక కారణమని అని అంటున్నారు. కేటీఆర్, హరీశ్ రావులు ఎంతగా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్నప్పటికీ కేసీఆర్ కు వచ్చిన మైలేజీ రాదన్నది వాస్తవమని పార్టీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకూ అనేక నియోజకవర్గాల పరిధిలోని నాయకులు కూడా చేరికలను ప్రోత్సహించడం లేదన్న అభిప్రాయమూ ఉంది. మొత్తం మీద బీఆర్ఎస్ లో చేరేవారు లేరు. వెళ్లేవారు లేరు. కొత్త ముఖాలకు కనిపించేందుకు అవకాశమే కనిపించడం లేదు.

# గచ్చిబౌలిలో గందరగోళం - ఐఐఐటీ జంక్షన్ ప్యాక్!

**హైదరాబాద్, (భారత శక్తి)** హైదరాబాద్ నగరం ప్రస్తుతం ఒక భారీ నిర్మాణ ప్రాంగణంలా మారిపోయింది. ఎటు చూసినా తవ్వకాలు, ఫ్లైఓవర్లు, అండర్ పాసుల పనులతో ట్రాఫిక్ నరకం కనిపిస్తోంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ నుంచి మొదలుకొని నగరం నడిబొడ్డున ఉన్న కేబీఆర్ పార్క్ వరకు ప్రతిచోటా ఒకేసారి పనులు ప్రారంభించడంతో సమస్యలే కనిపిస్తున్నాయి. కొన్ని వారాలుగా నగరంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఉప్పల్ వంటి ప్రాంతాల్లో ప్రయాణం అంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. ప్రభుత్వం ఒకేసారి డజనుకు పైగా ప్రాజెక్టులను ప్రారంభించడం, సరైన ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయకపోవడం వల్ల నగరవాసులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అధికారులు తమ వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలన్న తొందరలో సామాన్యుల సౌకర్యాన్ని విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నగరానికి గుండెకాయ వంటి గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ వద్ద మల్టీ లెవల్ ఫ్లైఓవర్, అండర్ పాస్ పనులు ఏప్రిల్ నుంచి ఊపందుకున్నాయి. ఈ పనుల కారణంగా దాదాపు ఏడాది పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు ప్రకటించారు. దీనివల్ల గచ్చిబౌలి స్టేడియం నుంచి విప్రో జంక్షన్ వరకు వెళ్లే దారిలో నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఐటీ ఉద్యోగులు ఆఫీసులకు చేరుకోవాలంటే అదనంగా గంట సమయం కేటాయించాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయంగా సూచించిన నానక్రామ్‌గూడ, గోపనపల్లి మార్గాలు కూడా ఇరుగ్గా ఉండటంతో అక్కడ కూడా పరిస్థితి దారుణంగా మారింది.నగరం మధ్యలో ఉన్న ఏకైక గ్రీన్ లంగ్ కేబీఆర్ పార్క్ చుట్టూ ఆరు ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే, దీని కోసం వందలాది చెట్లను నరకడాన్ని పర్యావరణ ప్రేమికులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎకో సెన్సిటివ్ జోన్‌లో చెట్ల నరికివేతను తక్షణమే ఆపాలని స్టే ఇచ్చింది. దీనివల్ల ఇక్కడ పనులు తాత్కాలికంగా నిలిచిపోయినప్పటికీ, అప్పటికే చేసిన తవ్వకాల వల్ల ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. పర్యావరణం, అభివృద్ధి మధ్య సమతుల్యత దెబ్బతినడం వల్లే ఈ అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు నగరానికి తూర్పు ద్వారమైన ఉప్పల్ లో కూడా పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. ఫ్లైఓవర్ పనుల నిమిత్తం నేటి నుంచే అక్కడ ట్రాఫిక్ ఆంక్షలు కఠినతరం చేశారు. వరంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలను మళ్లించడంతో ఇటు ఎల్బీనగర్, అటు నాచారం వైపు ఉన్న రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. పశ్చిమ వైపు గచ్చిబౌలి, తూర్పు వైపు ఉప్పల్.. ఇలా రెండు వైపులా ఒకేసారి రోడ్లను మూసివేయడం అధికారుల ప్లానింగ్ లోపానికి నిదర్శనమని నగరవాసులు మండిపడుతున్నారు. నిర్మాణ పనులు ప్రారంభించే ముందు ట్రాఫిక్ మళ్లింపు కోసం ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయాలి. కానీ హైదరాబాద్‌లో రోడ్డు సగం తవ్విన తర్వాత గానీ ట్రాఫిక్ డైవర్షన్ల గురించి ఆలోచించడం లేదు. డ్రైనేజీ పైపులు, మెట్రో పిల్లర్లు, ఫ్లైఓవర్లు.. ఇలా అన్ని పనులు ఒకేసారి మొదలుపెట్టడం వల్ల జంక్షన్ల వద్ద గందరగోళం నెలకొంటోంది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ తవ్వకాలు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. గుంతలు పడిన రోడ్లు, అసంపూర్తి పనులు వర్షపు నీటితో నిండితే పరిస్థితి ఊహకందని విధంగా ఉంటుందని వాహనదారులు భయపడుతున్నారు.జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ , వాటర్ బోర్డు అధికారుల మధ్య సరైన సమన్వయం లేకపోవడమే ఈ సమస్యకు మూల కారణమని స్పష్టమవుతోంది. అభివృద్ధి వద్దు అని మేము అనడం లేదు, కానీ ఒక పద్ధతి ప్రకారం పనులు చేయాలి. నగరం మొత్తాన్ని ఒకేసారి తవ్వేస్తే మేము ఎటు వెళ్లాలి అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాత్కాలిక ప్రాతిపదికన అయినా సరే ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నగరవాసులు కోరుకుంటున్నారు.

# వైకాపా కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి



**తాడేపల్లి(భారత శక్తి)** వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్మృతివనం, విగ్రహం ఏర్పాటుపై వైయస్ జగన్కు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేసారు.దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులలో దక్షిణ భారతావనిలో ప్రకాశం పంతులు గారు అగ్రగణ్యులని, అలాంటి మహనీయుడి జీవిత విశేషాలు భావితరాల వారికి తెలియజేసేలా ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ప్రకాశం స్మృతివనం, శాసనసభ ప్రాంగణంలో ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు చేయాలని మల్లాది విష్ణు నాయకత్వంలో వైయస్ జగన్కు విజ్ఞప్తి చేసారు.
వారి విజ్ఞప్తిని తప్పక పరిశీలించి, అధికారంలోకి రాగానే తప్పనిసరిగా ఏర్పాటుచేస్తామని వైయస్ జగన్ హామీ ఇచ్చారు. వైయస్ జగన్ హామీతో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు జ్వాలాపురం శ్రీకాంత్, ద్రోణంరాజు శ్రీవాత్సవ, రాంపల్లి రవిచంద్ర, పురుషోత్తమ శర్మ, ఈ.క్రిష్ణమాచారి, సీహెచ్.శ్రీనివాసరావు, కె. వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు నకిలీ వ్యాపారం..

## - ఇప్పుడు ప్రభుత్వంపై కుట్ర.. జోగి రమేష్ ప్లాన్

**తిరుపతి,(భారత శక్తి)** ఏపీలో నకిలీ మద్యం తయారీకి సంబంధించిన ఛార్జ్ షీట్ దాఖలు చేసింది సిఐడి. ఏడాది కిందట చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లో నకిలీ మద్యం డంప్ వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే దీని మూలాలు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఉన్నాయని.. అప్పట్లో నకిలీ మద్యంతో కోట్లాది రూపాయలు సంపాదించిన విషయం బయటపడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నకిలీ మద్యం తయారీ జరిపి.. కూటమి ప్రభుత్వం పై రాజకీయ విమర్శలు వచ్చేలా ప్లాన్ చేసినట్లు స్పష్టమవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నకిలీ మద్యంతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. కూటమి వచ్చిన తర్వాత రాజకీయ కుట్రకు తెర లేపారు. అసలు ఈ కుట్ర వెనుక ఉన్నది ఎవరు? ఎప్పటి నుంచి ఈ తతంగం ప్రారంభం అయింది? మొత్తం అంశాలను చార్జ్ షీట్ లో పొందుపరిచింది సిఐడి. ఈ కేసులో ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దన్ రావు, జగన్మోహన్ రెడ్డి సోదరులు. వీరికి జోగి రమేష్ సోదరులతో మంచి సంబంధాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారుచేసి సరఫరా చేసేవారు అద్దేపల్లి సోదరులు. వారిపై ఎటువంటి కేసులు, అరెస్టులు జరగకుండా జోగి రమేష్ చూసుకునేవారు. వీరికి పరస్పర వ్యాపార ప్రయోజనాలు ఉండేవి. ప్రతి రెండు నెలలకు ఐదు లక్షల రూపాయల చొప్పున జోగి రమేష్ నుంచి వీరికి అందేది. వ్యాపారంలో వచ్చిన కోట్లాది రూపాయల లాభాలు తిరిగి జోగి రమేష్ సోదరులకు వెళ్ళేవి. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో వీరి వ్యాపారం కోట్లలో జరిగింది. అద్దేపల్లి సోదరులతో పాటు జోగి రమేష్ సోదరులు బాగానే లాభపడ్డారు అనేది ఈ చార్జ్ షీట్ సారాంశం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం పాలసీని అక్రమాల మయంగా చూపించాలన్నది వీరి ప్రణాళిక. ఈ విషయంలో జోగి రమేష్, అద్దేపల్లి సోదరులను ప్రలోభ పెట్టినట్లు తెలుస్తోంది. అయితే చాలా ప్రాంతాల్లో టెండర్లు దక్కించుకున్న వ్యాపారులకు నష్టాలు తప్పవు అన్న భయం వెంటాడింది ప్రారంభంలో. అలా తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయ చంద్రారెడ్డి అనుచరులు కూడా అలానే బాధపడ్డారు. ఈ విషయం మద్యం వ్యాపారంలో ఆరితేరిన అద్దేపల్లి సోదరులకు అర్థం అయింది. అప్పుడే జోగి రమేష్, అద్దేపల్లి సోదరులను పిలిపించి తంబళ్లపల్లె ద్వారా కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రణాళిక రూపొందించారు. అక్కడ నకిలీ మద్యం తయారీని ప్రోత్సహించారు. ఇందుకుగాను కొంత మొత్తాన్ని అందిస్తానని అద్దేపల్లి జనార్ధన్ రావుకు ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. నీ చేతికి మట్టి అంటకుండా చూస్తానని చెప్పడంతో.. తంబళ్లపల్లెలో నకిలీ మద్యం తయారు చేయించి జయ చంద్రారెడ్డి అనుచరుల మద్యం దుకాణాలకు అందించేలా ప్లాన్ రూపొందించారు. ఇలా నకిలీ మద్యం తయారుచేసిన తరువాత జోగి రమేష్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో అద్దేపల్లి జనార్ధన్ రావు విదేశాలకు వెళ్లిపోయారు. ఏమీ తెలియనట్లుగా జోగి రమేష్ ఈ నకిలీ మద్యాన్ని పట్టించి.. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో ఆందోళనలు చేయించారు.. అయితే జోగి రమేష్ నుంచి ఆశించిన స్థాయిలో సాయం రాకపోవడంతో అద్దేపల్లి జనార్ధన్ రావు పోలీసులకు చిక్కిపోయారు. జరిగిందంతా చెప్పేసారు పోలీసులకు. ఇప్పుడు చార్జ్ షీట్లో అదే విషయాన్ని చెప్పింది సిఐడి..

# పోలీసులు పట్టించుకొని ఉంటే

# మా అమ్మ ప్రాణాలు పోయేవి కావు

- దాడులు, వేధింపులు తట్టుకోలేక దళితురాలు చెన్నమ్మ ఆత్మహత్య
- నాలుగు రోజులుగా న్యాయం కోసం నిరీక్షణ
- పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాక కూడా నిందితుల దౌర్జన్యం
- కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామంలో ఘటన
- తన చావుకు కారణం వీరే అంటూ శుభలేఖ పై రాసి ఉరి వేసుకున్న వైనం



**షాద్ నగర్ (భారత శక్తి)** ఏదైనా అన్యాయం జరిగితే పోలీస్ స్టేషన్ వెళితే న్యాయం జరుగుతుందని స్వాంతన చేకూరుతుందని ఆశిస్తాం.. బాధ్యతగల పోలీసులు ఫిర్యాదులు స్వీకరించాక వెంటనే సంఘటనను అర్థం చేసుకొని స్పందిస్తే ఎలాంటి ఘర్షణలు గొడవలు ఉండవు.. కానీ ఫిర్యాదుల విషయంలో సాగదీత ధోరణి బాధితుల ప్రాణం మీదకు తెస్తుందనడానికి ఈ సంఘటన ఒక నిదర్శనం. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన ఎద్దు చెన్నమ్మ అనే దళిత మహిళ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎద్దు సురేష్, ఎద్దు నరేష్ లక్ష్మమ్మ అనిత స్వరూపలు ఇటీవలే చెన్నమ్మపై దాడికి పాల్పడ్డారు. ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతూ.. నాన్న బూతులు తిడుతూ తీవ్రంగా అవమానించారు. దీనిపై చిన్నమ్మ అతని కుమారుడు ఎద్దు సందీప్ తో కలిసి మూడు రోజుల క్రితం కొందుర్గు పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా వారిపై ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఈ వ్యవహారంలో సరైన రీతిలో స్పందించలేదని చెన్నమ్మ కుమారుడు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు ఇచ్చాక వారిని పిలిపిస్తే కూడా రాలేదని ఆ తర్వాత కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలి వేయడంతో ఏం చేయాలో తెలియక తమను రక్షించేవారు ఎవరని బాధపడుతూ తన తల్లి చెన్నమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఈ సమయంలో ఇంట్లో ఉన్న ఒక శుభలేఖ కార్డుపై దాడి చేసిన వారి పేర్లు రాసి ఉరివేసుకొని చనిపోయిందని కుమారుడు సందీప్ కన్నీరు మున్నీరుగా విలపించారు.

# పెద్ది రికార్డ్ వ్యూస్

**హైదరాబాద్, (భారత శక్తి):** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరో గా నటించిన 'పెద్ది' చిత్రం జూన్ 4 న విడుదల అవ్వబోతున్న సందర్భంగా నిన్న మేకర్స్ ముంబై లో భారీ ఈవెంట్ ని ఏర్పాటు చేసి అన్ని భాషల్లోనూ విడుదల చేశారు. ఈ ట్రైలర్ కి నెటిజెన్స్ నుండి డివైడ్ రెస్పాన్స్ వచ్చింది కానీ, సోషల్ మీడియా లో మాత్రం సెన్సేషనల్ వ్యూస్ ని సొంతం చేసుకుంది. రామ్ చరణ్ కి ఉన్నటువంటి గ్లోబల్ క్రేజ్ కారణంగా ఈ రేంజ్ వ్యూస్ వచ్చాయని అంటున్నారు విశ్లేషకులు. కేవలం యూట్యూబ్ లో మాత్రమే కాదు , ఇన్ స్టాగ్రామ్ , ట్విట్టర్ , ఫేస్ బుక్ ఇలా అన్ని యాప్స్ లోనూ ఈ చిత్రానికి రికార్డు స్థాయి వ్యూస్ వచ్చాయి.

ఇలా అన్ని సోషల్ మీడియా నెట్ వర్క్స్ నుండి ఈ చిత్రానికి 101 మిలియన్ వ్యూస్ వచ్చాయట.కేవలం రామ్ చరణ్ ఇన్ స్టాగ్రామ్ హ్యాండిల్ నుండి ఈ సినిమా ట్రైలర్ కి 20 మిల్లియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. అదే విధంగా యూట్యూబ్ లో ఈ ట్రైలర్ తెలుగు వెర్షన్ కి 38 మిలియన్ వ్యూస్ రాగా, హిందీ వెర్షన్ ట్రైలర్ కి 33 మిలియన్ వ్యూస్ వచ్చాయి. మిగిలిన వెర్షన్స్ కి కలిపి యూట్యూబ్ లోనే 81 మిలియన్ వ్యూస్ వచ్చాయి. ఇది సాధారణమైన విషయం కాదు. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు ఈ సినిమాకు ఆడియన్స్ లో ఎలాంటి క్రేజ్ ఉంది అనేది. వాళ్ళ అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రం ట్రైలర్ ఉండుంటే వేరే లెవెల్ లో ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ పెరిగేవని , కానీ బ్యాడ్ లక్ అని అంటున్నారు రామ్ చరణ్ ఫ్యాన్స్. ఇకపోతే ఈ చిత్రానికి సంబంధించిన మూడవ పాటని ఈ నెల 22 న విడుదల చేయబోతున్నారు. భోపాల్ లో ఒక మ్యూజికల్ నైట్ ని నిర్వహించి , ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మన్స్ ద్వారా ఈ సాంగ్ రిలీజ్ కాబోతుంది.అదే విధంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ని రెండు ప్రాంతాల్లో నిర్వహించాలని అనుకుంటున్నారు. ఈ సినిమా నేపథ్యం విజయనగరం జిల్లాలో ఉంటుంది కాబట్టి, మొదటి ప్రీ రిలీజ్ ఈవెంట్ ని జూన్ 2 న అక్కడే ప్లాన్ చేస్తున్నారు. అదే విధంగా రెండవ ప్రీ రిలీజ్ ఈవెంట్ ని హైదరాబాద్ లో ఏర్పాటు చేయబోతున్నారు. ఈ రెండు ప్రీ రిలీజ్ ఈవెంట్స్ లో , ఎదో ఒక ఈవెంట్ లో రిలీజ్ ట్రైలర్ ని విడుదల చేస్తారట. అదే విధంగా హైదరాబాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా రాబోతున్నట్టు సమాచారం.

# అమెరికాలో కిలో మామిడి రూ.1900..

**హైదరాబాద్ (భారత శక్తి)** మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కారణంగా భారత్ పై ప్రభావం పడుతోంది. ఈ తరుణంలో డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ పడిపోతుంది. దీంతో అమెరికాలోని కొన్ని వస్తువుల సేవలు భారతీయులకు ప్రియంగా మారాయి. కానీ ఈ సమయంలో భారత జాతీయ పండు అమెరికాలో సంచనలం సృష్టిస్తోంది. అక్కడివారు మామిడి పండ్లకు పడిపోయి ఎగబడి కొంటున్నారు. దీంతో భారత్ లోని మామిడి పండ్లు అమెరికాలో కిలో రూ. 1900 తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో కిలో మామిడికి రూ. 100 నుంచి రూ.200 ఉండగా.. అమెరికాలో డిమాండ్ ఎందుకు పెరిగింది? పూర్తి వివరాలు మీకోసం..భారతీయుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న మామిడి పండ్లు ఇప్పుడు అమెరికా మార్కెట్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. ఒకప్పుడు అమెరికాలోని కొన్ని భారతీయ కిరాణా దుకాణాల్లో మాత్రమే కనిపించిన భారత మామిడిపండ్లు, ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత రిటైల్ చైన్ స్టోర్లలో కూడా అందుబాటులోకి రావడం విశేషం. ముఖ్యంగా అమెరికాలో అతిపెద్ద హోల్‌సేల్ రిటైల్ సంస్థలలో ఒకటైన కాస్ట్కో స్టోర్లలో భారత మామిడిపండ్లు విక్రయించడం భారత వ్యవసాయ రంగానికి పెద్ద గుర్తింపుగా భావిస్తున్నారు.అమెరికా మార్కెట్‌లో భారత మామిడిపండ్లకు పెరుగుతున్న డిమాండ్ చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ముఖ్యంగా గుజరాత్‌కు చెందిన ప్రసిద్ధ కేసర్ మామిడిపండ్లు అక్కడ భారీ ధరలకు అమ్ముడవుతున్నాయి. కాస్ట్‌కో వెబ్‌సైట్‌లో ఒక కిలో కేసర్ మామిడి ధర సుమారు 20 డాలర్లుగా నమోదైంది. అంటే భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.1,900కు పైగా అవుతుంది. భారత్‌లో సాధారణంగా రూ. 100 నుంచి రూ. 200 వరకు అందుబాటులో ఉండే మామిడి పండ్లు విదేశాల్లో విలాసవంతమైన ఫలాలుగా మారిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఈ విజయానికి వెనుక భారత దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కీలక పాత్ర పోషించాయి. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సుల్ జనరల్‌గా పనిచేస్తున్న ప్రకాష్ గుప్తా భారత మామిడిపండ్లను ప్రధాన అమెరికన్ రిటైల్ మార్కెట్లలో ప్రవేశపెట్టేందుకు ప్రత్యేక కృషి చేసినట్లు వెల్లడించారు. ఆయన దీనిని 'మామిడి దౌత్యం'గా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది. భారతీయ ఉత్పత్తులకు అమెరికన్వినియోగదారుల్లో విశ్వాసం పెంచేందుకు ఏడాది కాలంగా నిరంతర ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు.భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఉత్పత్తిదారుగా కొనసాగుతోంది. ప్రపంచ మొత్తం మామిడి ఉత్పత్తిలో దాదాపు 45 నుంచి 50 శాతం వరకు భారత్ నుంచే వస్తుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్రలో పండే అల్ఫోన్సో, గుజరాత్ కేసర్, ఆంధ్రప్రదేశ్ బంగినపల్లి, ఉత్తరప్రదేశ్ దసరి, లంగ్రా వంటి రకాల మామిడిపండ్లు అంతర్జాతీయ మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. రుచి, సువాసన, తీపి కారణంగా భారత మామిడి పండ్లకు విదేశాల్లో భారీ ఆదరణ లభిస్తోంది.అమెరికాకు మామిడిపండ్ల ఎగుమతి అంత సులభమైన ప్రక్రియ కాదు. అక్కడి ఆహార భద్రతా ప్రమాణాలు చాలా కఠినంగా ఉంటాయి. పండ్లను ప్రత్యేక హాట్ వాటర్ ట్రీట్‌మెంట్, రేడియేషన్ ప్రాసెసింగ్ వంటి విధానాల ద్వారా శుద్ధి చేసిన తర్వాతే ఎగుమతికి అనుమతి ఇస్తారు. అలాగే పండ్లు చెడిపోకుండా కోల్డ్ చైన్ వ్యవస్థ ద్వారా వేగంగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నదే అయినా, పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఎగుమతిదారులు ముందుకు వస్తున్నారు.

# క్యాబ్ సర్వీసుల్లో సరికొత్త విప్లవం..

**హైదరాబాద్, (భారత శక్తి)** ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలు భారత్‌లో రైడ్ హైలింగ్ మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న వేళ.. ఇప్పుడు వీటికి గట్టి పోటీ ఇచ్చేందుకు వియత్నాం ఎలక్ట్రిక్ వెహికిల్ మేకర్ విన్‌ఫాస్ట్ సిద్ధంగా ఉంది. అతి త్వరలోనే భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు చూస్తోంది. ఇది భారత క్యాబ్ సర్వీసుల్లో పెను సంచలనాలు సృష్టిస్తుందని భావిస్తున్నారు. చాలా తక్కువ ధరల్లోనే ఎలక్ట్రిక్ క్యాబ్ సేవలు అందిస్తూ మార్కెట్‌ను షేక్ చేయాలని చూస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం క్యాబ్ సర్వీసుల్లో ఉన్నటువంటి ఓలా, ఉబర్ వంటి కంపెనీలు కిలోమీటరుకు సగటున రూ. 12 నుంచి రూ. 20 వరకు వసూలు చేస్తుండగా.. విన్‌ఫాస్ట్ కిలోమీటరుకు రూ. 8 తోనే సర్వీసుల్ని లాంఛ్ చేయాలని చూస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధరలతో పోలిస్తే ఇది చాలా తక్కువగా ఉండటంతో వినియోగదారుల్ని ఆకర్షించే అవకాశం ఉందని భావిస్తున్నారు.క్యాబ్ సర్వీసుల్ని భారీ ఎత్తున లాంఛ్ చేసేందుకు.. గ్రేటర్ నోయిడాలో సుమారు 1000 టర్కోయిజ్ (ఆకుపచ్చ- నీలం) కలర్ కాంపాక్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్స్‌ను పార్క్ చేసి ఉంచారు. ప్రస్తుతం డ్రైవర్లను నియమించుకునే దశలో ఉంది. ఇక్కడ వారికి కూడా ఆకర్షించే జీతాలు ఆఫర్ చేస్తుండటం విశేషం. నెలకు రూ. 40 వేల ఫిక్స్‌డ్ శాలరీతో నియామకాల్ని చేపడుతోంది. దీంతో మరోవైపు ఈ ఉద్యోగాలపైనా ఆసక్తి పెరుగుతోంది.తొలి దశ సేవల్ని.. నోయిడా నుంచే ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. విన్‌ఫాస్ట్ క్యాబ్ సర్వీస్ బుకింగ్ కోసం.. తన గ్రీన్ అండ్ స్మార్ట్ మొబిలిటీ ( సంస్థ యాప్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ జీఎస్ఎం సంస్థ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలతోనే కార్యకలాపాల్ని నిర్వహించనుంది. లైమో గ్రీన్ అనే ప్రీమియం ఎలక్ట్రిక్ ఓఖం ఇందులో కీలకంగా ఉంది. 3 వరుసల సీట్లతో ఉండే.. ఈ వెహికిల్ ప్రీమియం క్యాబ్ సెగ్మెంట్‌ను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.టెస్టింగ్ సమయంలో భారత రోడ్లపై ఈ వాహనం ఇప్పటికే దర్శనం ఇచ్చింది. విన్‌ఫాస్ట్ ఎఈ 5 ఎలక్ట్రిక్ క్రాసోవర్ కూడా క్యాబ్ సర్వీసుల్లో భాగం అవుతుందని భావిస్తున్నారు. ఇక్కడ విన్‌ఫాస్ట్ క్యాబ్ సర్వీసుల్లో కొత్త వ్యూహం రచిస్తోంది. వాహనాల తయారీ నుంచి క్యాబ్ సర్వీస్ వరకు మొత్తం నియంత్రణ వారి చేతుల్లోనే ఉండనుంది. ఇతర డ్రైవర్లు లేదా థర్డ్ పార్టీ యాప్స్‌పై ఆధారపడకుండా విన్‌ఫాస్ట్ వాహనాలనే.. వీరు నియమించిన డ్రైవర్లతోనే కార్యకలాపాలు నిర్వహించనుంది.ఇటీవల బ్లూస్మార్ట్ క్యాబ్ సర్వీసులు నిలిచిపోవడంతో ఎలక్ట్రిక్ క్యాబ్ మార్కెట్లో ఏర్పడిన ఖాళీని.. భర్తీ చేయాలని విన్‌ఫాస్ట్ చూస్తోంది. భారత్‌లో ఎలక్ట్రిక్ మొబిలిటీకి కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తుంది ఈ క్రమంలోనే తమిళనాడులో తయారీ యూనిట్ కూడా ఏర్పాటు చేస్తున్న సంస్థ.. ఇప్పుడు క్యాబ్ సర్వీసులతో నేరుగా వినియోగదారుల మార్కెట్లోకి ఎంట్రీ ఇస్తోంది.

# 23న యాదగిరిగుట్టలో కేబినెట్ సమావేశం

**హైదరాబాద్, (భారత శక్తి)** ఈనెల 21వ తేదీన తెలంగాణ కేబినెట్ భేటీ జరగనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. అయితే తాజాగా ఆ సమావేశాన్ని వాయిదా వేసింది. ఈనెల 21వ తేదీన సరస్వతి అంత్య పుష్కరాలు ఉన్న నేపథ్యంలో.. రెండు రోజుల తర్వాత నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఈ మంత్రివర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లోని సచివాలయంలో కాకుండా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాలతోపాటు.. పాలనా పరమైన నిర్ణయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.మొదట కేబినెట్ భేటీని ఈనెల 21వ తేదీనే నిర్వహించాలని భావించినా.. ఆ రోజు సరస్వతి పుష్కరాలు ఉండటంతో ఈనెల 23వ తేదీకి మార్చింది. ఇక అదే 23వ తేదీన యాదగిరిగుట్టలో వేద పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనుండటం గమనార్హం. మంత్రివర్గ సమావేశం అంటే రాజధాని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. రాష్ట్ర ప్రజలకు, పుణ్యక్షేత్రాల వద్దకు ప్రభుత్వ పాలనను తీసుకెళ్లాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలో భాగంగానే ఈ సరికొత్త ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రంలోని ప్రముఖ ఆలయం, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కేబినెట్ భేటీని నిర్వహించడం విశేషం. ఈ నిర్ణయం వల్ల ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని తెలంగాణ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం.అయితే ఇలా కేబినెట్ భేటీని హైదరాబాద్ బయట నిర్వహించడం ఇదేం తొలిసారి కాదు. గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రివర్గ సమావేశాన్ని మేడారంలో నిర్వహించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క సారక్క జాతర సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మేడారంలోనే కేబినెట్ భేటీని ఏర్పాటు చేశారు. అక్కడే జాతరకు సంబంధించిన ఏర్పాట్లతోపాటు.. భక్తులకు సౌకర్యాలు, నిధుల విడుదలకు సంబంధించిన కీలక నిర్ణయాలకు ఆమోదం కల్పించారు.ఇప్పుడు కూడా అలాంటి వ్యూహాన్నే యాదగిరిగుట్టలోనూ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం వల్ల స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని.. వాటిపై తక్షణమే స్పందించే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బాసర సరస్వతి అంత్య పుష్కరాలు ఈనెల 21వ తేదీన ప్రారంభం కానుండటంతో.. తెలంగాణ ప్రభుత్వం బాసరలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లను చేస్తోంది. ఈ వేడుకకు చాలా మంది మంత్రులు హాజరుకానుండటంతో.. ఆ రోజున కేబినెట్ భేటీని వాయిదా వేశారు.

# మహిళా పీఎస్‌పై

# పెట్రోల్ బాటిల్‌తో దాడి

**విజయనగరం(భారత శక్తి)** విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్ పై మంగళవారం రాత్రి షేక్ గౌస్ అనే వ్యక్తి పెట్రోల్ బాటిల్ తో దాడి చేశాడు. సాలూరు కు చెందిన గౌస్ విజయనగరం కు చెందిన మహిళను నాలుగేళ్ళ క్రితం వివాహమాడాడు. ఇద్దరు పిల్లలున్న గౌస్ కుటుంబం లో కలహాలు రావడంతో మహిళా స్టార్ సిబ్బంది గౌస్ భార్య ను స్టేషన్ కు పిలిచించారు. ఆ రాత్రే గౌస్ సరాసరి మహిళా పోలీస్ స్టేషన్ కు వచ్చి రావడంతోనే ఒక బాటిల్ తి పెట్రోల్ తీసుకుని ఆ పై మద్యం సేవించి స్టేషన్ పై దాడి చేశాడు. స్టేషన్ లో రిసెప్షన్ వద్ద, ఎస్ఐ రూమ్ గోడపై పెట్రోల్ పోసి నిప్పంటించబోతుండగా స్టేషన్ సిబ్బంది అడ్డుకున్నారు. వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తో ఎస్ఐ లక్ష్మీ ప్రసన్న కుమార్ వచ్చి గౌస్ ని అదుపులో కి తీసుకున్నారు.

# అమెరికాను లైట్ తీసుకుంటున్న ఇండియా

**న్యూఢిల్లీ, (భారత శక్తి)** అమెరికా.. ఈ పేరు వింటేనే ఒకప్పుడు భారత దేశ పరిపాలకులు భయపడేవారు. అమెరికా నుంచి ఎవరైనా ప్రతినిధులు వస్తున్నారంటే అలర్ట్ అయిపోయేవారు. అమెరికా అధ్యక్షుడు గనుక ఇండియాలో పర్యటిస్తే.. దేవుడు భూమ్మీదకి వచ్చినట్టు భావించేవారు. సకల సౌకర్యాలు చేసేవారు. గొప్ప గొప్ప సత్కారాలు చేపట్టేవారు. అమెరికా చెప్పినట్టు వినేవారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే అమెరికా చేతిలో కీలు బొమ్మలాగా వ్యవహరించేవారు.ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అమెరికా చెప్పినట్టు వినడం కాదు కదా.. అమెరికా గట్టిగా హెచ్చరికలు చేసిన సరే వినిపించుకునే పరిస్థితి లేదు. అమెరికా ఏం చేసినా సరే నిశ్శబ్దంగా ఉండే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పుడు ఇండియా మారిపోయింది. నయా ఇండియా గా అవతరించింది. భయపడే స్థాయి నుంచి నిలబడే స్థాయికి.. వణికే స్థాయి నుంచి ఎదురు చెప్పే స్థాయికి ఎదిగింది. అందువల్లే ఇండియా విషయంలో అమెరికా ఒకప్పటి మాదిరిగా ఉండడం లేదు. ఒకప్పటి స్థాయిలో బెదిరింపులకు పాల్పడటం లేదు.మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధం జరుగుతోంది. పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ దిగుమతి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల భారత్ లాంటి అతిపెద్ద దిగుమతి దారు దేశానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. దీనివల్ల దేశంలో ధరల స్థాయి నిరంతరం పెరుగుతోంది.. ఇది ఎక్కడదాకా వెళ్తుందో తెలియదు. పైగా చమురు కంపెనీలకు ప్రతిరోజు 750 కోట్ల వరకు నష్టం వస్తుంది. కొనుగోలు ధరలు పెరిగిపోవడం.. ఇతర ఖర్చులు అధికంగా కావడంతో కంపెనీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. అంతకుముందే కంపెనీలకు రోజుకు 1000 కోట్ల వరకు నష్టాలు వచ్చాయి. ఈనెల 15న లీటర్ పెట్రోల్, డీజిల్ మీద మూడు రూపాయలు చొప్పున పెంచడంతో.. కొంతవరకు నష్టాలు భర్తీ అయ్యాయి.క్రూడ్ ఆయిల్ విషయంలో భారత్ ముందుచూపుతో వ్యవహరించింది. రష్యా నుంచి గతంలో భారత్ ముడి చమురు కొనుగోలు చేసేది.

ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్ తో యుద్ధం వల్ల రష్యా నుంచి ముడి చమురు భారత్ కొనుగోలు చేయడాన్ని అమెరికా ప్రశ్నించింది. ఈనెల 16 వరకే ముడి చమురు కొనుగోలు చేయాలని డెడ్లైన్ విధించింది. ఇప్పటికే ఆ గడువు ముగిసిపోయింది. ఆయనప్పటికీ రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడం ఆగదని పెట్రోలియం శాఖ కార్యదర్శి సుజాతశర్మ ఇప్పటికే ప్రకటించారు. దీంతో ఇకపై కూడా భారతదేశానికి రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏప్రిల్ 17 ముందు వరకు నౌకలలో లోడ్ చేసిన రష్యా చమురును ఏ దేశమైనా కొనుగోలు చేయవచ్చు. ఆంక్షలు ఉండవు. పైగా గతంలో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసింది. ఇప్పుడు కూడా కొనుగోలు చేస్తుంది.. అయితే భారత్ నుంచి ఈ ప్రకటన రావడంతో.. రష్యా ముడిచమురు కొనుగోలు చేయడానికి మినహాయింపులను అమెరికా మరో 30 రోజులపాటు పెంచడం ఇక్కడ విశేషం.

## జీడి నెల్లూరు టీటీడీ ఎమ్మెల్యే

# డాక్టర్ థామస్ సంచలన వాఖ్యలు

**నెల్లూరు (భారత శక్తి)** కూటమి ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా ఇసుక,గ్రావెల్ అక్రమ రవాణా అవుతోందని జీడి నెల్లూరు టీటీడీ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అంగీకరించారు. చంద్రగిరి, నగరి నియోజక వర్గాల్లో అక్రమ రవాణా గురించి పట్టించుకోవడం లేదు. దళిత ఎమ్మెల్యే లు నియోజకవర్గాల్లో జరుగుతున్నది మాత్రమే చూపిస్తున్నారని అయన అన్నారు.

# 25 వేల ఎకరాల అసైన్డ్ భూముల స్వాధీనం

**హైదరాబాద్, (భారత శక్తి)** రాష్ట్రంలో అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సాగులో లేని సుమారు 25 వేల ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపడుతోంది. రాష్ట్ర ప్రజలు, పారిశ్రామిక అవసరాల కోసం ఈ అసైన్డ్ భూములను సేకరించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇక దశల వారీగా ఈ అసైన్డ్ భూముల సేకరణ ప్రక్రియ చేపట్టనుండగా.. ఇప్పటికే చర్యలు చేపట్టారు.తెలంగాణ పారిశ్రామిక, ప్రజా అవసరాల కోసం రాష్ట్రంలో సాగులో లేని సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం అవుతోంది. మరీ ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో ఉన్న ఈ అసైన్డ్ భూములను విడతల వారీగా స్వాధీనం చేసుకోనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇప్పటికే సుమారు 5 వేల ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియను మొదలుపెట్టగా.. అందులో దాదాపు 3 వేల ఎకరాలను పారిశ్రామిక అభివృద్ధి కోసం తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి అప్పగించారు.టీజీఐఐసీతోపాటు.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), రైల్వే శాఖ సహా పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు మౌలిక వసతుల కోసం, ఇతర ప్రజా అవసరాల కోసం భూములు కేటాయించాలని రెవెన్యూ శాఖను ఆయా సంస్థలు కోరినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. హైదరాబాద్ చుట్టు పక్కల పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ సంస్థ ఒక్కటే దాదాపు 10 వేల ఎకరాల భూమి కావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఎంకేపల్లిలో సుమారు 100 ఎకరాలను గోశాల కోసం కేటాయించగా.. పెద్దమంగళారం ప్రాంతంలో దాదాపు 300 ఎకరాలు.. సీతారాంపురం, దామరపల్లి, పెద్దవీడు ప్రాంతాల్లో మరో 500 ఎకరాలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న అధికారులు టీజీఐఐసీకి అప్పగించారు.రంగారెడ్డి జిల్లా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. భూమిలేని రైతులకు సుమారు 1.40 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను కొన్ని దశాబ్దాల క్రితమే కేటాయించారు. అయితే.. హైదరాబాద్ సమీప ప్రాంతాలు, పట్టణ పరిసరాల్లో ఉన్న దాదాపు 25 వేల ఎకరాల ఈ అసైన్డ్ భూములు .. వ్యవసాయ అవసరాలకు ఉపయోగించకుండా ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు.. వాటిని తిరిగి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.భూమి లేని పేద రైతులు వ్యవసాయం చేసుకునేందుకు.. అసైన్డ్ భూములను కేవలం సాగు కోసం మాత్రమే కేటాయించారు. అయితే.. కొందరు అసైన్డ్ పట్టాలు కలిగి ఉన్న వారు.. ఈ భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లకు విక్రయిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అయితే అసైన్డ్ భూములను అమ్మడం, బదిలీ చేయడం చట్టపరంగా నిషేధం ఉంది. లబ్ధిదారుడు మరణిస్తే.. ఆ తర్వాతే అతని వారసులకు ఈ అసైన్డ్ భూములు బదిలీ అవుతాయి. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) చట్టం-1977 ప్రకారం.. రూల్స్ అతిక్రమిస్తే.. ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఇప్పటివరకు సుమారు 3 వేల ఎకరాల అసైన్డ్ భూములు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించినట్లు తెలుస్తోందని సీనియర్ రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు.అసైన్డ్ భూములకు సంబంధించి.. అక్రమ లావాదేవీలు బయటికి వచ్చినప్పుడల్లా సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఉదాహరణకు తుక్కుగూడలో 5 ప్రాంతాల్లో విస్తరించి ఉన్న 24 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇదే తరహాలో మొయినాబాద్, శంకర్‌పల్లి, మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు పెద్దవీడు, మద్దూరు, సోలిపేట్ వంటి గ్రామాల్లో కూడా నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. టెక్నికల్‌గా చూస్తే అసైన్డ్ భూములు కలిగి ఉన్న రైతులు పరిహారానికి అర్హులు కారు. అయినప్పటికీ ల్యాండ్ పూలింగ్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రయోజనాలు కల్పిస్తోంది.ఇక ఈ అసైన్డ్ భూములను అప్పగించే రైతులకు.. ప్రతీ ఎకరానికి సుమారు 800 చదరపు గజాల డెవలప్డ్ ప్లాట్లను ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్ విలువ పరంగా చూస్తే ఇది అసలు భూమి కంటే ఎక్కువ విలువను కలిగి ఉంటుందని.. ఈ ప్లాట్లను చట్టబద్ధంగా అమ్ముకోవచ్చని రెవెన్యూ డివిజనల్ అధికారి ఒకరు వెల్లడించారు. అయితే ఇందులో మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు కూడా అధికారుల నోటీసుల తర్వాత స్వచ్ఛందంగా భూములను అప్పగించేందుకు ముందుకు రావడం గమనార్హం. అలాంటివారిని ఆక్రమణదారులుగా పరిగణిస్తున్న అధికారులు.. భూసేకరణ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు దీర్ఘకాలిక న్యాయ వివాదాలను నివారించేందుకు వారికి సుమారు 300 చదరపు గజాల అభివృద్ధి చేసిన ప్లాట్లను అందిస్తున్నట్లు చెప్పారు.

# సత్తెనపల్లిలో అగ్ని ప్రమాదం..

## - అప్రమత్తమైన సిబ్బంది.




**సత్తెనపల్లి (భారత శక్తి)** బుధవారం విద్యుత్ కార్యాలయం సమీపంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ తీగల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి, సమీపంలోని కరెంట్ కాటేజ్ వైపు వేగంగా వ్యాపించాయి.ఈ ఘటనను గమనించిన విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.సకాలంలో స్పందించిన అధికారుల చర్యలతో ఎటువంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరగకుండా పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది చురుకైన చర్యలను అభినందించారు.

# చిక్కుల్లో ‘ధురంధర్ 2’..

## కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు!



బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన బాలీవుడ్ భారీ యాక్షన్ థ్రిల్లర్ ‘ధురంధర్ 2’ చుట్టూ ఇప్పుడు చట్టపరమైన వివాదం ముసురుకుంది. ఈ సినిమాలో సాయుధ దళాల రహస్యాలను, వారి కార్యకలాపాలకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందంటూ ఢిల్లీ హైకోర్టులో ఒక ప్రజాహిత వ్యాజ్యం (PIL) దాఖలైంది. సశస్త్ర సీమా బల్ (SSB) విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దీపక్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే బుధవారం ఈ కేసుపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమా అనేది కల్పిత కథ ఆధారంగా తెరకెక్కినప్పటికీ.. దేశ భద్రతా దళాల్లో పనిచేస్తున్న సిబ్బంది వ్యక్తం చేసిన ఆందోళనలను, అభ్యంతరాలను అంత తేలికగా తీసిపారేయలేం. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC)ను న్యాయస్థానం ఆదేశించింది. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, దర్శకుడు ఆదిత్యధర్ కాంబినేషన్‌లో స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ‘ధురంధర్ 2’ గత మార్చి నెలలో విడుదలై సంచలన విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లను సాధించి రికార్డు సృష్టించింది.

ప్రస్తుతం విదేశాల్లో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ‘నెట్‌ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం, భారతీయ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఇండియాలో ఈ సినిమా జూన్ 4 నుంచి ‘జియో హాట్‌స్టార్’ వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్ కానుంది.

# ఇక తమిళం వంతు!

దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం ‘దేవర’తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి ‘పెద్ది’ చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే. ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు.

ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం. కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. ‘పెద్ది’ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ‘పెద్ది’లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.



## ఆసుపత్రి వద్ద కెమెరాలు చూసి

# చిర్రెత్తిపోయిన సల్మాన్ ఖాన్

బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ పాపరాజీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముంబైలోని ఓ ఆసుపత్రి వద్ద తనను చుట్టుముట్టిన ఫొటోగ్రాఫర్ల తీరుపై మండిపడ్డాడు. ‘మీకు పిచ్చెక్కిందా?’ (పాగల్ హో క్యా?) అంటూ సీరియస్ అయ్యాడు. ఈ ఘటన మంగళవారం ముంబైలోని మహిమ్ ప్రాంతంలో ఉన్న హిందూజా ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది.(ఆసుపత్రి నుంచి బయటకు వస్తున్న సల్మాన్‌ను ఫొటోగ్రాఫర్లు చుట్టుముట్టారు. ఆయన తన కారు వైపు వెళ్తుండగా ఒక్కసారిగా ఆగి వెనక్కి తిరిగి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పద్ధతిగా ప్రవర్తించాలని హెచ్చరించాడు. సల్మాన్ తీవ్ర స్వరంతో మాట్లాడటంతో ఫొటోగ్రాఫర్లు వెంటనే క్షమాపణలు చెప్పి వీడియో తీయడం ఆపేశారు. అయితే, సల్మాన్ ఖాన్ ఎవరిని పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్లారనే విషయంపై స్పష్టత రాలేదు. కాగా, తాను ఒంటరిగా ఉన్నానంటూ వస్తున్న వార్తలపై సల్మాన్ ఇటీవల స్పందించిన విషయం తెలిసిందే. తనకు పెద్ద కుటుంబం, స్నేహితులు ఉన్నారని, తాను ఒంటరిని కాదని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు ఎక్కువ మందితో ఉండి తన సోషల్ బ్యాటరీ అయిపోతుందని, అందుకే కొంత ‘మీ టైమ్’ తీసుకుంటానని తన ఎక్స్ ఖాతాలో వివరించాడు. ఈ నేపథ్యంలోనే ఆయన పాపరాజీపై అసహనం వ్యక్తం చేసి ఉండవచ్చని భావిస్తున్నారు.



# నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న ‘సెయాన్’ చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. ‘ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన ‘కింగ్‌డమ్’ సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో ‘సెయాన్’ కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా’ అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.



## దేశభక్తి అంశాలతో

# ఆర్‌కే దీక్ష

స్వీయ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ రూపొందించిన చిత్రం ‘ఆర్‌కే దీక్ష’. కిరణ్, ఆక్సఖాన్, అలేఖ్య ప్రధాన పాత్రల్లో నటించారు. జూన్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం దర్శకనిర్మాత ఆర్.కె.గౌడ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం టీజర్‌తో పాటు పాటలను విడుదల చేశారు. అకుంఠిత దీక్షతో ఏదైనా కార్యాన్ని సంకల్పిస్తే విజయం తథ్యమనే సందేశాన్ని అందించే చిత్రమిదని, వీర జవాన్ మురళీనాయక్ గొప్పతనాన్ని తెలియజేసేలా ఓ ప్రత్యేకమైన పాటను రూపొందించామని, సందేశం ప్రధానంగా ఈ సినిమా మెప్పిస్తుందని ఆర్.కె.గౌడ్ తెలిపారు. మంచి కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించారని సీనియర్ నటుడు సుమన్ ప్రశంసించారు. సైనికుల ధైర్యసాహసాలను ఆవిష్కరించే ఓ పాట సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని నటి తులసి చెప్పింది. ఈ చిత్రానికి సంగీతం: రాజ్‌కిరణ్, సమర్పణ: డీఎస్ రెడ్డి, దర్శకత్వం, నిర్మాణం: ప్రతాని రామకృష్ణగౌడ్.



# ‘సతీ లీలావతి’ మూవీ రివ్యూ!



లావణ్య త్రిపాఠి ప్రధానమైన పాత్రను పోషించిన సినిమా ‘సతీ లీలావతి’. రొమాంటిక్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమాకి తాతినేని సత్య దర్శకత్వం వహించాడు. ‘శాకుంతలం’ సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన దేవ్ మోహన్, ఈ సినిమాలో లావణ్య త్రిపాఠికి జోడీగా నటించాడు. ఈ నెల 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, నెల తిరక్కుండానే ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు (మే 20వ తేదీ) నుంచి ‘జియో హాట్ స్టార్’లో స్ట్రీమింగ్ అవుతోంది.

లీలావతి (లావణ్య త్రిపాఠి) ఓ సినిమా డైరెక్టర్. ఆమెతో ఓ సినిమా చేయాలని చాలామంది నిర్మాతలు వెయిట్ చేస్తుంటారు. ఆమె భర్త సేతుపతి ( దేవ్ మోహన్) ఓ సైకాలజిస్ట్. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల ( నరేశ్ – పవిత్ర) పోట్లాటలు చూస్తూ పెరిగిన కారణంగా ఆమె మానసికంగా దెబ్బతింటుంది. ఆ సమస్య నుంచి బయటపడటానికి సాయం చేసిన సేతుపతినే వివాహం చేసుకుంటుంది. అయితే పూర్తిగా కెరియర్ పై ఫోకస్ చేసిన ఆమె, సేతుపతిని నిర్లక్ష్యం చేస్తుంది. లీలావతి ప్రవర్తనకి తాను విసిగిపోయినట్టుగా ఆమెతో సేతుపతి చెబుతాడు. తాను నికోలా సెబాస్టియన్ (మడోన్నా సెబాస్టియన్) అనే యువతిని ప్రేమించినట్టుగా చెబుతాడు. ఇకపై ఆమెతోనే జీవించాలనే నిర్ణయానికి వచ్చానని అంటాడు. తనకి విడాకులు ఇవ్వమని కోరుతూ లాయర్ ను కూడా ఇంటికి పిలిపిస్తాడు. అందుకు సంబంధించిన కాగితాలపై సంతకం చేయమని అంటాడు. తనని సేతుపతి ప్రేమించి పెళ్లి చేసుకోలేదనీ, తన తండ్రి అతనిని ఒప్పించాడనే విషయం లీలావతికి అప్పుడే అర్థమవుతుంది. సేతుపతి నిర్ణయం పట్ల ఆగ్రహావేశాలకు లోనైన లీలావతి, అతనిని ఇంట్లోనే బంధిస్తుంది. లీలావతి తండ్రి .. లీలావతితో సినిమా తీయాలనుకుంటున్న మొట్ట రాజన్ .. సేతుపతి పిలిపించిన లాయర్ .. సేతుపతి ప్రేమించిన నికోలా అక్కడికి చేరుకుంటారు.

అప్పుడు లీలావతి ఏం చేస్తుంది? పర్యవసానంగా చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది కథ. ‘సతీ లీలావతి’ అనే పేరు వినగానే, అందుకు పూర్తి రివర్స్ గేర్ లో కథ వెళుతుందని ప్రేక్షకులు ముందుగానే గ్రహిస్తారు. భార్య భర్తల కీచులాటలోని ఎంటర్టైన్ మెంట్ ను ఎంజాయ్ చేయడానికి సిద్ధపడతారు. వాళ్లంతా ఆశించినట్టుగానే, ‘నాకు విడాకులు కావాలి’ అని భార్యను భర్త ఒత్తిడి చేయడంతో అసలు కథ మొదలవుతుంది. అతను ఆ నిర్ణయం తీసుకోవడానికి కారణం మరో స్త్రీ అని లీలావతికి తెలిసేలా చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు.అసలు ఈ ఇద్దరికీ ఎలా పరిచయమైంది .. ఆ పరిచయం పెళ్లి పీటల వరకూ ఎలా వచ్చింది? అనేది ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. భార్యాభర్తలలో ఎవరో ఒకరు దూరం పెడుతున్నారని అనిపించినప్పుడో .. దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చినపుడో విడాకుల ప్రస్తావన వస్తుంది. విడాకుల ప్రస్తావన ఆ గొడవ మరింత ముదరడానికి కారణమవుతుందనేది ఈ జంట విషయంలోను చూపించారు. కాకపోతే కామెడీ టచ్ ఇచ్చారు. నాకు విడాకులు కావాలని భర్త అంటాడు. నేను ఇవ్వను పో అంటుంది భార్య. కథ మొత్తం ఈ లైన్ పైనే నడుస్తుంది. ఈ విషయంపై ఇంట్లోని నాలుగు గోడల మధ్య వాదనలు జరుగుతూ ఉంటాయి. మధ్య మధ్యలో ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్లి వస్తుంటారు. ఇంట్లో నుంచి మాత్రం బయటికి రారు. ఇక ఆ రెండు పాత్రలతో సంబంధం ఉన్న మరో నాలుగైదు పాత్రలు బయట కాచుకుని ఉంటాయి. లోపల ఏం జరుగుతుందనేది వాళ్లకి కూడా తెలియదు.సీనియర్ నరేశ్ .. మొట్ట రాజేంద్రన్ .. వీటీవీ గణేశ్ వలన కామెడీ వర్కౌట్ కాకపోవడంతో ఆడియన్స్ అసహనానికి లోనవుతారు. అదే సమయంలో సప్తగిరి ఎంట్రీ ఇస్తాడు. హమ్మయ్య కాసేపు నవ్వుకోవచ్చని ప్రేక్షకులు అనుకుంటే, అతను తనకి తోచినట్టుగా ఏకపాత్రాభినయం చేసి వెళ్లిపోతాడు. ఇదంతా చూస్తున్నప్పుడు ఆడియన్స్ కి ఒక సందేహం మాత్రం కలగకుండా ఉండదు. అసలు ఈ సినిమాకి స్క్రిప్ట్ ఉందా లేదా? అని.హారర్ కథల మాదిరిగా ఈ కథేమిటబ్బా గుమ్మం దాటి బయటికి రావడం లేదని ప్రేక్షకులకు చిరాకు పడుతూ ఉండగా, ప్రధానమైన పాత్రల మధ్య ఛేజింగ్ మొదలవుతుంది. కొండపై ఒక పెద్ద సెటప్ .. క్లైమాక్స్ అక్కడే కావడంతో అంతా అక్కడికి చేరుకుంటారు. ఈ ఎపిసోడ్ చూస్తుంటే, మనకు కార్టూన్ షో గానీ .. వీడియో గేమ్ గాని గుర్తుకు రాకుండా ఉండదు

.హీరోయిన్ ను చిన్నప్పటి నుంచి లవ్ చేసే మరుగుజ్జు, వాష్ రూమ్ కి వెళ్లాలంటూ చేసే హడావిడి, ఐస్ క్రీమ్ – గులాబీ జామ్ అంటూ హీరోయిన్ చెప్పే కథలు .. ‘స్వాతిముత్యం’లో కమల్ హాసన్ కంటే అమాయకంగా కనిపించే సైకాలజిస్ట్ పాత్ర .. ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. విషయం లేకుండా నవ్వించడానికి వాళ్లు ఎంత కష్టపడ్డారో .. నవ్వురాక ఆడియన్స్ కూడా అంతే ఇబ్బంది పడతారని చెప్పాలి. కథాకథనాలు మాత్రమే కాదు, సన్నివేశాలు .. సంభాషణలు కూడా అంతే పేలవంగా అనిపిస్తాయి. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరి కేటగిరీలోనే కనిపిస్తాయి. బలహీనమైన కథను బలమంతా ఉపయోగించిలాగినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. అదే విషయాన్ని మరోసారి నిరూపించిన కంటెంట్ ఇది.

# వైసీసీలో కాపు నేతల యాక్టివ్

**విజయవాడ,(భారత శక్తి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కనిపిస్తోంది. ఆ పార్టీ అధికారంలో ఉండగా పదవులు, ఆర్థికంగా లాభ పొందిన వారిలో రెడ్డి సామాజిక వర్గం నేతలు అధికం. కానీ ఇప్పుడు ఆ పార్టీకి ఓటమి ఎదురైన తర్వాత పూర్తిగా సామాజిక వర్గం నేతలు సైలెంట్ అయ్యారు. జగన్ ఎంతవరకు కాపు నేతలతో రాజకీయం చేస్తున్నారు. తమ వారిని మాత్రం రక్షించుకునే పనిలో ఉన్నారు. ఈ రాజకీయం తెలియక వైసీపీలో కాపు నేతలు జగన్ చట్రంలో ఇరుక్కుపోతున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ప్రయోజనాలు రెడ్డి సామాజిక వర్గం నేతల వైతే.. కేసులతోపాటు వివాదాస్పద ముద్ర కాపు నేతలకు దక్కుతోంది. ఇది ఎంత మాత్రం కాపు నేతలు గ్రహించడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో..వైసీపీ ప్రభుత్వంలో సకల శాఖామంత్రిగా ఉండేవారు సజ్జల రామకృష్ణారెడ్డి. రాజ్యసభ సభ్యుడితో పాటు టీటీడీ చైర్మన్ పదవి అనుభవించారు వైవి సుబ్బారెడ్డి. ఉత్తరాంధ్రకు సమన్వయకర్తగా ఉంటూ.. బాగానే వెనకేసుకున్నారు విజయసాయిరెడ్డి. అమరావతి పై విషం కక్కుతూ అడుగడుగునా అడ్డుకున్నారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. రాయలసీమను తన కనుసైగతో శాసించారు పుంగనూరు పెద్దిరెడ్డి. తాడిపత్రిలో సవాల్ చేస్తూ నిలిచారు కేతిరెడ్డి పెద్దారెడ్డి. గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటూ హడావిడి చేసేవారు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి. లిక్కర్ స్కాంతో ఎంతో కొంత వెనుకేసుకున్నారు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. ఇలా చెప్పుకుంటూ పోతే రెడ్డి సామాజిక వర్గమే సింహభాగం లబ్ది పొందింది. అయితే ఇప్పుడు ఓటమి ఎదురు కావడంతో వారంతా సైలెంట్ అయ్యారు.రెడ్డి సామాజిక వర్గం వెళ్లిపోవడంతో కాపు సామాజిక వర్గంతో రాజకీయం చేస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇది గ్రహించక కాపు నేతలు రెచ్చిపోతున్నారు. అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్,బొత్స సత్యనారాయణ లాంటి వారితో రాజకీయాలు చేస్తున్నారు. మధ్యలో విడదల రజిని, జోగి రమేష్ లాంటి వారితో మాట్లాడిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయిస్తున్నారు. వీరు సైతం జగన్ ఎంత చెబితే అంతా అన్నట్టు వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని, పదవులను, ఆర్థిక ప్రయోజనాలను పంచుకున్న వారు మాత్రం ఇటువైపు చూడడం లేదు. అయితే ఇందులో జగన్ కుల ప్రయోజనం ఉంది. అది గ్రహించలేకపోతున్నారు వైసీపీలో ఉన్న కాపు నేతలు. తాము బాధితులుగా జగన్ చేతిలో మారిన వారు.. కాపులు అన్యాయానికి గురైపోతున్నారు అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదు.

### గెలుపు ధీమా...

ఏపీలో తప్పకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా భావిస్తోంది.. అయితే అది ఎలా? ఆ పార్టీకి తెలియాలి. ఎందుకంటే ఆ పార్టీ ప్రజా పోరాటాలు చేయడం లేదు. శాసనసభకు వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడం లేదు. గట్టిగా ప్రశ్నించడం లేదు కూడా. పోనీ పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపుతున్నారా అంటే అదీ లేదు. నిన్న పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. కానీ చాలా నియోజకవర్గాల్లో అసలు ఈ ఆందోళన కార్యక్రమాలు కనిపించలేదు. పెద్ద పెద్ద నేతలు అంతా ముఖం చాటేసారు. అయినా సరే అధికారంలోకి వచ్చేస్తాం అన్న ప్రకటనలు మాత్రం విపరీతంగా వినిపిస్తున్నాయి. అసలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రస్థానం పరిశీలిస్తే 2014 నుంచి 2019 మధ్య ఓకే.. 2019లో అధికారంలోకి వచ్చాక 2024 ఎన్నికలను టార్గెట్ చేసుకొని సంక్షేమ పథకాలను విచ్చలవిడిగా అమలు చేసేసింది. అభివృద్ధిని వదిలేయడంతో ప్రజలు దానిని ఒక నిర్లక్ష్యంగా గుర్తించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించారు. ప్రజలు ఎలా భావించి కూటమికి అధికారం కట్టబెట్టారో.. అదే మాదిరిగా పాలన సాగుతోంది.ఒకవైపు కూటమిపాలనను పరిశీలిద్దాం. అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోంది. దానిపై విషం చిమ్ముతుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ. ఇంకోవైపు పోలవరం నిర్మాణం జరుగుతోంది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఐటీ హబ్ గా మారుతుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు రాయలసీమకు పెద్ద ఎత్తున వస్తున్నాయి. తయారీ రంగ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. రాష్ట్రం లో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. అదే సమయంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల వేటనిషేధ భృతి, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్.. ఇలా ప్రధాన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ప్రజల్లో సంతృప్తి శాతం కనిపిస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోంది. ఇన్ని జరిగాక కూడా తాము అధికారంలోకి వచ్చేస్తాం అంటూ పగటి కలలు కంటోంది వైయస్సార్ కాంగ్రెస్.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లడం లేదు. ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం కోల్పోయారు. జగన్మోహన్ రెడ్డి ప్రజల మధ్యకు రావడం లేదు. వస్తేగిస్తే ఆ పార్టీ నేతల అరెస్టు సమయంలో పరామర్శలకు వస్తున్నారు. ప్రజా పోరాటాల్లో పాల్గొనడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు పై ఉన్న కోపంతో అమరావతిని పడకేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను అస్తవ్యస్తం చేశారు. అభివృద్ధి లేకుండా సంక్షేమ పథకాలతో మరోసారి అధికారంలోకి రావాలని భావించారు. అది మొన్నటి ఎన్నికల్లో వికటించిన ఆయన గుర్తించలేకపోయారు. ఇప్పటికీ అదే ధోరణితో ముందుకు వెళ్తున్నారు. అయినా అధికారం వచ్చేస్తుంది అంటూ ధీమాతో ఉన్నారు. అది ఎంత మాత్రం తగదు కూడా..

## ఎమ్మెల్యే నుంచి కేంద్రమంత్రి పదవికి

**విజయవాడ,(భారత శక్తి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి పాతుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన తన వ్యాపారాల్లో తలమునకలై ఉన్నప్పటికీ తన కార్యాలయంలో ఎప్పుడూ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. వారంలో రెండు రోజుల పాటు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో టిక్కెట్లను ఇప్పించిన వ్యక్తి బీజేపీలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. గత ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు స్థానాన్ని సుజనా చౌదరి ఆశించారు. కానీ తెలుగుదేశం పార్టీకి పొత్తులో భాగంగా వెళ్లింది. మరొకస్థానమయినా కేటాయిస్తారనుకున్నారు. కానీ చివరకు బీజేపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సుజనా చౌదరిని పరిమితం చేసింది. సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గానికే పరిమితమయినా ఏ మాత్రం ఇబ్బంది పడకుండా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు.టీడీపీలో ఉన్న సమయంలో రాజ్యసభ సభ్యుడిగానూ, కేంద్ర మంత్రిగానూ పనిచేసిన సుజనా చౌదరి ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నా సర్దుకుపోతున్నారు. భవిష్యత్ తనకు అనుకూలంగా మారుతుందని లెక్కలు వేస్తున్నారు. ఎలాంటి వివాదాల జోలికి పోవడం లేదు. రాష్ట్రంలో జరిగే రాజకీయ పరిణామాల పట్ల కూడా ఆయన వ్యాఖ్యానించడం లేదు. ఇటు టీడీపీకి అనుకూలంగా కానీ, అటు వైసీపీకి వ్యతిరేకంగా గాని ఎలాంటి ప్రకటనలు చేయకుండా సుజనా చౌదరి కొత్త పాలిటిక్స్ ను మొదలుపెట్టారంటున్నారు. బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు దక్కుతుందని భావించినప్పటికీ అది దక్కలేదు. కానీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని మాత్రం వదలకుండా పట్టుకుని తిరుగుతున్నారురాజకీయాల్లో వేగంగా, ఆవేశంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సుజనా చౌదరికి తెలుసు. అందుకే సమయం కోసం వెయిట్ చేస్తున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో తొలిసారి బీజేపీ గెలిచింది. టీడీపీ ఎప్పుడూ ఇక్కడ గెలవలేదు. టీడీపీ అస్సలు గెలవని చోట విజయం సాధించిన సుజనా చౌదరి ఈసారి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారా? లేక విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారా? అన్న చర్చ కూడా జరుగుతుంది. కృష్ణా జిల్లాకు చెందిన సుజనా చౌదరికి టీడీపీలోని అన్ని నియోజకవర్గాల నేతలతో ఇప్పటికీ సత్సంబంధాలున్నాయి. పొత్తులో భాగంగా ఈసారి విజయవాడ పార్లమెంటు స్థానాన్ని తీసుకుంటే తాను కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లవచ్చని సుజనా చౌదరి ఆలోచనలో ఉన్నారట. అందుకే సమయం కోసం సుజనా వెయిట్ చేస్తున్నారంటున్నారు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

## చింతకాయల విజయ్‌కు బిగ్ టెస్ట్.. !

**శ్రీకాకుళం,(భారత శక్తి)** ఒకవైపు రాజ్యసభ సీటు వరిస్తోంది. మరోవైపు వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశలు కూడా రేకెత్తుతున్నాయి. ఈ క్రమంలో యువ నాయకుడు.. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్య న్నపాత్రుడు తనయుడు విజయ్ ఏ నిర్ణయం తీసుకోవాలని విషయంపై తర్జనభర్జనలు పడుతున్నట్టు తెలుగుదేశంలో టాక్ బలంగా వినిపిస్తోంది. గత కొన్నా ళ్లుగా ఆయనకు రాజ్యసభ స్థానం దక్కుతుందన్న ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి గత ఎన్నికల్లోనే అనకాపల్లి నుంచి పార్లమెంటుకు పోటీ చేయాలని అనుకున్నారు.. పొత్తులో కుదరకపోవడంతో నర్సీపట్నం నుంచి అసెంబ్లీకి అయినా పోటీ చేద్దాం అనుకున్నారు. రాజకీయ వాతావరణ నేపథ్యంలో అప్పట్లో సీఎం చంద్రబాబు చింతకాయల అయ్యన్నపాత్రుడు వైపే మొగ్గుచూపారు. దీంతో విజయ్‌కు అవకాశం రాలేదు. అయితే, పార్టీలో యాక్టివ్ గా ఉండడంతోపాటు యువ నాయకుడిగా ముఖ్యంగా లోకేష్ బృందంలో కూడా విజయ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయనను రాజ్యసభకు పంపిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం అయితే జరిగింది. ప్రస్తుతం కూడా అదే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. రెండు స్థానాలను టిడిపి తన అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. దీంతో ఒకటి అయ్యన్నపాత్రుడు తనయుడికి ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. కానీ, మరోవైపు వచ్చే ఎన్నికల్లో విజయ్ నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని కూడా అంటున్నారు. మరి ఈ రెండిట్లో ఏది తీసుకుంటారు.. వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉంటారా.. లేకపోతే రాజ్యసభకు వెళ్తారా అనేదానిపై పార్టీలో గట్టిగా చర్చ మొదలైంది. విజయ్ రాజ్యసభకు కాకుండా వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ చేసే వ్యూహం ఉందని పార్టీ సీనియర్ వర్గాలు చెబుతున్నాయి. యువ నాయకుడు, ఉత్సాహవంతుడు రాజ్యసభకు వెళ్లడం కన్నా వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయడం ద్వారా మేలు జరుగుతుందని మెజారిటీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై పార్టీ అధినేత కూడా సిద్ధంగా ఉన్నారని అంటున్నారు. మొత్తంగా ఈ వ్యవహారం ప్రస్తుతం టిడిపిలోనూ రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిగా మారింది. అయితే ఇంత జరుగుతున్నా అయ్యన్నపాత్రుడు మాత్రం మౌనంగా ఉన్నారు. ఏం జరిగితే అదే జరుగుతుంది అన్నట్టుగా ఆయన చూస్తూ మౌనంగా పాటిస్తున్నారు. మరి వాస్తవానికి విజయ్ అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడమే మంచిది అన్న అభిప్రాయం స్థానికంగా వినిపిస్తుండడం గమనార్హం.

## విశాఖ తూర్పులో టీడీపీ మార్క్ మార్పు

**విశాఖపట్టణం (భారత శక్తి)**విశాఖ జిల్లా ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళ పాటు ఎన్నికలు జరిగాక వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అతి కొద్ది మంది నేతలలో ఆయన కూడా ఒకరుగా ఉన్నారు.విశాఖ తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పాటు అయిన దగ్గర నుంచి వరసబెట్టి టీడీపీ గెలుస్తూ వస్తోంది. ఇప్పటికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే అన్ని సార్లూ టీడీపీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యేగా వెలగపూడి రామక్రిష్ణబాబు ఉన్నారు. ఆయన ఈసారితో ఏకంగా 20 ఏళ్ళ పాటు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని పాలించిన నేతగా రికార్డు క్రియేట్ చేస్తున్నారు. విశాఖ జిల్లా ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళ పాటు ఎన్నికలు జరిగాక వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అతి కొద్ది మంది నేతలలో ఆయన కూడా ఒకరుగా ఉన్నారు. అయితే ఆయనకు సామాజిక సమీకరణల కారణంగా మంత్రి పదవి అయితే దక్కలేదు. మరో వైపు చూస్తే ఆయన తన వారసుడిని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉంచారు. ఇదిలా ఉంటే ఈ మధ్య జరిగిన జిల్లా పార్టీ ఎమ్మెల్యేల సమీక్షా సమావేశంలో అధినేత చంద్రబాబు తూర్పు నియోజకవర్గాన్ని ఉద్దేశించి కొన్ని కీలకమైన కామెంట్స్ చేశారు. అవి ఇపుడు పార్టీలోనూ రాజకీయంగానూ చర్చగా ఉన్నాయని అంటున్నారు. వెలగపూడికి ఓపిక తగ్గింది అంటూ అధినాయకత్వం కామెంట్స్ చేసింది అని ప్రచారం సాగుతోంది. దాంతో పాటుగా తూర్పులో బలంగా ఉన్న సామాజిక వర్గం యాదవులను కూడా కలుపుకుని పోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. దాంతో తూర్పు మీద హైకమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టిందని అర్థం అవుతోంది అని అంటున్నారు. ఈ మధ్య టీడీపీ రాష్ట్ర జాతీయ కమిటీల నియామకంలో తూర్పు నియోజకవర్గం నుంచి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ కి కీలక పదవి దక్కింది. అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నేత వెలగపూడికి అయితే ఏ పదవీ ఇవ్వలేదు. ఆయన వారసుడు కుమారుడు అయిన యువ నేతకు కూడా స్థానం కల్పించలేదు. దాంతో తూర్పు లో మార్పు ఖాయమా అన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. ఇక ప్రణవ్ గోపాల్ అయితే మంత్రి నారా లోకేష్ టీం లో ఉన్నారని అంటున్నారు. అందుకే ఆయనకు ఎంతో ప్రతిష్టాత్మకమైన వీఎంఆర్డీఏ చైర్మన్ పదవిని కట్టబెట్టడమే కాకుండా మరోసారి కూడా పొడిగించి కొనసాగిస్తున్నారు అని గుర్తు చేస్తున్నారు. ఇపుడు పార్టీలో కూడా కీలకం చేస్తున్నారు అంటే వచ్చే ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ నుంచి ఆయనని పోటీ చేయిస్తారా అన్న చర్చ సాగుతోంది.మరో వైపు తూర్పులో అత్యధిక శాతం బీసీలు ఉన్నారు. వారంతా తమకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరుతున్నారు. యాదవ సామాజిక వర్గం అయితే గాజువాకతో పాటు తూర్పు కూడా ఇవ్వాలని అపుడే సమ న్యాయం అవుతుందని వాదిస్తోంది. దాంతోనే యాదవులను కూడా కలుపుకుని పోవాలని హైకమాండ్ సూచించినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఒకవేళ సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుంటే యాదవుల నుంచి కూడా సమర్థులైన నాయకులు టీడీపీకి ఉన్నారని గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద చూస్తే 2029 లో సీట్లు కనుక పెరగకపోతే మాత్రం టీడీపీలో భారీ మార్పు ఉంటుందని అంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి హవా సాగుతున్నప్పటికీ పార్టీదే అంతిమ నిర్ణయం కాబట్టి ఏమి జరుగుతుందో చూడాల్సి ఉందని అంటున్నారు.

## ట్రాక్టర్ను ఢీకొట్టిన బైక్.. ముగ్గురు మృతి

**మహబూబాబాద్ (భారత శక్తి)**తొర్రూరు మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ధాన్యం లోడుతో వెళుతున్న ట్రాక్టర్ను వెనుక నుంచి వచ్చిన బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. వెలికట్ట శివారులో ఈ ప్రమాదం జరిగింది. మృతులు దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన అల్లి సంపత్(25), లింగమల్ల సతీష్(28), పొట్టకర్ల వంశీ(22) గా గుర్తించారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## రాజకీయాల్లోకి మౌనిక...

**కర్నూలు(భారత శక్తి)** నంద్యాల రాజకీయ గడ్డపై మరో భూమా వారసురాలి గర్జన వినిపించబోతోంది. దివంగత భూమా నాగిరెడ్డి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఇప్పటికే ప్రజాక్షేత్రంలో చురుగ్గా ఉంటున్న భూమా మౌనిక రెడ్డి నేరుగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు టాలీవుడ్ హీరో, ఆమె భర్త మంచు మనోజ్ స్పష్టం చేశారు. భూమా కుటుంబం నుంచి మరో కీలక నాయకురాలు అసెంబ్లీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు.

మంచు మనోజ్ భార్య భూమా మౌనిక రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెలువడిన అధికారిక ప్రకటన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఈ దంపతులు కలిసి ప్రారంభించిన ఐక్య ధైర్య సేన సమితి కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమని చెబుతూనే, మౌనిక రాజకీయ అరంగేట్రంపై మనోజ్ క్లారిటీ ఇచ్చారు. దీంతో భూమా నాగిరెడ్డి ఆశయ సాధన కోసం మౌనిక ప్రత్యక్ష రాజకీయాల్లో తనదైన ముద్ర వేయబోతున్నట్లు స్పష్టమవుతోంది. భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల ద్వితీయ కుమార్తె మౌనికకు రాజకీయాలు కొత్తేమీ కాదు. భూమా నాగిరెడ్డి మరణం తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తన సోదరి భూమా అఖిలప్రియ విజయం కోసం గర్భిణీగా ఉండి కూడా ఆమె చేసిన పాదయాత్ర, ప్రసంగాలు అప్పట్లో అందరినీ ఆకట్టుకున్నాయి. మౌనికలో ఉన్న వాగ్ధాటి, ప్రజలతో మమేకమయ్యే నైజం భూమా అనుచరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం ఒక సెలబ్రిటీ భార్యగానే కాకుండా, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలిచే ధైర్యవంతురాలిగా ఆమెకు పాత నంద్యాల జిల్లాలో మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అయితే మౌనిక రెడ్డి మాత్రం కేవలం తన సోదరి వెనుక ఉండిపోయే పాత్రకు భిన్నంగా, సొంతంగా తన రాజకీయ భవితవ్యాన్ని నిర్మించుకోవాలని భావిస్తున్నారు. తన తండ్రికి కంచుకోట లాంటి నంద్యాల నియోజకవర్గం లేదా సమీప ప్రాంతాల్లో ఆమె పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి ఐక్య ధైర్య సేన ద్వారా ఆమె చేస్తున్న పర్యటనలు ఎన్నికల ముందు బలమైన పునాదిగా మారుతున్నాయి.మౌనిక పోటీ చేయడం ఖాయమని మనోజ్ ప్రకటించినప్పటికీ, ఏ పార్టీ నుంచి బరిలోకి దిగుతారనే విషయాన్ని మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. కుటుంబ గౌరవాన్ని కాపాడుతూ, ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చే ఏ పక్షం వైపు అయినా మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. భూమా మౌనిక రెడ్డి రాకతో నంద్యాల, ఆళ్లగడ్డ పాలిటిక్స్ మరింత ఆసక్తికరంగా మారబోతున్నాయి. సోదరి అఖిలప్రియతో కలిసి పని చేస్తారా లేక స్వతంత్రంగా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారా అన్నది వేచి చూడాలి.

## చిలకలూరిపేట రూరల్ పోలీసుల తనిఖీల్లో రూ. 45 లక్షల నగదు సీజ్

**గుంటూరు(భారత శక్తి)** చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి తాతపూడి వద్ద ఎస్పీ గారి ఆదేశాల మేరకు పోలీసులు తెల్లవారుజామున 12:30 గంటల సమయంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో విజయవాడ నుండి చెన్నై వెళు న్న 'ఐరా బస్ ట్రావెల్స్' కు చెందిన బస్సులో ప్రయాణిస్తున్న హనీఫ్ మొహమ్మద్ హనీఫ్ అనే వ్యక్తి బ్యాగును సోదా చేయగా, ఎటువంటి పత్రాలు లేని సుమారు 45 లక్షల రూపాయల నగదు లభ్యమైంది.

విచారణలో అతను ఈ నగదుతో చెన్నై వెళ్లి బంగారం కొనుగోలు చేయడానికి వెళ్తున్నట్లు తెలిపాడు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో, నగదును మరియు సదరు వ్యక్తిని తదుపరి దర్యాప్తు నిమిత్తం విజయవాడలోని జాయింట్ డైరెక్టర్ ఇన్కమ్ టాక్స్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్కు అప్పగించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

# జెన్ జీ కోసం పాపులేషన్ పాలసీ

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన పాపులేషన్ పాలసీ ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు, విమర్శలకు కేంద్రబిందువుగా మారింది. జనాభా నియంత్రణ నుంచి జనాభా పెంపు వైపు ఆయన తీసుకున్న ఈ యూ-టర్న్ వెనుక బలమైన ఆర్థిక కారణాలు ఉన్నప్పటికీ, సామాజికంగా మాత్రం అది తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. రాజకీయంగా తక్షణ లాభం లేని, పైగా వివాదాస్పదమైన ఈ అంశాన్ని ఆయన పదే పదే ప్రస్తావిస్తూ విమర్శలకు గురవుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జననాల రేటు ప్రమాదకరంగా పడిపోతోందని, ఇదే కొనసాగితే భవిష్యత్తులో పనిచేసే యువత కరువై, రాష్ట్రం వృద్ధాశ్రమంగా మారుతుందన్నది ఆయన ప్రధాన ఆందోళన. జపాన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాలు ఇప్పుడు ఎదుర్కొంటున్న జనాభా సంక్షోభాన్ని ఉదాహరణగా చూపుతూ ఆయన మేల్కొలుపు పలుకుతున్నారు. అయితే, ఈ పిలుపునకు రాజకీయ వర్గాల నుంచి కంటే సామాజిక వర్గాల నుంచే గట్టి సెగ తగులుతోంది.చంద్రబాబు ప్రతిపాదించిన నగదు ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఫెమినిస్టులు , మహిళా సంఘాలు నిప్పులు చెరుగుతున్నాయి. కేవలం డబ్బు ఆశ చూపి మహిళల శరీరాలను జనాభా ఉత్పత్తి యంత్రాలు గా మార్చాలని చూడటం అప్రజాస్వామికమని వారు వాదిస్తున్నారు. పిల్లల్ని కనాలా వద్దా అన్నది దంపతుల వ్యక్తిగత నిర్ణయమని, అందులో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరైనది కాదని మండిపడుతున్నారు. ముఖ్యంగా గర్భధారణ, ప్రసవం వల్ల మహిళల ఆరోగ్యంపై పడే ప్రభావాన్ని ఆర్థిక ప్రోత్సాహకాలతో తూచలేమని వారు స్పష్టం చేస్తున్నారు.నేటి తరం యువ దంపతులు పిల్లల విషయంలో చాలా భిన్నంగా ఆలోచిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆకాశాన్నంటుతున్న విద్యా, వైద్య ఖర్చుల దృష్ట్యా ఒకరిని పెంచడమే భారంగా భావిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.30 వేలు ఒక నెల పాలకు, డైపర్లకు కూడా సరిపోవు.. మరి ఆ బిడ్డ 20 ఏళ్లు పెరిగి పెద్దయ్యే వరకు అయ్యే లక్షల రూపాయల ఖర్చు ఎవరు భరిస్తారు అన్నది సామాన్యుల నుంచి వస్తున్న సూటి ప్రశ్న. ఈ ఆర్థిక వాస్తవాలను విస్మరించి కేవలం జనాభా సంతులనం కోసం పిల్లల్ని కనమనడం క్షేత్రస్థాయిలో ట్రోలింగ్‌కు దారితీస్తోంది. రాజకీయ నాయకులు సాధారణంగా తక్షణ ఓట్లు రాల్చే పథకాల గురించి మాట్లాడతారు.
కానీ చంద్రబాబు ప్రతిపాదించిన ఈ జనాభా విధానం వల్ల ఆయనకు వచ్చే తక్షణ రాజకీయ లాభం సున్నా. పైగా, ఇది తీవ్రమైన విమర్శలకు, ట్రోలింగ్‌కు దారితీస్తోంది. అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గడం లేదు. చంద్రబాబు వాదనను బలపరిచే వారు కూడా లేకపోలేదు. యువత లేని దేశం మనుగడ సాగించలేదు అన్నది ఆర్థిక నిపుణుల మాట. ఒకప్పుడు జనాభాను భారంగా చూసిన మనం, ఇప్పుడు డెమోగ్రాఫిక్ డివిడెండ్ గురించి మాట్లాడుకుంటున్నాం. చంద్రబాబు సూచనలు ఈరోజు వినడానికి వింతగా ఉన్నా, మరో రెండు దశాబ్దాల తర్వాత అప్పుడు పుట్టిన పిల్లలు లేకపోతే రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీస్తుందన్నది ఆయన సిద్ధాంతం. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు అనుభవిస్తున్న చేదు అనుభవాలే ఆయనకు ప్రేరణ.కేవలం పిల్లల్ని కనమని చెప్పడం కంటే, వారి పెంపకానికి అవసరమైన సామాజిక రక్షణ వ్యవస్థను ప్రభుత్వం నిర్మించాల్సిన అవసరం ఉంది.

ఉచిత విద్య, మెరుగైన వైద్యం, తల్లులకు ఉద్యోగ భద్రత వంటి అంశాలపై హామీ ఇవ్వకుండా కేవలం నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల ఫలితం ఉండదు. అలాగే, ప్రస్తుత యువతకు ఉన్న ఆర్థిక ఆందోళనలను ప్రభుత్వం గౌరవించాలి. రాజకీయంగా లాభం లేకపోయినా, వ్యక్తిగత ఇమేజ్ దెబ్బతింటున్నా చంద్రబాబు ఈ అంశాన్ని వదలడం లేదు. ఇప్పుడు వస్తున్న ట్రోల్స్ తాత్కాలికమే కావొచ్చు, కానీ ఆయన చెప్పిన జనాభా సంక్షోభం నిజమైతే మాత్రం భవిష్యత్తులో ఆయనను గొప్ప ముందుచూపున్న నాయకుడిగా చరిత్ర గుర్తిస్తుంది.

# మిత్రపక్షాల మధ్య సీట్ల లెక్కలు

**విజయవాడ,(భారత శక్తి)** వచ్చే నెల జరగనున్న నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో అమితాసక్తిని రేకెత్తిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమికి అసెంబ్లీలో ఉన్న తిరుగులేని బలంతో, ఈ నాలుగు స్థానాలూ ఏకగ్రీవంగా కూటమి ఖాతాలోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. అందుకే అభ్యర్థుల ఎంపిక, మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకాలపై ఇప్పుడు చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సభ్యులు?ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, మరియు పరిమల్ నత్వానీల పదవీ కాలం జూన్ 21, 2026తో ముగియనుంది. ఖాళీ అవుతున్న ఈ నాలుగు స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయనుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సుమారు 164 మంది ఎమ్మెల్యేల బలంతో, ఒక్కో స్థానానికి అవసరమైన కోటా ఓట్లు సులభంగా లభిస్తాయి. దీంతో విపక్ష వైఎస్సార్‌సీపీకి ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కూడా లేని పరిస్థితి నెలకొంది.ఈ నాలుగు స్థానాల్లో సీట్ల పంపకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అగ్రనాయకత్వం మధ్య ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగినట్లు సమాచారం. అందుతున్న సంకేతాల ప్రకారం.. నాలుగు స్థానాల్లో రెండు స్థానాలను తెలుగుదేశం పార్టీ తన వద్దే ఉంచుకుని, ఒకటి జనసేన కు, మరొకటి బీజేపీ కి కేటాయించే అవకాశం ఉంది. జాతీయ రాజకీయాల్లో బీజేపీకి మద్దతుగా ఉండటంతో పాటు, రాష్ట్రంలో జనసేన త్యాగాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.బీజేపీకి కేటాయించే ఒక స్థానంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. తమిళనాడులో పార్టీని బలోపేతం చేసేందుకు, ఫైర్ బ్రాండ్ నేత కె. అన్నామలై ని ఏపీ నుంచి రాజ్యసభకు పంపాలని బీజేపీ హైకమాండ్ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనను పార్లమెంటుకు పంపడం ద్వారా 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి మైలేజీ వస్తుందని ఢిల్లీ పెద్దల వ్యూహం. ఒకవేళ అన్నామలై కాకపోతే, రాష్ట్రానికి చెందిన కీలక నేత లేదా కేంద్ర మంత్రివర్గంలో ఉన్న ఎవరైనా ఒకరికి ఈ అవకాశం దక్కవచ్చు.జనసేన పార్టీకి దక్కే ఒక సీటు కోసం పార్టీలో గట్టి పోటీ నెలకొంది. పవన్ కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితులు లింగమనేని రమేష్ పేరు వినిపిస్తోంది. పార్టీ కోసం ఆర్థికంగా , నైతికంగా అండగా నిలిచినందున ఆయనకు ఈ అవకాశం దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది. పవన్ కళ్యాణ్ ఈ విషయంలో సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీకి దక్కే రెండు స్థానాల కోసం ఆశావహుల జాబితా చాంతడంత ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన సీనియర్ నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు.

గత ఎన్నికల్లో సీటు త్యాగం చేసిన వారు, కీలకమైన సామాజిక వర్గాలకు చెందిన నేతల పేర్లను పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయం పాటించాలని టీడీపీ యోచిస్తోంది. అసెంబ్లీలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉండటంతో, వారు అభ్యర్థిని నిలబెట్టే సాహసం చేయడం లేదు. దీంతో కూటమి ప్రకటించే నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలే 99 శాతం ఉన్నాయి. వచ్చే నెలలో నోటిఫికేషన్ వెలువడగానే ఈ ఉత్కంఠకు తెరపడనుంది. మొత్తం మీద ఈ రాజ్యసభ ఎన్నికలు కూటమిలోని మూడు పార్టీల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఉండబోతున్నాయి.

## రసాయన శాస్త్రంలో
# కేత స్వరూపకు పీహెచ్.డీ.



**పటాన్‌చెరు మే 20 భారత శక్తి** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కేత స్వరూప డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'చాల్కోన్ కలిపిన పిరిడిన్-పిరిమిడిన్, 1,2,4-ఆక్సాడయాజోల్ కలిపిన ఇండోలిజైన్-థయాడయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, జీవ మూల్యాంకనం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ స్వరూప చేసిన డాక్టరల్ పరిశోధన, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో, ఆశాజనకమైన వైద్యపరమైన అనువర్తనాలు కలిగిన నూతన రసాయన సమ్మేళనాల అభివృద్ధిపై దృష్టి సారిస్తుందన్నారు. ఈ పరిశోధనలో భాగంగా, డాక్టర్ స్వరూప ఔషధపరంగా ముఖ్యమైన రసాయన నిర్మాణాలను ఏకీకృతం చేయడం ద్వారా జీవశాస్త్రపరంగా ప్రాముఖ్యత కలిగిన రెండు శ్రేణుల సమ్మేళనాలను రూపొందించి, సంశ్లేషించినట్టు తెలిపారు. సంశ్లేషించిన ఈ సమ్మేళనాలను ఎన్ఎంఆర్ స్పెక్ట్రోస్కోపీతో సహా ప్రామాణిక విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగించి నిర్మాణాత్మకంగా వర్గీకరించి, తదనంతరం వాటి జీవ క్రియాశీలతను మూల్యాంకనం చేశారన్నారు. అనేక సమ్మేళనాలు ప్రోత్సాహకరమైన ఫలితాలను కనబరిచాయని, భవిష్యత్తు ఔషధ అభివృద్ధికి వాటి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయని వివరించారు.ఈ అధ్యయనం ఔషధ రసాయన శాస్త్ర రంగానికి విలువైన అంతర్దృష్టులను అందిస్తుందని, క్యాన్సర్ చికిత్స కోసం సమర్థవంతమైన చికిత్సా ఏజెంట్ల అభివృద్ధికి కొత్త మార్గాలను తెరుస్తుందన్నారు.డాక్టర్ స్వరూప సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మానసిక వికలాంగుల
# ఆశ్రమంలో అన్నదానం

**- ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు**

**- యువనేత ముద్దగౌని మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు**



**ఎల్బీనగర్, మే 20: భారత శక్తి** ప్రజాసేవకుడే పరమార్థంగా భావించే నాయకుడి పుట్టినరోజు వేడుకలు నిరాడంబరంగా, సేవాభావంతో నిర్వహించారు. పిసిసి మాజీ కార్యదర్శి, ఎల్.బి. నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

### నిరుపేదలకు, ప్రత్యేక పిల్లలకు అండగా..

యువనాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ ఆధ్వర్యంలో సాహెబ్ నగర్ పరిధిలోని గౌతమి నగర్ నివాస ప్రాంతంలో ఉన్న 'శాంతినికేతన్ మానసిక వికలాంగుల ఆశ్రమం' (శాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ) లో ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో వెనుకబడిన, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. రామ్మోహన్ గౌడ్ పుట్టినరోజును ఇలా సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందంటూ ఆశ్రమ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.

### తరలివచ్చిన యువత:

ఈ అన్నదాన కార్యక్రమంలో శాంతినికేతన్ సంస్థ నిర్వాహకులు బాలేశ్వర్ తో పాటు స్థానిక యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శాండీ, సోను యాదవ్, ఆశీష్ చౌదరి, సన్నీ, అంజి, వంశీ, గౌతమ్, సాయి తదితరులు పాల్గొని అన్నదానాన్ని విజయవంతం చేశారు. రామ్మోహన్ గౌడ్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ ప్రజాసేవలో ముందడుగు వేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

# తరగతి గదులకు అతీతంగా విద్యాభ్యాసం

**- భవిష్యత్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు: - డా. అశ్విని తానాజీ వాకడే**

**కరీంనగర్ (భారత శక్తి)**ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని, జిల్లా కలెక్టర్ మరియు చైర్‌పర్సన్ సమగ్ర శిక్ష మార్గదర్శకత్వం ప్రత్యేక చొరవతో కరీంనగర్ జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.మే 15 నుండి ప్రారంభమైన ఈ 15 రోజుల సమ్మర్ క్యాంపులు ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ మరియు టీజీఎంఎస్ పాఠశాలల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నారు. మొత్తం 11 ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉచితంగా ఈ క్యాంపులను నిర్వహిస్తున్నాయి. ఇందులో 11 కంటే ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యా ప్రగతి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సృజనాత్మకత, శారీరక దృఢత్వం మరియు వ్యక్తిత్వ వికాసానికి అవకాశాలు కల్పిస్తున్నారు.విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం,ఈ క్యాంపులు విద్యార్థులకు తరగతి గదులకు అతీతంగా సార్థకమైన అభ్యాస అనుభవాలను అందిస్తూ సహపాఠ్య కార్యక్రమాలపై ఆసక్తి పెంపొందించేందుకు దోహదపడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ ఈ కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తుందన్నారు.స్పోకెన్ ఇంగ్లీష్ సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలను క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గంగాధర మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ రావు సమన్వయం చేస్తూ విద్యార్థుల పాల్గొనుటను పర్యవేక్షిస్తున్నారు.ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలలో నమోదు పెంపుతో పాటు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం భవిష్యత్ సిద్ధతకు ఎంతో దోహదపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## బదిలీ చేసినా కుర్చీ వదలని
# డిప్యూటీ కలెక్టర్ షర్మిలపై సస్పెన్షన్ వేటు!

**- లంచాలు, అక్రమాలపై సీఎంఓ వరకూ ఫిర్యాదులు**

**- ఉట్నూర్ ఆర్డీఓగా పంపినా 'హెచ్ఎండీఏ' దాటని వైనం**

**- నిబంధనల ధిక్కరణపై సీరియస్ అయిన సిసిఎల్ఏ**

**- అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటవద్దని హుకుం**



**హైదరాబాద్ మే 20, భారతశక్తి:** రాష్ట్ర రెవెన్యూ శాఖలో కలకలం రేపిన డిప్యూటీ కలెక్టర్ ఎం. షర్మిల అవినీతి, మొండికేంపు వ్యవహారానికి ఎట్టకేలకు బ్రేక్ పడింది. హెచ్ఎండీఏలో తిష్టవేసి, బదిలీ ఉత్తర్వులను సైతం బేఖాతరు చేసిన ఆమెపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీ అండ్ ఏ) నియమావళి, 1991లోని రూల్ 8 ప్రకారం షర్మిలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సిసిఎల్ఏ) లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

### విజిలెన్స్ నుంచి సీఎంఓ దాకా కంప్లైంట్లు!


చాలా కాలంగా డెప్యుటేషన్ (అన్యసేవలు) పై హెచ్ఎండీఏలో కీలక బాధ్యతల్లో ఉన్న షర్మిల.. అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆమె బాధితుల నుంచి విజిలెన్స్ విభాగానికే కాకుండా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీనిపై అంతర్గత విచారణ జరిపిన ఉన్నతాధికారులు.. ప్రాథమిక చర్యగా ఆమెను లూప్ లైన్ లోకి నెట్టేందుకు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగానే కొంతకాలం క్రితం ఆమెను ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీఓ)గా, జిల్లా ఎన్నికల నమోదు అధికారిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

### పోస్టింగ్ ఇచ్చిన చోటుకు వెళ్లకుండా మొండికేసి

ఉట్నూర్ బదిలీ అయినా డిప్యూటీ కలెక్టర్ షర్మిల మాత్రం హెచ్ఎండీఏ కుర్చీని వదిలేందుకు నిరాకరించారు. కొత్తగా కేటాయించిన స్థానంలో విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు పలుమార్లు మౌఖికంగా ఆదేశించినా లైట్ తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలను, ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కనబెట్టి తీవ్ర ధిక్కరణకు పాల్పడ్డారు.

### ఎన్నికల ప్రక్రియకు బ్రేక్!

డిప్యూటీ కలెక్టర్ షర్మిల బదిలీ అయిన స్థానంలో జాయిన్ కాకపోవడం వల్ల ఆదిలాబాద్ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక నిరంతర సవరణ (SIR) మ్యాపింగ్ ప్రక్రియపై తీవ్ర ప్రభావం పడిందని సిసిఎల్ఏ తన ఉత్తర్వుల్లో తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వ అత్యవసర విధులను నిర్లక్ష్యం చేయడం క్షమించరానిదని పేర్కొన్నారు.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Public Servants - Revenue Department - Smt. M.Sharmila,Deputy Collector, transferred and posted as RDO,Utnoor, which is designated as Electoral Registration Officer, Adilabad Dist.,- Not reported to duty - Placed under suspension under Rule 8 of TCS (CC&A) Rules, 1991 - Orders - Issued.

REVENUE (VIG.I) DEPARTMENT

G.O.Rt.No.266 Dated:19.05.2026.
Read:-

G.O.Rt.No.240,Rev(Ser.I)Dept.,Dated:04.05.2026.

&&&&

ORDER:-

In the reference read above, orders were issued transfer and posting of certain officers in Revenue Department. Smt.M.Sharmila, Deputy Collector,HMDA,was transferred and posted as RDO,Utnoor, which is designated as Electoral Registration Officer Adilabad District . But she has not joined duty in the said post. This may be affected to Special Intensive Revision(SIR) mapping in the District.

2. Now therefore, the Government in exercise of the powers conferred under Rule 8 of TCS(CC&A) Rules, 1991 hereby place Smt.M.Sharmila, Deputy Collector, Deputation in HMDA, under suspension with immediate effect and She shall remain under suspension until further orders.

3. During the period this order remains in force, Smt.M.Sharmila, Deputy Collector, shall not leave the headquarters without obtaining the prior permission of the undersigned.

4. It is further ordered that during the period of suspension, Smt.M.Sharmila, Deputy Collector, shall be paid subsistence allowance as per rules in vogue.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

LOKESH KUMAR D.S
SECRETARY TO GOVERNMENT

To
Smt.M.Sharmila, Deputy Collector,HMDA
through the Chief Commissioner of Land Administration, TS, Hyderabad.
Copy to :-
The Chief Commissioner of Land Administration,
Telangana State, Hyderabad. (with a request to serve the Suspension order to the mentioned officer and furnish dated acknowledgment to the Govt.)
The Chief Electoral Officer & E.O. Secretary,
General Administration (Elections) Department.
The District Collector, Adilabad District.
The Revenue (Ser.I) Department.
SC/SF.

//FORWARDED :: BY ORDER//

SECTION OFFICER

### హెడ్‌క్వార్టర్స్ దాటొద్దు: సిసిఎల్ఏ హుకుం

తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆమె సస్పెన్షన్‌లోనే కొనసాగుతారని సిసిఎల్ఏ స్పష్టం చేసింది. అంతేకాదు, ఈ సస్పెన్షన్ కాలంలో సిసిఎల్ఏ ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని (హెడ్‌క్వార్టర్స్) విడిచి ఎక్కడికీ వెళ్లకూడదని గట్టిగా ఆదేశించింది. ఉన్నతాధికారులను సైతం లెక్కచేయకుండా హెచ్ఎండీఏలో తిష్టవేసిన అధికారిణిపై సస్పెన్షన్ వేటు పడటం రెవెన్యూ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# పింఛనుదారులకు అలర్ట్

**- ఈ నెల 28 లోగా 'జీవన ప్రమాణ ధృవీకరణ' తప్పనిసరి**

**- సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు**

**- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అధికారుల లభ్యత**

**- ఆధార్ కార్డుతో రావాలని అధికారుల విజ్ఞప్తి**







**ఎల్బీనగర్ మే 20 భారత శక్తి,** చేయూత పథకం ద్వారా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు అధికారులు కీలక ప్రకటన చేశారు. పింఛను పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా సాగాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా 'జీవన ప్రమాణ ధృవీకరణ' (లైవ్‌లీనెస్ అథెంటికేషన్) చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఆయా వార్డుల లబ్ధిదారులు తమ ఆధార్ కార్డుతో స్థానిక బిల్ కలెక్టర్లు లేదా పన్ను ఇన్‌స్పెక్టర్లను సంప్రదించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

### వార్డుల వారీగా ధృవీకరణ కేంద్రాలు ఇవే..

లబ్ధిదారుల సౌకర్యార్థం ఆయా వార్డుల పరిధిలో నిర్దేశించిన కేంద్రాల వివరాలను అధికారులు విడుదల చేశారు.

**సరూర్‌నగర్ వార్డు:** సర్కిల్ కార్యాలయం, సరూర్‌నగర్.

**ఆర్.కే.పురం వార్డు:**
ఆర్.కే.పురం వార్డు కార్యాలయం, కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్.

**కొత్తపేట్ వార్డు:** కొత్తపేట్ వార్డు కార్యాలయం, మహిళా భవన్.

**చైతన్యపురి వార్డు:** కొత్తపేట్ వార్డు కార్యాలయం, మహిళా భవన్.

**గడ్డియన్నారం వార్డు:** గడ్డియన్నారం వార్డు కార్యాలయం.

సమయం.. గడువు గుర్తుంచుకోండి!

ఈ ధృవీకరణ ప్రక్రియ మే 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మాత్రమే నిర్వహించబడుతుంది. నిర్దేశిత సమయంలోగా సంబంధిత బిల్ కలెక్టర్లు, పన్ను ఇన్‌స్పెక్టర్లు ఆయా కేంద్రాలలో అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే వారికి ధృవీకరణ ప్రక్రియ నిలిపివేయబడుతుందని, కాబట్టి లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో తమ జీవన ప్రమాణ ధృవీకరణను పూర్తి చేసుకోవాలని అధికారులు కోరారు.

## సున్నిపెంట భూముల సమస్యలకు
# శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు

**సున్నిపెంట/నంద్యాల,(భారత శక్తి)** శ్రీశైలం డ్యామ్ పరిసర ప్రాంతాల అభివృద్ధి, భూముల వినియోగం, ప్రభుత్వ ప్రణాళికలు మరియు ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వెల్లడించారు. మంగళవారం సున్నిపెంటలో రూ.10 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ ప్రారంభించారుఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆస్తులన్నీ ప్రజలకే చెందుతాయని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సున్నిపెంట ప్రాంతంలో మరిన్ని డ్రైనేజీలు, అంతర్గత రహదారుల అవసరం ఉన్నట్లు గుర్తించామని, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసి, త్వరలోనే పరిపాలనా మంజూరులు పొందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'జలహారతి' కార్యక్రమం సందర్భంగా శ్రీశైలం డ్యామ్ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు, స్థానిక ఎమ్మెల్యే ప్రాంత అభివృద్ధి అవసరాలు, రహదారుల పరిస్థితిని వివరించారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు.శ్రీశైలం డ్యామ్ నిర్మాణ చరిత్రను ప్రస్తావిస్తూ, 1963 జూలై 19న డ్యామ్‌కు పునాది పడిందని గుర్తు చేశారు.

అప్పట్లో ఈ ప్రాంతం మొత్తం అటవీ శాఖ పరిధిలో ఉండేదని, రిజర్వ్ ఫారెస్ట్ మరియు వైల్డ్‌లైఫ్ శాంక్చురీ నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిపారు. అనంతరం డ్యామ్ నిర్మాణ అవసరాల కోసం అటవీ భూమిని డీ-రిజర్వ్ చేసి, 1964 నుంచి 1968 మధ్యకాలంలో సుమారు 1468 ఎకరాలను శ్రీశైలం డ్యామ్ నిర్మాణానికి కేటాయించారని, ప్రస్తుతం ఆ భూములు నీటి పారుదల శాఖ పరిధిలో ఉన్నాయని వివరించారు.ఇటీవల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించిన భూసర్వేలో కొండవాలు ప్రాంతాల్లో భూమి జారిపో వడంతో ప్రస్తుతం 1427 ఎకరాల 24 సెంట్ల భూమి అందుబా టులో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.
సర్వే ప్రకారం ఈ ప్రాంతంలో ఇళ్లు, వాణిజ్య సముదాయాలు కలిపి మొత్తం 5,824 నిర్మాణాలు ఉండగా, 22 వేలకుపైగా జనాభా నివసిస్తున్నట్లు వెల్లడించారు. డ్యామ్ నిర్మాణం మరియు కాలువల నిర్మాణానికి సు మారు 450 ఎకరాల భూమిని వినియోగించారని తెలిపారు. మిగిలిన భూమిలో ఇరిగేషన్ శాఖ ఉద్యోగుల కోసం వివిధ కేడర్ల కు చెందిన సిబ్బందికి సుమారు 2,360 క్వార్టర్స్ నిర్మించారని కలెక్టర్ చెప్పారు. అదనంగా పాఠశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఆసుపత్రి, పోస్టాఫీస్, బ్యాంకులు తదితర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు భూములను కేటాయించా రని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy